ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




శనివారం 18 జూలై 2026 | Saturday 18 July 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 104 | Vol.No 28 Issue No .104 | www.visionandhra.in

# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

- హైడ్రోజన్ రైలుతో నూతన శకం ఆరంభం
- తొలి రైలును జెండా ఊపి ప్రారంభించిన మోడీ
- అనేక ప్రత్యేకతలతో పర్యావరణహితంగా తయారీ

న్యూఢిల్లీ,జులై17 : భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి చేరింది. భారత రైల్వే చరిత్రలో నూతన శకం ఆరంభమైందనే చెప్పాలి. రైల్వే రంగంలో పర్యావరణహిత విధానాలను ప్రవేశపెట్టే దిశగా కీలక ముందడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు శుక్రవారం పట్టాలెక్కింది. హైడ్రోజన్‌తో నడిచే తొలి రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. మిగతా2లో..



# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

- రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం
- సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు

న్యూఢిల్లీ,జూలై17 :న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.100 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిగతా2లో..



# ధరణి అక్రమాలపై విచారణకు సిట్ ఏర్పాటు

- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం
- ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ
- ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినేట్
- జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం
- పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు - సీతారామల అంచనా వ్యయాల పెంపు



హైదరాబాద్,జూలై17 : తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ధి చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో మిగతా2లో..

# మంథనిలో న్యాక్ స్కిల్ డెవలెప్ మెంట్ సెంటర్...

- భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు
- సీఎం రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డికి మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు

హైదరాబాద్,జూలై17 : పెద్దపల్లి జిల్లా మంథనిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసీ) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. మిగతా2లో..



# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

- నగదురహిత వైద్య సేవలకు శ్రీకారం
- ఇచ్చిన హామీ మేరకు పథకం ప్రారంభం

మిగతా2లో..



# కృత్రిమ మేధస్సు ఉన్నత విద్యపై పరిశోధనా వ్యాసాలకు ఆహ్వానం

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకృష్ణారెడ్డి



విజన్ ఆంధ్ర (17) హైదరాబాద్ : కృత్రిమ మేధస్సు ఉన్నత విద్య అంశంపై తెలంగాణ ఉన్నత విద్య జర్నల్ (టీ.జే.హెచ్.ఈ.) తదుపరి సంచిక కోసం అసలు, ఇప్పటివరకు ఎక్కడా ప్రచురితం కాని పరిశోధనా వ్యాసాలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆహ్వానించింది, ఉన్నత విద్యలో నాణ్యమైన పరిశోధన, విధానపరమైన చర్చలు, సాక్ష్యాధారిత విద్యా విధానాల రూప కల్పనకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో మండలి పీర్ సమీక్షిత ద్వైవార్షిక పరిశోధనా జర్నల్‌ను నిర్వహిస్తోంది. ఇప్పటికే మూడు ప్రత్యేక మిగతా2లో..

# దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

- ఏకంగా 191 మందికి ఉద్యోగ నియామక పత్రాలు
- రవీంద్రభారతి వేదికగా మంత్రి కొండా సురుఖ అందచేత
- దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామన్న మంత్రి
- వర్షాల కోసం ఆలయాల్లో వరుణయాగం నిర్వహణకు సంకల్పం



హైదరాబాద్,జూలై17 : దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, దేవాలయ వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదని మంత్రి సురేఖ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 191 మంది మతపరమైన ఉద్యోగుల నియామక ఉత్తర్వుల అందజేత కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన పలువురికి నియామక పత్రాలు అందజేశారు. వీరిలో రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాలకు మిగతా2లో..

# యువ సంగ్రామ సదస్సుపై రేవంత్ కుట్ర

- అనుమతిని అడ్డుకున్నా..హైకోర్టు ఆర్డర్ ఇచ్చింది
- నిరుద్యోగుల గళం వినిపిస్తామన్న కెటిఆర్



హైదరబాద్,జూలై17 : బీఆర్ఎస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు తెలంగాణ హైకోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక మిగతా2లో..

# అమృత్ పథకంలో మంగళగిరి స్టేషన్ ఆధునీకరణ

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ
- దేశ సర్వతోముఖాభివృద్ధికి రైల్వేలు ఎంతో కీలకం - లోకేశ్



మంగళగిరి,జూలై17 : దేశ సర్వతో ముఖాభివృద్ధికి రైల్వేలు ఎంతో కీలకమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కనెక్టివిటీ పెరిగితేనే ప్రగతి సాధ్యమవుతుందని చెప్పారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సరికొత్త హంగులతో మంగళగిరి రైల్వేస్టేషన్‌ను పునర్‌వ్యవస్థీకరించారు. రూ.12.56 కోట్ల భారీ వ్యయంతో ఆధునికీకరణ చేశారు. శుక్రవారం ఈ స్టేషన్‌ను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిగతా2లో..

# కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఫిల్మ్ ఫెడరేషన్ షాక్

- వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని షోకాజ్ నోటీసులు



హైదరాబాద్,జూలై17 : కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఫిల్మ్ ఫెడరేషన్ షాక్ ఇచ్చింది. ఫిల్మ్ ఫెడరేషన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ అతడికి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జులై 12న జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలను ఫిల్మ్ మిగతా2లో..

# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

- రుణ వితరణ కార్యక్రమంతో వ్యాపారవేత్తలుగా సామాన్యులు
- సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మాలాసీతారామన్ సహకారం
- కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
- నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి




నరసరావుపేట, జూలై 17 : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలు చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి మిగతా2లో..

## ధరణి అక్రమాలపై విచారణకు సిట్ ఏర్పాటు

జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు అసాధ్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణ తక్షణమే అమలులోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్ ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణ కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది.

## అమృత్ పథకంలో మంగళగిరి స్టేషన్ ఆధునీకరణ

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'దేశ ఆర్థిక, సామాజిక ప్రగతిలో రైల్వేశాఖ కీలకపాత్ర పోషిస్తోంది. దేశాన్ని ఏకం చేసే ఏకైక అతిపెద్ద సంస్థ రైల్వే మాత్రమే. గతంలో రైల్వే వ్యవస్థలో తీవ్ర ఆలస్యాలు, భద్రతా లోపాలు ఉండేవి. కానీ నేడు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో 'కవచ్' ఆటోమేటిక్ ప్రొటెక్షన్ వంటి అత్యాధునిక సిస్టమ్‌తో దేశంలో అపూర్వమైన రైల్వే విప్లవం నడుస్తోంది. మంగళగిరి నియోజకవర్గానికి రైల్వే పరంగా మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. ఇక్కడ మరిన్ని రైళ్లు ఆగేలా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ చూపాలని కోరుతున్నా. మంగళగిరిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక పథకం తీసుకురావాల్సిన అవసరముంది. ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే కలిసికట్టుగా పనిచేస్తే నియోజకవర్గ అభివృద్ధి ఎలా ఉంటుందో చూపించడానికి నేడు మంగళగిరి ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలిచింది. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు చూడాలని సీఎం చంద్రబాబే స్వయంగా కుప్పం నేతలకు చెప్పారు. రాజధాని అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. దీనికోసం రైల్వే, రోడ్డు, ఎయిర్ లైన్ రవాణా వ్యవస్థలను అనుసంధానం ఎంతో అవసరం. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, సాంకేతికంగా వేగంగా అభివృద్ధి చేస్తున్నాం. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాల వైపు చూడాల్సిన అవసరం లేకుండా చేస్తాం' అని లోకేశ్ అన్నారు.

## కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఫిల్మ్ ఫెడరేషన్ షాక్

ఫెడరేషన్ సీరియస్‌గా తీసుకుంది. జులై 14న విచారణకు హాజరు కావాలంటూ అతడికి సూచించింది. దీనిపై జానీ మాస్టర్ నుంచి స్పందన లేదు. దీంతో ఫిలిం ఫెడరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వారం రోజుల్లో లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని జానీ మాస్టర్‌ను ఆదేశించింది. బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించింది. అలాగే డ్యాన్సర్ల అసోసియేషన్ తీరుపై ఫిల్మ్ ఫెడరేషన్ మండిపడింది. డ్యాన్సర్ల అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జనరల్ బాడీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని ఆమెకు స్పష్టం చేసింది. డ్యాన్సర్ల ఉపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. అయితే వివరణ ఇచ్చే వరకు డాన్సర్ అసోషియేషన్‌తోపాటు జానీ మాస్టర్‌కు సహకరించకూడదంటూ అనుబంధ సంఘాలకు ఫిలిం ఫెడరేషన్ ఆదేశాలు జారీ చేసింది.

## మంథనిలో న్యాక్ స్కిల్ డెవలెప్ మెంట్ సెంటర్...

ఈ కేంద్ర భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణ రంగానికి అవసరమైన అత్యుత్తమ మానవ వనరుల్ని తీర్చిదిద్దడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. నిర్మాణ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను యువత అందిపుచ్చుకునేలా అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ ఇక్కడ లభించనుంది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సుల ద్వారా శిక్షణార్థులకు స్వయం ఉపాధితో పాటు ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక న్యాక్ సెంటర్ ను మంథనికి కేటాయించడంపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నిర్మాణ రంగంలో ఉత్తర తెలంగాణ యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణను అందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను కల్పించేలా ఈ కేంద్రం వారధిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

హైదరాబాద్,జూలై17 : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత వైద్య సేవల పథకాన్ని ప్రారంభించింది. దీనిని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులు, ట్రస్ట్ డీడ్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 17.88 లక్షల మందికి ఆరోగ్య భద్రత లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్, 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో లబ్దిదారులకి నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కేర్, కామినేని, కాంటినెంటల్, స్టార్, బసవతారకం వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సేవలు పొందొచ్చు. మొత్తం 1,816 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను ఈ పథకం ద్వారా అమలు చేయనున్నారు. ప్రీ-ఆథరైజేషన్ నుంచి ÷-లకెయిమ్ సెటిల్‌మెంట్ వరకు పక్రియ మొత్తం పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగనుంది. ఉద్యోగులు, పెన్షనర్ల భాగస్వామ్యంతో ఇఊఅ÷ు ట్రస్ట్ ద్వారా దీన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం కూడా వాటా ఇవ్వనుంది. దీని అమలు కోసం రాష్ట్రంలో ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా.. త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇకపై ప్రతి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా నాణ్యమైన, పారదర్శక, సుస్థిర వైద్య సేవలను ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసినట్లైంది.

## యువ సంగ్రామ సదస్సుపై రేవంత్ కుట్ర

అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ' జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో జరగబోయే యువ సంగ్రామ సదస్సును అడ్డుకొని, నిరుద్యోగ యువత గొంతు నొక్కుదామని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి కుట్ర విఫలమయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే... గౌరవ హైకోర్టు ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ, సదస్సుకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ఎన్ని అవరోధాలు సృష్టించినా... యువత తరపున బీఆర్ఎస్ పార్టీ గళం విప్పుతూనే ఉంటుంది. యువతీ యువకులారా.. తరలిరండి.. సరూర్‌నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ మోసాలను ఎండగడదాం. రేవంత్ సర్కార్ మెడలు వంచుదాం. హామీల అమలుకు జంగ్ సైరన్ పూరిద్దాం. ఛలో సరూర్‌నగర్ స్టేడియం. నేటి ఉదయం 10 గంటలకు' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నిక వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ముఖ్యంగా యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేయలేదని విమర్శించింది. అందుకోసం జులై 18వ తేదీన సరూర్ నగర్ స్టేడియం వేదికగా యువ సంగ్రామ సదస్సు నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈ సదస్సుకు హాజరుకావాలని యువతకు పిలుపునిచ్చింది. ఈ సదస్సు కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాట్లు చేసింది. అయితే దీనికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై శుక్రవారం కోర్టు విచారణ జరిపింది. వాంతి భద్రతల సమస్య తలెత్తుతుందంటూ నిఘా వర్గాల నుంచి నివేదిక అందిందని ప్రభుత్వం తరఫున న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సదస్సు నిర్వహించే ప్రాంతంలో పార్కింగ్ ఏర్పాట్లు లేవని తెలిపారు. దాంతో 17 రోజుల క్రితం ఈ సదస్సు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఎందుకు నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ విషయాలను ఆ పార్టీ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదంటూ ప్రశ్నించింది. దీంతో ఈ సదస్సు నిర్వహణకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు మంజూరు చేసింది.

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు

- జిల్లా కలెక్టర్ మను చౌదరి హామీ
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రతినిధుల వినతికి సానుకూల స్పందన
- నిబంధనల పేరుతో అర్హులను ఇబ్బంది పెట్టొద్దని విజ్ఞప్తి
- అక్రిడిటేషన్ జారీలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్
- సీనియర్ రిపోర్టర్లందరికీ కార్డులు అందేలా చర్యలు: కలెక్టర్
- అక్రిడిటేషన్ కమిటీ పూర్తి సహకారం అందిస్తామని భరోసా
- త్వరలోనే అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావం

కుత్బుల్లాపూర్, జూలై 17 (విజన్ ఆంధ్ర): మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు మీడియా అక్రిడిటేషన్ కార్డులు అందజేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హత కలిగిన వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజేఐజేయూ) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్రాం రెడ్డితో పాటు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ, జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న అర్హులైన సీనియర్ రిపోర్టర్లందరికీ నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రిడిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుందని, అర్హులైన ఒక్క జర్నలిస్టు కూడా నష్టపోకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు టీయూడబ్ల్యూజే ప్రతినిధులు మాట్లాడుతూ, నిబంధనలను సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ ప్రక్రియలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. జర్నలిస్టుల వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న



అక్రిడిటేషన్ దరఖాస్తుల పరిష్కారానికి వేగం పెరిగి, అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మల్కయ్య, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు రామారావు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రవి కిరణ్ రెడ్డి, డబ్ల్యూడబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ. 100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ. 7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ. 2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ. 10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా, మహిళా న్యాయవాదులకు కోర్టుల్లో కనీస సదుపాయాలు కల్పించే అంశంపై సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని అడ్వకేట్ జనరల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించాలని సూచించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 770/2026 విచారణ సందర్భంగా తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల వైద్య అత్యవసరాలు, కుటుంబ భద్రత, ఆర్థిక సహాయానికి తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తోందని అఫిడవిట్‌లో ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయనీ వెల్లడించింది.

## దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

ఎంపికైన అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులున్నారు. 191 మంది ఉద్యోగుల నియామకం చేపట్టడం తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, స్టేట్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ డైరక్టర్ విజయ రాఘవాచార్యులు, దేవాదాయశాఖ ఆర్‌జెసి రామకృష్ణారావు, డిసి కృష్ణప్రసాద్, ఎడిసి లు శ్రీనివాస్, జ్యోతి, ఎసి రామాల సునీత, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, డాక్టర్ ఆర్. శ్రీరామ ఘనాపాటి, కేంద్రమాజీ మంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి,పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఆలయాల్లో ఖాళీగా ఉన్న మతపరమైన పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. అర్చకుల దేవతారాధన, వేదపండితుల వేద పారాయణం, పరిచారకుల నిత్య కైంకర్య సేవలు, ఆధ్యాత్మికశోభను పెంపొందించే మృదంగ వాయిద్య కళాకారులు, దైవానికి నైవేద్యం, భక్తులకు ప్రసాదాన్ని సిద్ధంచేసే వంటవారు తదితర ఉద్యోగులంతా నిష్ఠతో వుంటేనే దేవాలయాల వైభవం, పవిత్రత, ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దేవాలయ ఉద్యోగమంటే ఉపాధి లేదా ఉద్యోగంగా భావించకుండా భగవంతుని సేవ చేసే అరుదైన అవకాశం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే గొప్ప బాధ్యత అని మీరు భావించాలి. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తించి భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలని మంత్రి సురేఖ నియామక ఉత్తర్వులందుకున్న ఉద్యోగులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా దేవాలయాలకు ప్రత్యేకంగా భావించే రోజుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు చెప్పే విధంగా త్వరలో ఉత్తర్వులిస్తామని మంత్రి సురేఖ ప్రకటించారు. త్వరలో ఆయా గుళ్ళలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగస్తులకు పనితీరును బట్టి అవార్డులు ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇప్పటికే సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించిందని, రాబోయే రోజులు గోదావరి, కృష్ణ నదీ పుష్కరాలను అదే స్థాయిలో నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. గిరిజన జాతరగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. ఉాష్ట్రంలో ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వరుణయాగం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ యాగాల ద్వారా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయా దేవాలయాల్లో పూజలు చేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖని దేవాదాయ ఉద్యోగులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

హరియాణాలోని జింద్-సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో ఈ రైలు ప్రయాణించనుంది. ఉత్తర రైల్వేలో ప్రయోగాత్మక ప్రాజెక్టుగా దీనిని ప్రవేశపెట్టారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతను రైల్వేలో వినియోగిస్తున్నారు. హైడ్రోజన్ ద్వారా విద్యుదుత్పత్తి చేసి రైలును నడిపే ఈ సాంకేతికతను డీజిల్ ట్రైన్స్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్‌లో హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే ప్రత్యేక సదుపాయాలనూ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో భారత్ చేరడం గర్వకారణం. స్వచ్ఛమైన, సుస్థిర సాంకేతికతను రైల్వే రంగంలో విస్తరించేందుకు ఇది కీలక అడుగుగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే.. రానున్న కాలంలో మరిన్ని మార్గాల్లో ఈ సేవల్ని విస్తరించే అవకాశాలున్నాయి. ఇది రైల్వే రంగంలో కాలుష్య నియంత్రణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, స్వచ్ఛ ఇంధన వినియోగానికి కొత్త దిశను చూపనుంది. జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాలు హైడ్రోజన్ ఆధారిత రైలు సాంకేతికతను ఇప్పటికే అభివృద్ధి చేస్తున్నాయి. కాగా.. ప్రపంచంలోనే తొలి హైడ్రోజన్ ప్యాసింజర్ రైలును జర్మనీ ప్రవేశపెట్టింది. 2002లో అల్‌స్టోమ్ కొరాడియా ఐలింట్ రైలు ఎలాంటి ఇంధనం లేకుండా 1,175 కి.మీ. ప్రయాణించి రికార్డు సృష్టించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో 2024లో తొలి హైడ్రోజన్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. అయితే.. 2027 నాటికి జపాన్.. తొలి హైడ్రోజన్ హైబ్రిడ్ రైలును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దేశంలో ప్రారంభం అయిన ఈ హైడ్రోజన్ రైలు తొలుత ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపత్ సెక్షన్‌లో నడుస్తుంది. 89 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. మధ్యలో 12 స్టేషన్లలో ఆగుతుంది. 10 కోచ్‌లతో ఈ రైలును అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 2600 మంది ప్రయాణించొచ్చు. త్వరలోనే కల్కా-శిమ్లా వంటి సాంస్కృతిక వారసత్వ రైల్వే లైన్‌లోనూ హైడ్రోజన్ పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్ రైళ్లు.. పైన ఉండే కరెంటు తీగల నుంచి విద్యుత్‌ను తీసుకుంటాయి. ఇక, సంప్రదాయ డీజిల్ రైలు ఇంజిన్లు ఇంధనాన్ని మండించి యాంత్రిక శక్తిని ఉత్పత్తి చేస్తాయి. హైడ్రోజన్ రైలు సొంతంగా కరెంట్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. దీని కోసం రైల్లో 'ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్' అనే చిన్నపాటి పవర్‌ప్లాంట్ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లు ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయి. తొలిసారిగా జర్మనీ దీన్ని ప్రవేశపెట్టింది. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు ప్రయోగాత్మకంగా నడపడమో లేక పరిమితంగా వినియోగంలోకి తీసుకురావడమో చేస్తున్నాయి. 1,200 కిలోవాట్ల సామర్థ్యం ఉండే ఫ్యూయెల్ సెల్‌లో హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య జరుగుతుంది. తద్వారా విద్యుత్ ఉత్పత్తవుతుంది. హైడ్రోజన్‌ను ట్యాంకుల రూపంలో రైలు మోసుకెళుతుంది. ఆక్సిజన్‌ను పరిసరాల్లోని గాలి నుంచి సేకరిస్తుంది. ఇలా ఉత్పత్తయిన విద్యుత్.. రైలులోని ట్రాక్షన్ మోటార్లకు శక్తిని అందిస్తుంది. అవి చక్రాలను నడుపుతాయి. దీని ప్రొపల్షన్ వ్యవస్థ సామర్థ్యం 3,200 హెచ్‌పీ. దీంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్న శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా ఇది నిలిచింది. ఇది గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఇది శుద్ధ ఇంధన పరిజ్ఞానం. ఈ పక్రియలో నీటి ఆవిరి, వేడి మాత్రమే ఉప ఉత్పత్తులుగా వెలువడతాయి. ఇందులో దహనచర్య జరగదు. అందువల్ల హానికారక పొగ, కర్బనఉద్గారాలు వెలువడవు. ధ్వని కూడా తక్కువే. రైల్లోని నాన్‌స్టాప్ వెంటిలేషన్ వ్యవస్థ.. గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూస్తుంది. అందువల్ల ఏదైనా లీకేజీ తలెత్తినా అది గాల్లోకి వెళ్లి, పలుచబడిపోతుంది. ప్రమాదాన్ని గుర్తిస్తే.. ఆటోమేటిక్ షట్‌ఆఫ్ వ్యవస్థ తనంతట తాను హైడ్రోజన్ సరఫరాను నిలిపివేస్తుంది. ఈ రైల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు ఉన్నాయి. అవి హైడ్రోజన్ లీకేజీలు, వేడి, మంటలు, పొగ వంటి ముప్పులపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతాయి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సెకన్లలోనే అప్రమత్తం చేస్తాయి. భద్రతకు ప్రాధాన్యమిస్తూ లోకోపైలట్ క్యాబిన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. లోకో పైలట్ ఎదుట ఉండే ఒక స్క్రీన్.. అన్ని అంశాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది.

## రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ. 3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ. 7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ. 40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు. "మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ. 29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారు దేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్దిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేతయూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (ఆఅఅః) కి రూ. 25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ. 17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ. 14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్దిదారులు పాల్గొన్నారు. సభకు ముందు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు

## కృత్రిమ మేధస్సు ఉన్నత విద్యపై పరిశోధనా వ్యాసాలకు ఆహ్వానం



సంచికలను విజయ వంతంగా ప్రచురించిన మండలి, నాలుగో సంచికను కృత్రిమ మేధస్సు మరియు ఉన్నత విద్య అనే ప్రధాన అంశంతో జూలై డిసెంబర్ 2026 కాలానికి తీసుకురానుంది, ఈ సంచికలో బోధన, అభ్యాసం, పరిశోధన, మూల్యాంకనం, విద్యా పరిపాలన, విద్యా సమగ్రత, నైతిక విలువలు, విధాన రూపకల్పన, అధ్యాపకుల అభివృద్ధి, డిజిటల్ అంతరాలు, భవిష్యత్ విశ్వ విద్యాలయాల రూపకల్పన తదితర అంశాలపై పరిశోధనా వ్యాసాలను స్వాగతిస్తున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి తెలిపారు, తెలంగాణ, భారతదేశానికి సంబంధించిన అంశాలతో పాటు అంతర్జాతీయ పరిణామాలను విశ్లేషించే వ్యాసాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, విద్యాసంస్థల నిర్వాహకులు, విధాన రూపకర్తలు తమ అసలు పరిశోధనా వ్యాసాలు, అనుభవాధారిత అధ్యయనాలు, సిద్ధాంత పరమైన వ్యాసాలు, విధాన విశ్లేషణలు, కేసు అధ్యయనాలు, సమీక్షాత్మక వ్యాసాలను సమర్పించాలని సూచించారు, వ్యాసాలు మూడు వేల నుంచి ఎనిమిది వేల పదాల మధ్య ఉండాలని, నిర్దేశిత రచనా విధానాన్ని అనుసరిస్తూ బ్రిటిష్ ఆంగ్ల భాషలో సిద్ధం చేయాలని తెలిపారు, ఇతరత్రా ప్రచురితం కాని, ప్రస్తుతం మరే ఇతర పత్రికలో పరిశీలనలో లేని వ్యాసాలనే స్వీకరిస్తామని స్పష్టం చేశారు, సమర్పించిన వ్యాసాల్లో సారూప్యతతో పాటు కృత్రిమ మేధస్సు ఆధారంగా రూపొందించిన అంశాల శాతాన్ని కూడా పరిశీలిస్తామని, ఈ రెండింటిలో ఏదైనా 15 శాతానికి మించి ఉంటే ఆ వ్యాసాలను పరిగణనలోకి తీసుకోబోమని వెల్లడించారు, పరిశోధనా వ్యాసాల సమర్పణకు 2026 సెప్టెంబర్ 30ను చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు, పూర్తి మార్గదర్శకాలు తెలంగాణ ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వ్యాసాలను మండలి ప్రకటించిన సంపాదకుల ఈ మెయిల్ చిరునామాకు కూడా పంపవచ్చని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## కుడితిలో పడ్డ ఎలుకలా బిఆర్ఎస్ !

సార్వత్రక ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలుగు రాష్ట్రాలలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతు న్నాయి. పొత్తులు పొడుస్తున్నాయి. పొత్తులు లేనిదే ముందుకు కదలలేని పరిస్థితి ఉందన్నది స్పష్టం. అయితే ఇరు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కేవలం లెఫ్ట్ పార్టీలతోనే వెళుతోంది. ఎపిలో కేవలం టిడిపి, జనసేన పొత్తులు మాత్రమే ఖరారు అయ్యాయి. బిజెపి పొత్తుల కోసం ఈ రెండు పార్టీలు ఎదురు చూస్తున్నాయి. అయితే బిజెపి చేరితే లెఫ్ట్ పార్టీలు దూరంగా ఉండనున్నాయి. దీంతో అవి అనివార్యంగా కాంగ్రెస్‌తో కలసి వెళతాయి. అలాగే కాంగ్రెస్ కూడా ఎవరో ఒకరు తోడుగా ఉండాలనే కోరుకుంటోంది. మొత్తంగా ఎపిలో వైసిపి ఒంటరి పోరుకు సిద్దం అయ్యింది. మొత్తంగా సమయం దగ్గర పడడంతో పరిణామాలు ఎలా ఉండ బోతున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. ఇకపోతే తెలంగాణలో కాలంమారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బిఆర్ఎస్ పార్టీ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితులలో లోక్‌సభకు ఎన్నికలు జరగనుండడంతో బీఆర్ఎస్ ఇరకాటంలో పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి నెలలు గడవకముందే ఈ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో ఈ రెండు పార్టీలను ఢీకొని నిలదొక్కుకోవడం బీఆర్ఎస్‌కు అంత సులువు కాదు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావం చూపలేని పరిస్థితి ఎదురైతే ఆ తర్వాత పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో మున్సిపాల టీటలు అన్నీ కాంగ్రెస్ ఖాతాలో పడుతున్నాయి. టపటపా వికెట్లు రాలుతున్నాయి. బిఆర్ఎస్ పట్ల నేతల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. ఒక్కొక్కరే అధికార పార్టీలోకి జంప్ అవుతున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ తరపున గెలిచిన ఎంఎల్ఏలలో ఎంతమంది మిగులుతారో తెలియని పరిస్థితి ఉంది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో మోడీదే హవా అంటూ..బిఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు బిజెపి కూడా పావులు కదుపుతోంది. తెలంగాణలో ప్రతిపక్షపాత్ర పోషించాలని భారతీయ జనతా పార్టీ చూస్తోంది. దీనినుంచి బయటపడడానికి ఎన్డీఎలో చేరాలన్న ప్రతిపాదనలు బిఆర్ఎస్ ముందున్నాయని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా కేంద్రంలో అధికారం పంచుకోవాలన్న ఆలోచన కూడా వీరికి ఉంది. అందుకే ఈ మధ్య బిజెపి, బిఆర్ఎస్ పొత్తులపై విపరీతంగా వార్తలు వస్తున్నాయి. అధికారంలో ఉన్నంత వరకు మజ్లిస్ పార్టీతో దోస్తానా ఉంది. ఇప్పుడు మజ్లిస్ పార్టీ కూడా మెల్లగా కాంగ్రెస్‌కు దగ్గరవుతోంది. ప్రస్తుత పరిస్థితులలో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీని ఎదుర్కొని నిలదొక్కుకుంటూ పార్టీని బతికించుకోవడం ముఖ్యమని అందుకు ఎన్‌డిఎలో చేరడం ద్వారా ఎంపి సీట్లు గెల్చుకోవాలని కొందరు అభిప్రాయపడుతున్నారు. అప్పుడు మళ్లీ కేంద్రంలో అధికారం లో ఉండవచ్చన్నది కూడా వాదనగా ఉంది. ఒంటరిగా పోటీ చేయడం ద్వారా.. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తే దాని ప్రభావం పార్టీ మనుగడపై పడుతుంది. అదే జరిగితే పార్టీ నుంచి వలసలను అపలేమని మరికొందరు భయపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల గండాన్ని ఎదుర్కోవడం ఇప్పుడు బిఆర్ఎస్ ముందున్న అతి పెద్ద సవాల్‌గా చూడాలి. పార్టీ మనుగడ కోసం విధిలేని పరిస్థితులలో బిజెపితో పొత్తు గురించి ఆలోచిస్తున్నామని పార్టీ నేతలు కొందరు చెప్పుకొచ్చారు. ఇప్పటికైతే విశ్రాంతి తీసుకుంటున్న కేసీఆర్‌కు ఇప్పుడు పార్టీని నిలబెట్టుకోవడం కత్తి మీద సావే అవుతుంది. శాసనసభ సమావేశాల్లో పాల్గొనకుండా ఎంతకాలం ఉండగలరన్నది కూడా ముఖ్యమే. ఏది ఏమైనా బీఆర్ఎస్ నాయకులకు భవిష్యత్తు అగమ్య గోచరంగా కనిపిస్తున్నది. ఈ కారణంగా బీజేపీతో పొత్తు పెట్టుకుంటే... అని ఆలోచన చేస్తున్నారు. మరోవైపు సిఎం రేవంత్ సవాళ్లు విసురుతున్నారు. అవినీతి కేసులు కూడా తరుముకుని వస్తున్నాయి. కాళేశ్వరం గుదిబండగా మారనుంది. అవినీతి చిట్టాల్లో ఒక్కో అవినీతి మెల్లగా బయటకు రాగలదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు కూడా జారుకుంటే పార్టీని కాపాడుకోవడం వల్లకాదు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ లేచి నిలబడలేదని, దానిని దెబ్బతీస్తే విపక్షంలో తామే ఉంటామని బిజెపి కూడా ఆలోచిస్తోంది. బీజేపీ రాష్ట్ర నాయకులు కూడా బీఆర్ఎస్‌తో పొత్తుకు సుముఖంగా లేరు. మోడీ చరిష్మాతో పోతే కనీసం పది ఎంపి సీట్లు గెలుస్తామన్న ధీమాలో స్థానిక బిజెపి నేతలు ఉన్నారు. కాంగ్రెస్ కూడా కమ్యూనిస్టులతో కలసి పోరాడడం ఖాయంగా ఉంది. మజ్లిస్ కలసివస్తే ఆలోచిస్తామన్న ధోరణిలో ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించడంకోసమే జాతీయ రాజకీయాలలోకి వెళుతున్నానని ప్రకటించిన కేసీఆర్... తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చారు. ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించి కొంతమంది ప్రతిపక్ష నాయకులను ఆహ్వానించారు. దీంతో తెలంగాణకు చెందిన ఆ పార్టీ నాయకులు భ్రమల్లోకి వెళ్లారు. ఇక మోడీని ఢీకొట్టేది కెసిఆర్ మాత్రమే అని ప్రచారం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమి ఇప్పుడు మోడీకి వ్యతిరేకంగా అవతరించింది. అందులో కూడా కెసిఆర్‌కు ఛాన్స్ లేదు. ఈ క్రమంలో బిజెపితోనే బలవంతపు సంసారం చేయాలి. అదికూడా బిజెపి ఒప్పుకుంటేనే. లేకుంటే ఒంటరి పోరు తప్పదు. ఈ పోరులో బిఆర్ఎస్ గెలవడం అంత సులభం కాకపోవచ్చు. అలాగే తెలంగాణ ప్రజల తిరస్కరణకు గురైన కేసీఆర్ ఇకపై జాతీయ రాజకీయాల గురించి ఆలోచించే అవకాశం లేకుండా చేసుకున్నారు. రేవంత్ కూడా మెల్లగా అడుగులు వేస్తూ కెసిఆర్ ప్రభుత్వ కాలంలో జరిగిన అవినీతి చిట్టాలను విప్పుతున్నారు. విపరీతమైన అధికార దుర్వినియోగం జరిగిందని, అవన్నీ బట్టబయలు కానున్నాయని అంటున్నారు. ఈ క్రమంలో కేంద్రం అండ ఉండాలని కెసిఆర్ భావిస్తున్నారు.

## ఆర్యవైశ్య సంఘం అల్వాల్ నూతన అధ్యక్షుడిగా అమర శ్రీనివాస్ గుప్తా నియామకం



అల్వాల్, జూలై 17, (విజన్ ఆంధ్ర) : ఆర్యవైశ్య సంఘంఅభివృద్ధికి తన శాయశక్తు లా కృషి చేస్తానని ఆర్య వైశ్య సంఘం అల్వాల్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన అమర శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం అల్వాల్ పట్టణంలోని శ్రీ సాయి సూర్య ఎన్‌క్లేవ్ ఫేజ్2లోని శ్రీ వాసవి కన్యకా పరమే శ్వరి దేవాలయంలో జరిగిన సమావేశంలో ఆర్యవైశ్య సంఘం అల్వాల్ (అవస) నూతన అధ్యక్షుడిగా అమర శ్రీనివాస్ గుప్తా ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని అందుకున్న ఆయనను, సంఘం ప్రతినిధులు, సభ్యులు కలిసి పూలబొకే శాలువాతో సన్మానించి, హార్దిక శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమర శ్రీనివా స్ గుప్తా మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి, తన ను ఆర్యవైశ్య సంఘం అల్వాల్ నూతన అధ్యక్షు డిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాపై మీరందరూ ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా మీ అందరి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,అందరి సలహాలు, సూచ నలు,సహకారంతో సంఘం అభివృద్ధికి ఐక్యతతో పని చేస్తానని ఆయనతెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు ఆర్. అరు ణ్ కుమార్, బోనగిరి గోవ ర్ధన్, తడక వెంకటేష్, అశ్వత్ నారాయణ, పబ్బ చంద్రశేఖర్, తాటిపల్లి రమేష్, వాసవి మాత దేవా లయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం ఆనందబాబు, దేచు గంగాధర్, గోలి వేణు గోపాల్, తోట శివ, మంద మూల వీరేశం, శివరాత్రి శ్రీనివాస్, గుమ్మడవెల్లి శ్రీని వాస్, సంఘు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

## రైల్వే ప్లాన్ మార్చి వినాయక్ నగర్ లో ఆర్ యుబీ చేపట్టాలి

### రైల్వే డీజీఎం కె.కిరణ్ కుమార్ కు వినాయక్ నగర్ అభివృద్ధి కమిటీ వినతి



మల్కాజిగిరి, జూలై 17,(విజన్ ఆంధ్ర): వినాయక్ నగర్ లోని రైల్వే ప్లాన్ మార్చి, ఆర్ యుబీ చేపట్టాలని వినాయక్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్,డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి కోరారు. గురువారం వారు, దక్షిణ మధ్య రైల్వే డీజీఎం కె.కిరణ్ కుమార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వినాయక నగర్ లో చేపట్టాలనుకున్న ఆర్ యుబీ ప్లాన్ మార్చి ఇక్కడ చిన్నగా, చంద్రగిరి కాలనీలో బస్సు పోయే విధంగా పెద్ద ఆర్ యుబీని నిర్మించాలన్నారు. ఇలా ఆర్ యుబీ ప్లాన్ మార్చి నిర్మాణం చేపడితే స్థానికులకు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయ కులు గరబోయిన నర్సింగ్ రావు, ఓం ప్రకాష్, పోచన్న, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రతి శుక్రవారం 'డ్రైడే' సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 17 (విజన్ ఆంధ్ర) దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించేందుకు ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం కొత్తకోట పట్టణంలోని 3వ వార్డులో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడడం, దోమల నివారణ చర్యలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, ప్రతి ఇంటిని సందర్శించి దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నీరు నిల్వ ఉండే పాత్రలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జ్వరం లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని, పారిశుధ్యంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. పురపాలికలో డ్రైనేజీలను సైతం నిత్యం సక్రమంగా శుభ్రపరచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎక్కడ డ్రైనేజీలు బ్లాక్ అవ్వకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన భవనాల విషయంలో యజమానులతో మాట్లాడి చుట్టుపక్కల వారికి ఇబ్బందులు లేకుండా చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, కొత్తకోట మున్సిపల్ వైస్ చైర్పర్సన్ సునీత పల్లవి, వైద్య శాఖ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## గడువులోగా 'యంగ్ ఇండియా' స్కూల్ పనులు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

### వెల్టూరు జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల పరిశీలన



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 17 (విజన్ ఆంధ్ర వచ్చే ఏడాది జూలై నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో తరగతులు ప్రారంభించే లక్ష్యంతో పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి, వివిధ భవనాల నిర్మాణ పురోగతి, మౌలిక వసతుల ఏర్పాటుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జూలై నాటికి విద్యా బోధన ప్రారంభమయ్యేలా అన్ని పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం పనుల వారీగా వర్క్ షెడ్యూల్ సిద్ధం చేసి సమర్పించాలని, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం పరిశీలన వనపర్తి నియోజకవర్గం లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు విషయమై పెద్దమందడి మండలం వెల్టూరు జెడ్పిహెచ్‌ఎస్ పాఠశాలను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. అక్కడ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కావాల్సిన సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో టిపిఎస్ ఏర్పాటుకు కావాల్సిన వ్యయం అంచనాలపై వెరిఫై చేశారు. ఎస్టిమేషన్ వివరాలను సమగ్రంగా రూపొందించి తనకు సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న స్థానికులు పాఠశాలకు సంబంధించిన స్థలం మొత్తాన్ని సర్వే చేసి హద్దులు గుర్తించి ఆ తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభించాలని కలెక్టర్ కు విన్నవించారు. హద్దులు గుర్తించి పాఠశాలను స్థలం వృథా కాకుండా నిర్మిస్తే విద్యార్థులు ఆడుకోవడానికి ఇతర కార్యక్రమాలకు పెద్ద మైదానం ఉపయోగపడుతుందని, ఆ విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. జడ్పీ సీఈఓ యాదయ్య, ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఇతర అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

### ఇంటింటికీ వెళ్లి విచారించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్

### సకాలంలో ఫారాలు సమర్పించి సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 17 (విజన్ ఆంధ్ర) బూత్ లెవెల్ అధికారులకు ఓటర్లు సహకరించి, సమయానికి ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి : అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ వనపర్తి పట్టణంలోని పలు వార్డుల్లో ఎస్ ఐ ఆర్ ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వనపర్తి పట్టణ పరిధిలోని 20వ వార్డు, పీర్లగుట్ట ప్రాంతాల్లో శుక్రవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఫారాల సేకరణ మరియు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీలో భాగంగా అదనపు కలెక్టర్ స్వయంగా కొన్ని ఇళ్లకు వెళ్లి ఫారాల అందజేత, సేకరణ తీరును ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియ సమర్థవంతంగా పూర్తయ్యేందుకు ప్రజలంతా బీ ఎల్ ఓ లకు పూర్తి స్థాయిలో సహకరించాలని, ఫారాలను సకాలంలో పూర్తి చేసి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. బి ఎల్ ఓలు ాx= ఫారాల సేకరణలో ఎలాంటి అలసత్వం వహించకుండా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రతిరోజూ సేకరించిన ఫారాల వివరాలను అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం పూర్తి చేయాలన్నారు. ఫారాలు నింపే విధానంలో ఓటర్లకు సందేహాలు ఉంటే దీూలు పూర్తి అవగాహన కల్పిస్తూ సహాయం అందించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియ అంతా పూర్తయ్యేలా జి.పి.ఓలు మరియు దీూ సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్‌తో పాటు తహసిల్దార్, మున్సిపల్/రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## దోమల నివారణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

### అదనపు వినోద్ కుమార్ కలెక్టర్ ఆదేశం




వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 17 (విజన్ ఆంధ్ర)వర్షాకాలంలో దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ (స్థానిక సంస్థలు) అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా వనపర్తి మున్సిపాలిటీ కమలనగర్ 2వ వార్డును ఆయన సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డ్రై డే అమలు తీరును సమీక్షించి, పరిశుభ్రత పాటించడం, దోమల నివారణ చర్యలను మరింత సమర్థంగా చేపట్టాలని సూచించారు. బ్లీచింగ్ నిర్వహణ, వీధి దీపాల పనితీరు, వార్డులోని సమస్యలపై ఆరా తీశారు. గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

## 5 కి.మీ. స్నేహపూర్వక పరుగు పందెం ఆరోగ్యం దేశభక్తి.. క్రీడాస్ఫూర్తికి పరుగే మార్గం

వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై17(విజన్ ఆంధ్ర);-యువతలో ఆరోగ్య చైతన్యం, దేశభక్తి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్ ▪ వనితా అచ్చుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో "స్వామి వివేకానంద రన్ ▪ కల్లెడ" పేరుతో 5 కి.మీ. స్నేహపూర్వక పరుగు పందెం ఈ నెల 19వ తేదీ (ఆదివారం) నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి పోటీలో పాల్గొనేవారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఉదయం 7 గంటలకు కళాశాల ప్రాంగణం నుంచి పర్వతగిరి సీఐ రాజగోపాల్ జెండా ఊపి పరుగు పందెన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కల్లెడలో ప్రారంభమయ్యే ఈ రన్ పర్వతగిరిలోని విజ్‌డమ్ స్కూల్ వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర కొనసాగుతుందని పేర్కొన్నారు. స్వామి వివేకానంద ఆశయాలను యువతలో నింపుతూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రేరణ కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు స్నేహపూర్వక క్రీడా వాతావరణాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ప్రత్యేక పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోటీలో ప్రతిభ కనబరిచిన మొదటి 10 మంది విజేతలకు మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు ప్రత్యేక షీల్డ్, 11 నుంచి 20వ స్థానాల్లో నిలిచిన వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు పర్వతగిరి సీఐ రాజగోపాల్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత, క్రీడాకారులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్, ఫిజికల్ డైరెక్టర్ బి. రాజు, 5కె రన్ ఇన్‌చార్జి బిందు విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోరకు క్రింది నెంబర్లను సంప్రదించాలని తెలిపారు 95026 89477, 99593 01913


## ఎల్‌నినో ముప్పు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలి

### వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పనిచేయాలి

### ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

### రాబోయే 15 రోజులు క్షేత్రస్థాయిలోనే అధికారులు

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



వనపర్తి జిల్లా ప్రతినిధి,జులై 17 (విజన్ ఆంధ్ర)ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాధార సాగుపై ఆధారపడే రైతులకు నష్టాలు కలగకుండా పంటల మార్పిడిపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లాలో ఎల్‌నినో ప్రభావం కనిపించే అవకాశం ఉన్నందున వర్షాధార పై ఆధారపడే రైతులు అధికంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడవచ్చని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి పంటల మార్పిడి పై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు కేవలం వరి సాగుకే పరిమితం కాకుండా, వారి భూభాగం, నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి ఉద్యాన పంటలు, కూరగాయలు, ఉల్లిపాయ, మినుములు, కందులు, వేరుశెనగ తదితర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాలకు అనుకూలమైన పంటలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించి, లాభదాయకమైన పంటల సాగు వైపు మళ్లించేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. ఉద్యాన శాఖ అధికారులు ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి ఆయిల్ పామ్ ప్రోత్సాహానికి లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయం లభించే అవకాశాలను వివరించి, రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. రాబోయే 15 రోజుల పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సెలవులు లేకుండా పూర్తిస్థాయిలో గ్రామాల్లో పర్యటిస్తూ రైతులను చైతన్యపరిచి, ఉద్యాన పంటల విస్తరణకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్, ప్రియునిక్ సంస్థ సిపిఓ సింగారెడ్డి, ఏవోలు, ఏఈఓ లు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో నాబార్డ్ 45వ వ్యవస్థాపక దినోత్సవం ఘనం

## గ్రామీణాభివృద్ధిలో నాబార్డ్ పాత్ర అమోఘం

## హాజరైన వివిధ శాఖల అధికారులు, రైతులు

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూలై 17 (విజన్ ఆంధ్ర)జిల్లా కేంద్రంలో నాబార్డ్ 45వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరియు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి, వ్యవసాయ రంగానికి నాబార్డ్ అందిస్తున్న విశేష సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.ప్రగతి పథంలో నాబార్డ్ సేవలుకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ పి. మనోహార్ రెడ్డి మాట్లాడుతూ... గత 45 ఏళ్లుగా నాబార్డ్ దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని, గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఆర్థిక చేర్పిక



, జీవనోపాధి కల్పన, రైతు సంక్షేమమే ధ్యేయంగా సంస్థ ముందుకు సాగుతోందని వివరించారు. ముఖ్యంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను మరింత బలోపేతం చేసేందుకు నాబార్డ్ నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.సమన్వయంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యంఈ వేడుకల్లో పాల్గొన్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ శ్రీమతి సంగీత మాట్లాడుతూ... గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో బ్యాంకుల పాత్ర, నాబార్డ్ అందిస్తున్న తోడ్పాటును వివరించారు. ఎస్‌కేఎల్‌టీయూహెచ్‌యూ ఉద్యానవన కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి వీణా జోషి, కేవీకే మదనాపురం అధిపతి డా. రాజేంద్ర రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతికతలను రైతులకు చేరవేయడంలో నాబార్డ్ పాత్రను అభినందించారు.గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని అతిథులు పిలుపునిచ్చారు.హాజరైన ప్రముఖులుఈ వేడుకల్లో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి , జిల్లా మత్స్యశాఖ అధికారి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ లతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, బ్యాంకర్లు, ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ కోఆర్డినేటర్లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులు సహా సుమారు 90 మంది ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిరుద్యోగులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

## బి.ఆర్.ఎస్.వి. జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్

## ఈ నెల 18న 'యువ సంగ్రామ సదస్సు'ను విజయవంతం చేయండి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 17 (విజన్ ఆంధ్ర)ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఈ నెల 18న యువ సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దీ=ాం జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్ కోరారు. సదస్సుకు దీ=ా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై నిరుద్యోగులకు భరోసా ఇవ్వనున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, ప్రియాంక గాంధీ 2 లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చి 30 నెలల్లో 15 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని, రేవంత్ రెడ్డి కూడా అదే తరహాలో 31 నెలలుగా నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. నెలకు 4 వేల రూపాయల నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలు హామీలు కూడా నెరవేరలేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసామని, పెండింగ్‌లో ఉన్న 60 వేల ఉద్యోగాలను కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటోందని అన్నారు.

# ఏటూరునాగారం పంచాయతీలో నూతన టాయిలెట్ల ప్రారంభించిన సర్పంచ్ కాకులమర్రి శ్రీలత



ములుగు జూలై 17 ; విజన్ ఆంధ్ర ప్రతినిధి.ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నూతనంగా నిర్మించిన టాయిలెట్లను సర్పంచ్ కాకులమర్రి శ్రీలత గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల సౌకర్యార్థం పరిశుభ్రత కోసం ఈ టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. బహిరంగ మల విసర్జన లేని గ్రామంగా ఏటూరునాగారాన్ని తీర్చిద్దడమే లక్ష్యమని, ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామంలో పారిశుద్ధ్యం పాటించడం ద్వారానే వ్యాధులు రాకుండా ఉంటాయని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి నిధిని అభివృద్ధి పనులకు వినియోగిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివాహ బంధం విశిష్టతను తెలియజేసిన గొప్ప సందేశాత్మక నాటిక "ప్రేమకు - పరాకాష్ట"




హైదరాబాద్ జులై 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాత్) : తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర టి.వి. నాటక రంగసంస్థ, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ సౌజన్యంతో ప్రముఖ సాంస్కృతిక సంస్థ "శివ ఆర్ట్స్ అసోసియేషన్", హైదరాబాద్ నిర్వహణలో సందేశాత్మక నాటిక ప్రదర్శన "ప్రేమకు - పరాకాష్ఠ' ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది అలరించింది. జనప్రియ అపార్ట్మెంట్స్ మల్లాపూర్, హైదరాబాద్ వేదికగా బుధవారంనాడు ప్రదర్శించిన ఈ సందేశాత్మక నాటిక రచన,నటన, నిర్వహణ,దర్శకత్వం "రక్తకన్నీరు నాగభూషణం", "బళ్ళారి రాఘవ" బిరుదుల గ్రహీత ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్త కార్యదర్శి మాడుగల కృష్ణమోహన్ చేసి, ఈ "ప్రేమకు - పరాకాష్ఠ' 387 వ నాటికలో 'ప్రసాద్' పాత్ర పోషించారు. గోవింద రాజుల నాగేశ్వర రావు ధనుంజయ పాత్రలో, జి. మనుప్రియ ప్రమీల పాత్రలో అలాగే గోవింద్ సత్యనారాయణ ఆటో డ్రైవర్ పాత్రను అద్భుతంగా పోషించి అందరి హృదయాలను దోచుకున్నారు. వివాహం ఒక పవిత్ర బంధమని, ప్రయోజన ఒప్పందం కాదదు అనే సందేశంతో మారుతున్న సమాజంలో కుటుంబ వ్యవస్థ భవిష్యత్తుపై రూపొందించి సమాజానికి వివాహ బంధం విశిష్టత ఎంత గొప్పదో తెలియజేస్తూ నాటికలోని పాత్రలు కళ్ళకు కట్టినట్టుగా చూపించి అందరి ప్రశంశలను అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు ఎం.వి.ఎస్. ఫణీందర్, ప్రముఖ నటుడు ఎం.వి.ఎస్. సాయి పవన్,రాధ ఆర్ట్స్ అసోసియేషన్‌సంస్థ కోశాధికారి ఎ. రాఘవమ్మ, ఇతర ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు. వివాహ వ్యవస్థ విశిష్టతను తెలియజేసే ఈ నాటికను చూడడానికి ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "ప్రేమకు-పరాకాష్ఠ" నాటిక గొప్ప సందేశాన్ని అందించిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సంధర్భంగా నటీమణి, సహజనటి, నటచంద్రికళ, చలాకీ తార బిరుదుల గ్రహీత జి. మనుప్రియ కు 'నటకళాస్రవంతి' బిరుదును ప్రదానం చేసి సత్కరించారు.

# ఎస్పీని కలిసిన నూతన ఎక్సైజ్ సూపరింటెండెంట్

## మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం నిర్మూలనకు సమిష్టి కార్యాచరణ

## వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 17 (విజన్ ఆంధ్ర)ప్రజా భద్రతే లక్ష్యంగా పోలీసు, ఎక్సైజ్ శాఖలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం. లింగాచారి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీకి పూల మొక్కను అందజేయగా, ఎస్పీ సునిత రెడ్డి ఆయనకు హృదయపూర్వక స్వాగతం పలికారు. నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాల సాధనలో పోలీసు, ఎక్సైజ్ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం తయారీ, రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడంలో రెండు శాఖలు ఉమ్మడి కార్యాచరణతో ముందుకు




వెళ్లాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలను కాపాడటం ప్రతి ప్రభుత్వ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల సరిహద్దుల్లో నిఘా పెంచడంతో పాటు, ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పిస్తూ సురక్షిత సమాజ నిర్మాణానికి కలిసికట్టుగా కృషి చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు.

# గోవిందరావుపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

## లారీ ఢీకొని బైక్ పై వెళ్తున్న ఇద్దరు మృతి



ములుగు జూలై 17 ; విజన్ ఆంధ్ర ప్రతినిధిగోవిందరావుపేట మండలం జవహర్ నగర్ టోల్ ప్లాజా సమీపంలో ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు.స్థానికుల కథనం ప్రకారం బైక్ పై వెళ్తున్న వ్యక్తులను వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో బైక్ పై ఉన్న ఇరువురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కొత్త ఎస్ హెచ్ ఓ ను సన్మానించిన బీజేపీ మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్

## శాంతిభద్రతలకు పూర్తి సహకారం ఉంటుందని హామీ

ములుగు జూలై 17; విజన్ ఆంధ్ర ప్రతినిధిములుగు పోలీస్ స్టేషన్ కు నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన వెంకటేష్ ను భారతీయ జనతా పార్టీ మల్లంపల్లి మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ వెంకటేష్ ను శాలువాతో సన్మానించి పూలబొకే అందజేశారు. అనంతరం బైకాని మహేందర్ యాదవ్ మాట్లాడుతూ ములుగు ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రజలకు అందుబాటులో ఉండి న్యాయం చేస్తారని ఆకాంక్షించారు."ములుగు మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టడానికి, మహిళల భద్రత, యువతను డ్రగ్స్ బారి నుండి కాపాడేందుకు పోలీస్ శాఖ చేపట్టే ప్రతి కార్యక్రమానికి బీజేపీ తరపున



పూర్తి సహకారం ఉంటుంది" అని బైకాని మహేందర్ యాదవ్ తెలిపారు.ప్రజలకు, పోలీసులకు మధ్య మంచి సమన్వయం ఉండాలని, చిన్న చిన్న సమస్యలను కూడా సామరస్యంగా పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో మండలంలో శాంతిభద్రతలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మచ్చిక రవి గౌడ్, కొండ యుగంధర్, మండల ప్రధాన కార్యదర్శి ఎండిగ రాజు, రాగుల శ్రీకాంత్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం కొత్త సీ ఐ ని కలిసిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు




ఏటూరునాగారం, జూలై 17 ,విజన్ ఆంధ్ర ప్రతినిధి :ఏటూరునాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జోడి సూర్య ప్రతాప్ ను ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన సీ ఐ ని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ఏటూరునాగారం ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణలో , ప్రజల భద్రతను పర్యవేక్షించడంలో నూతన సీ ఐ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. "పార్టీలకు అతీతంగా, ప్రజలందరికీ అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ యంత్రాంగం నిబద్ధతతో పని చేయాలి. ఈ ప్రాంత అభివృద్ధికి శాంతి భద్రతలను కాపాడడంలో అందరం కలిసికట్టుగా సహకరించుకుందాం" అని లక్ష్మణ్ బాబు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూలై 31లోగా నవోదయ దరఖాస్తులు చేసుకోవాలి

## కలెక్టర్ హేమంత్ సహదేవరావు

ములుగు, జూలై 17 : విజన్ ఆంధ్ర ప్రతినిధి:జవహర్ నవోదయ విద్యాలయం 2027-28 విద్యా సంవత్సరం 6వ తరగతి ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు జూలై 31, 2026 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కోరారు.ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకే నవోదయ విద్యాలయాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రవేశ పరీక్ష నవంబర్ 28, 2026 న నిర్వహిస్తామన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ములుగు జిల్లాలోని ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ, 01-05-2015 నుండి 31-07-2017 మధ్య జన్మించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.నవోదయ విద్యాలయాల్లో 6 నుండి 12వ తరగతి వరకు వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫాం పూర్తిగా ఉచితమని, సీబీఎస్ఈ విధానంలో బోధన ఉంటుందని కలెక్టర్ వివరించారు.



దరఖాస్తులకు ఎలాంటి ఫీజు లేదని, https://navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ విద్యార్థులకు 75% సీట్లు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, బాలికలకు రిజర్వేషన్ ఉందన్నారు.జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ సమాచారాన్ని విద్యార్థులకు చేరవేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఎస్ ఐ ఆర్ ఓటు సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన బీఆర్ఎస్ నేత బాడిశ నాగరమేష్

ములుగు జూలై 17 ;విజన్ ఆంధ్ర ప్రతినిధి:కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ ఐ ఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటు సవరణ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా మంగపేట మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో జరుగుతున్న పనులను బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యువ నాయకుడు బాడిశ నాగరమేష్ శుక్రవారం పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన బి ఎల్ ఓ, బి ఎల్ ఎ లతో కలిసి ఓటు సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటరు జాబితాలో పేర్లు మిస్ కాకుండా, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు తదితర అంశాలను బి ఎల్ ఓ లతో చర్చించారు.ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా చూడాలని, ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అన్నీ ఓటర్ కార్డు ఆధారంగానే



అందుతాయని, అందుకే ఎవరూ ఓటు నమోదును నిర్లక్ష్యం చేయొద్దని యువకులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నేత ఆర్థిక సహాయం అందజేత

మల్కాజిగిరి, జూలై 17, (విజన్ ఆంధ్ర): మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు ఆర్థిక సహాయం అందజేశారు. కాకతీయ నగర్ 187 డివిజన్ వాజ్పేయి నగర్ కు చెందిన తిమ్మాపురం రాకేష్ గత పది రోజుల కింద మృతి చెందారు.సమాచారం అందుకున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేత సిహెచ్ కపిలేశ్వర్ మానవత్వంతో స్పందించి తన వంతు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీమల్కాజ్గిరి ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి కే శ్రీనన్న, డివిజన్ అధ్యక్షుడు యూసుఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్ యాదవ్, సీనియర్ నాయకుడు గిరి యాదవ్, బుల్లెట్ శ్రీనన్న, అరవరాజు మనోజ్ చారి, మాదిగ మల్కాజిగిరి సర్కిల్ ప్రెసిడెంట్ రొట్టెల ధరన్ కుమార్



తదితరులు పాల్గొన్నారు

# ఎస్ ఐ ఆర్ ఓటు సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన బీఆర్ఎస్ నేత బాడిశ నాగరమేష్

## బి ఎల్ ఓ, బి ఎల్ ఏ లతో కలిసి మంగపేట మండలంలో పర్యటన



ములుగు జూలై 17 ;విజన్ ఆంధ్ర ప్రతినిది: , కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ ఐ ఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటు సవరణ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా మంగపేట మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో జరుగుతున్న పనులను బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యువ నాయకుడు బాడిశ నాగరమేష్ శుక్రవారం పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన బి ఎల్ ఓ, బి ఎల్ ఎ లతో కలిసి ఓటు సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటరు జాబితాలో పేర్లు మిస్ కాకుండా, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు తదితర అంశాలను బి ఎల్ ఓ లతో చర్చించారు.ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా చూడాలని, ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అన్నీ ఓటర్ కార్డు ఆధారంగానే అందుతాయని, అందుకే ఎవరూ ఓటు నమోదును నిర్లక్ష్యం చేయొద్దని యువకులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును ఛేదించిన పోలీసులు

### ఇద్దరు నిందితుల అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలింపు



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 17 (విజన్ ఆంధ్ర)కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో నారాయణపూర్ గ్రామ శివారులో జరిగిన వేమునూరి స్వామి హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్ కు పంపించారు.రెబ్బెన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.తేదీ: 15 జులై 2026 న తన భర్తను హత్య చేశారు అని ఫిర్యాదు చేసిన వేమునూరి దేవల ఫిర్యాదు మేరకు రెబ్బన ఎస్సై వెంకటకృష్ణ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు.మృతుడు వేమునూరి స్వామి బంధువైన వైష్ణవి అనే యువతి కుటుంబ అనుమతి లేకుండా ఇంటి నుండి వెళ్లిపోవడం వల్ల కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర మనస్తాపం నెలకొంది. ఈ ఘటనకు వేమునూరి స్వామే కారణమని భావించిన ఇస్గం మండలం రాసపల్లి గ్రామానికి చెందిన ఇరుగురాల వెంకటేష్ మరియు అతని అన్న ఇరుగురాల తిరుపతి ప్రతీకార భావంతో అతనిని హత్య చేయాలని పథకం రచించారు.ఈ క్రమంలో 14-07-2026 రాత్రి 11.50 నారాయణపూర్ గ్రామానికి వెళ్లి, వేమునూరి స్వామిని ఇంటి బయటకు పిలిచి మోటార్ సైకిల్‌పై గ్రామ శివారుకు తీసుకెళ్లారు. అక్కడ ఇద్దరూ కలిసి కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశారు. అనంతరం నేరానికి ఉపయోగించిన కత్తిని సంఘటన స్థలం సమీపంలో పడవేసి, రక్తపు మరకలతో ఉన్న దుస్తులు మరియు మొబైల్ ఫోన్లను ఆధారాలు నశింపజేయాలనే ఉద్దేశంతో వాగులో పడవేశారు. సంఘటన అనంతరం పరారయ్యారు. పరారీలో ఉన్న నిందితులు తేదీ 17.07.2026 న కాగజ్‌నగర్ క్రాస్ రోడ్ వద్ద పోలీసులు నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని ఆపేందుకు ప్రయత్నించగా తప్పించుకునేందుకు యత్నించినప్పటికీ వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు హత్యకు ఉపయోగించిన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ రక్తపు మరకలతో ఉన్న దుస్తులు మరియు కేసుకు సంబంధించిన ఇతర ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వాహనంపై లభించిన రక్తపు మరకలను క్లూస్ బృందం సేకరించింది. నిందితులు చూపించిన ప్రదేశం నుండి నేరానికి ఉపయోగించిన కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నారు. రెబ్బెన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం సంజయ్ దర్యాప్తు చేసి, వేము నూరి స్వామి హత్యకు కారకులైన ఇరుగురాల వెంకటేష్ మరియు తిరుపతి లను ఈరోజు రెబ్బెన పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

## తెలంగాణ విద్యుత్‌కు సింగరేణి భరోసా.. రాష్ట్ర అవసరాలకే తొలి ప్రాధాన్యం




కొత్తగూడెం బ్యూరో జూలై 18(విజన్ ఆంధ్ర)రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం తలెత్తకుండా తెలంగాణ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేస్తున్నామని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున, రాష్ట్ర అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ మరింత బొగ్గు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.శుక్రవారం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్‌తో కలిసి ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు సమృద్ధిగా ఉండేలా ఉత్పత్తి, రవాణా, రైల్వే రేకుల లభ్యత తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని నిర్ణయించారు.ప్రస్తుతం తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలు, రామగుండం ఎన్టీపీసీ, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లకు సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 72 శాతం సరఫరా చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యుత్ డిమాండ్ మరింత పెరిగితే రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తెలంగాణ విద్యుత్ కేంద్రాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే ఇతర రాష్ట్రాలకు వెళ్లే బొగ్గు సరఫరాలో సర్దుబాటు చేయాలని సీఎండీ స్పష్టం చేశారు.వర్షాకాలంలో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్పత్తి తగ్గకుండా, బొగ్గు నాణ్యతలో రాజీ పడకుండా చూడాలని ఏరియా జీఎంలకు ఆదేశించారు. అలాగే బొగ్గు రవాణాలో ఎదురయ్యే సమస్యలను స్థానిక అధికారులు వెంటనే పరిష్కరించాలని జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ సూచించారు.ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు, ఈడీలు, జీఎంలతో పాటు తెలంగాణ జెన్‌కో డైరెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టిసిసి పాతబస్తీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కొఠారి నియామకం

హైదరాబాద్, జులై 17 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్(టిసిసి) పాతబస్తీ అధ్యక్షుడిగా హరిబౌలి ప్రాంతానికి చెందిన ఉత్తమ్ కొఠారిని నియమించారు. టిసిసి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అక్తర్ షరీఫ్ ఈ విషయాన్ని వెల్లడించారు. టిసిసి కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత 15 ఏళ్లుగా శాంతి, జాతీయ సమైక్యత, మతసామరస్యం, ఉచిత ఆరోగ్య శిబిరాలు, నిరుపేదలు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం ఉత్తమ్ కొఠారి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కొఠారి మాట్లాడుతూ పాతబస్తీ అభివృద్ధి, విద్యార్థుల విద్యాభివృద్ధి, మురికివాడల సమస్యల పరిష్కారం, రోడ్లు, డ్రైనేజీ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఆయనకు తెలంగాణ జైన్ సమాజ్, అగర్వాల్ సమాజ్, పాతబస్తీ యువజన, మహిళా సంఘాలు అభినందనలు తెలిపాయి.

# వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

నల్లబెల్లి:జూలై 17, విజన్ ఆంధ్ర;ఎలినినో ప్రభావం.. అరుతడి పంటలకు మొగ్గు చూపడం వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ నిపుణులు సూచించారు. ముఖ్యంగా వరి సాగుకు అవసరమైన నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లో రైతులు సజ్జ, జొన్న, కంది, ఆముదం, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేయడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.వ్యవసాయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున రైతులు నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి. కాలువలకు, కుంటల్లో నీరు నిలవ లేని పరిస్థితి ఉంటే వరి బదులుగా పప్పు జాతి, నూనె గింజల పంటలు లేక చిరుదాన్యాలు మరియు కూరగాయలు పంటలు వేయాలని సూచించడం జరిగింది. అలాగే తక్కువ వ్యవధిలో పూర్తయ్యే, తక్కువ నీటి అవసరమున్న పంటలను ఎంపిక చేసుకోవడం లాభదాయకమని తెలిపారు.ప్రత్యామ్నాయ పంటల్లో సజ్జ పంట 80-85 రోజుల్లో, జొన్న సుమారు 100 రోజుల్లో, కంది 90-120 రోజుల్లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తమ ప్రాంత



పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.కంది పంటలో అధిక దిగుబడులు ఇచ్చే రకాలను ఎంపిక చేసుకోవడం, విత్తన శుద్ధి, సమతుల్య ఎరువుల వినియోగం మరియు పురుగు, వ్యాధుల నివారణ గురించి వ్యవసాయ అధికారులు సూచించారు . అలాగే సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగు రైతులకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నేల సారాన్ని కాపాడే చర్యలు చేపట్టడం, ప్రభుత్వ వ్యవసాయ శాఖ సూచనలను పాటించడం ద్వారా వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని అధికారులు తెలిపారు.

# జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

## కల్వకుర్తి ఎస్సై కురుమూర్తి సంచలన దాడులు

- 60 రోజుల్లో 15 కేసులు, 20 వాహనాలు సీజ్
- డీఎస్పీ, సీఐ పర్యవేక్షణలో ముమ్మర తనిఖీలు..
- అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



ఎస్సై కురుమూర్తి...



ఇసుక టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ లో ఉంచిన (ఫైల్ ఫోటో)...



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్న ఎస్సై.. (ఫైల్ ఫోటో)




గురువారం రాత్రి తర్నికల్ వద్ద పట్టుకున్న ఇసుక ట్రాక్టర్.

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 18 (విజన్ ఆంధ్ర)నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ భీమ్ కుమార్ ఆదేశాల మేరకు కల్వకుర్తి పట్టణంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ముమ్మర దాడులు నిర్వహిస్తున్నారు.

గురువారం రాత్రి లింగసాని పల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను తర్నికల్ గ్రామం వద్ద పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ మరియు యజమానిపై కేసు నమోదు చేశారు.

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో నూతనంగా కల్వకుర్తి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కురుమూర్తి గత రెండు నెలల్లోనే ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపారు. డీఎస్పీ వెంకట్ రెడ్డి మరియు సీఐ భీమ్ కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలతో కలిసి కల్వకుర్తి పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

ఈ తనిఖీల్లో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దాదాపు 15 మందికి పైగా వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. అక్రమ రవాణాకు వినియోగిస్తున్న దాదాపుగా 20 వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.

**- "ఎంతటి వారైనా చర్యలు తప్పవు"**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ మాట్లాడుతూ, "ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రజల భద్రతకు విఘాతం కలిగిస్తున్న ఇసుక మాఫియాపై జిల్లా వ్యాప్తంగా జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నాం. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే ఎంతటి వారైనా కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు"బి అని స్పష్టం చేశారు.

**- ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ..**

ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే వరకు ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని, ప్రజలు అక్రమాలను గమనిస్తే వెంటనే 100 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# అభ్యర్థులు అంకిత భావం, క్రమశిక్షణతో చదవాలి

## జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట , జూలై 17 (విజన్ ఆంధ్ర) ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలకుసిద్ధమవుతున్నప్పుడు అభ్యర్థులు పూర్తి అంకిత భావం,క్రమశిక్షణతో చదవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని అశోక్ నగర్ కు వెళ్లే మార్గంలో గల లయన్స్ క్లబ్ భవనంలో ఆ క్లబ్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని, వారియర్స్ డిఫెన్స్ అకాడమీ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఇస్తున్న శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న యువతీ యువకులను ఉద్దేశించి ఆమె మాట్లాడు తూ సుమారు 15 సంవ త్సరాల క్రితం తాను కూడా ఇలాగే ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యాననీ తెలిపారు. ఇప్పటికీ ఎంతో మంది ఆసక్తితో చదువుకో వడం చూస్తే చాలా సంతోషంగాఉంటుందన్నారు.శిక్షణ పొందుతున్న వారు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, రాయబోయేది కేవలం ఒక పరీక్ష మాత్రమే. మనం 10వ తరగతి, ఇంట ర్మీడియట్, డిగ్రీ పరీక్షలు ఎలా రాశామో, ఇదీ అలాం టి మరో పరీక్షగానే భావిం చాలని అన్నారు. అనవ సరంగా ఒత్తిడికి గురికావ ద్దన్నారు.ప్రతి ఒక్కరికి అవసరమైంది ఒక్క సీటు మాత్రమే అని "ఎన్ని పోస్టులకు నోటిఫికేషన్



వచ్చింది?", "ఎంత మంది పరీక్ష రాస్తున్నారు?", "పరీక్ష వాయిదా పడుతుంది", "పరీక్ష జరగదు" వంటి పుకార్లను అస్సలు నమ్మ రాదని తెలిపారు. ప్రభుత్వ పరీక్షలకుసిద్ధమవుతున్నప్పుడు పూర్తి అంకితభా వంతో, క్రమశిక్షణతో చద వాలని ఆమె పునరుద్ఘా టించారు. ఒక్క వారం చదవకుండా వదిలేస్తే, అదే సమయంలో చదవాల్సిన ప్రశ్న పరీక్షలో వచ్చి మార్కు లు కోల్పోయే అవకాశం ఉంటుందనే అనే భావనతో ప్రతిరోజూ చదవాలన్నారు. తాను కూడా అదే విధంగా సిద్ధమయ్యాననీ, అదే తనకు మంచి ఫలితాన్ని ఇచ్చిందనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు హరినారాయణ బట్టాడ్,ఆత్మారామ్ ఎడ్కే, లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, శ్రీనివాస్ లాహోటీ, బాలాజీ, జనార్దన్, సచిన్ మంగగ్లీ, తదితరులు పాల్గొన్నారు.

# 2030 నాటికి 2 కోట్లకు చేరనున్న గిగ్ వర్క్‌ఫోర్స్

## -రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, జులై 17 (విజన్ ఆంధ్ర) : రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ విడుదల చేసిన 'గిగ్ ఇంటర్నెట్ వర్క్‌ఫోర్స్ ఇన్ ఇండియా : బ్రిడ్జ్ టు -20 మిలియన్ లైవ్‌లీహుడ్స్' ప్రకారం భారత్‌లో నెలవారీ యాక్టివ్ గిగ్ ఇంటర్నెట్ వర్క్‌ఫోర్స్ 2030 నాటికి ప్రస్తుతం ఉన్న 60 లక్షల నుంచి 1.7 - 2.1 కోట్లకు చేరనుందని రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ భాగస్వామి కుశాల్ భట్నాగర్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ డెలివరీ, రైడ్-హెయిలింగ్, హోమ్ సర్వీసెస్ రంగాలు ఉపాధి, అధిక ఆదాయం, నైపుణ్యాభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. సర్వేలో 54 శాతం మంది గిగ్ ప్లాట్‌ఫారమ్‌లలో చేరకముందు వేతన ఉద్యోగాల్లో లేరని, పూర్తిస్థాయి గిగ్ వర్కర్లు ఇతర అసంఘటిత రంగాల కంటే 2.5 రెట్లు అధిక నికర ఆదాయం పొందుతున్నారని తెలిపారు. 70 శాతం మంది గిగ్ అనుభవం భవిష్యత్ ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తుందని అభిప్రాయపడ్డారు. మహిళల భాగస్వామ్యం, సామాజిక భద్రత, సంక్షేమ పథకాల విస్తరణపై దృష్టి అవసరమని నివేదిక పేర్కొందని, గిగ్ ఎకానమీ నిరుద్యోగ సమస్య తగ్గింపులో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి చేతిలో వృద్ధుడి హత్య

## తల మొండెం వేరు చేసిన గుర్తు తెలియని వ్యక్తి



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 17(విజన్ ఆంధ్ర)కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం పర్స నంబల కు చెందిన మసాడే సోమయ్య (65) అనే వృద్ధుడు హత్యకు గురయ్యాడు. మృతుడి భార్య కరుణా బాయ్ అందించిన ఫిర్యాదు ఆధారంగా వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడికి భార్య లక్ష్మి సుజాత అనే ఇద్దరు కూతుర్ల తో పాటు ఒక కుమారుడు ఉన్నాడు. పెద్ద కూతురు అయిన లక్ష్మి గత కొంతకాలంగా హైదరాబాదులో కూలీ పనులు చేసుకుంటూ అక్కడ జీవిస్తోంది. గురువారం నంబాలలో ఉంటున్న చిన్న కూతురు సుజాత ఇంటికి లక్ష్మి రావడంతో తనని చూసేందుకు పర్స నంబాల నుండి సోమయ్య తో పాటు ఆయన భార్య నంబాల కి వెళ్ళారు... ఆ రోజంతా అందరూ కలిసి చిన్న కూతురు ఇంట్లో ఉండే శుక్రవారం ఉదయం పెద్ద కూతురు లక్ష్మి తిరిగి హైదరాబాద్ వెళుతుండడంతో ఆమెను రైలు ఎక్కించేందుకు సోమయ్య, అతని భార్య, చిన్న కూతురైన సుజాతలు ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్ కు చేరుకున్నారు. అయితే సోమయ్య అతని భార్య, ఇద్దరు కూతుళ్లు స్టేషన్ లో ఉండగా చాయ్ తాగి వస్తానని వారికి చెప్పి రెబ్బెన బస్టాండ్ వైపు వెళ్ళాడు. చాయ్ తాగి తిరిగి వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి గొడ్డలితో మెడపై బలంగా మోదడం తో తల మొండెం వేరు అయి సోమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టడమైనది.. సంఘటన స్థలాన్ని ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, రెబ్బెన జ× సంజయ్, రెబ్బెన ా× వెంకట కృష్ణ పరిశీలించి హత్య జరిగిన తీరును ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలుసుకున్నారు. నిందితుడి ఆచూకీ కనుక్కునేందుకు రైల్వే స్టేషన్ , ఇతర ప్రాంతాల్లో ఉన్న సిసి టీవీ ఫుటేజ్ లను పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది సంఘటన స్థలంలో వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించటమైనది..


## వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై17(విజన్ ఆంధ్ర);-వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి గారు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవల అందుబాటు, అలాగే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు సంబంధించి పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు.జిల్లాలో ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు ప్రజాప్రతినిధులు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు భరోసా కల్పించేందుకు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు.

# మక్కల నిల్వలతో లక్కపురుగుల బెడద కల్లెడ గ్రామస్థుల ఆందోళన..

### – సొసైటీ గోదాంలో ధాన్యం నిల్వలను వెంటనే ఖాళీ చేయించాలి జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థుల మొర..



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై 17(విజన్ ఆంధ్ర);-వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని సహకార సంఘం (సొసైటీ) గోదాంలో మక్కల బస్తాలను నిల్వ చేయడంతో తీవ్ర లక్కపురుగుల సమస్య నెలకొని, చుట్టుపక్కల నివసిస్తున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థుల కథనం ప్రకారం, ఈ గోదామును వాస్తవానికి ఎరువుల బస్తాల నిల్వ కోసం నిర్మించారు. గతంలో ఇదే గోదాంలో రైస్ మిల్లు నిర్వహించాలని ప్రయత్నించగా, కాలుష్యం, అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికుల అభ్యంతరాలతో ఆ ప్రతిపాదన నిలిచిపోయింది. అయితే ఈ ఏడాది మార్చి నెల నుంచి గోదాంలో పెద్ద ఎత్తున మక్కల బస్తాలను నిల్వ చేస్తున్నారని తెలిపారు. మక్కల నిల్వలను సక్రమంగా నిర్వహించకపోవడంతో లక్కపురుగులు విపరీతంగా పెరిగి సమీపంలోని ఇళ్లలోకి చేరుతున్నాయని, వంటగదులు, ఆహార పదార్థాలు, అన్నంపైనే కాకుండా ప్రజల శరీరాలపై కూడా పడుతున్నాయని గ్రామస్థులు వాపోయారు. ఈ కారణంగా సుమారు 20 నుంచి 30 కుటుంబాలు ప్రశాంతంగా భోజనం చేయలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు సొసైటీ సీఈఓ సురేష్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గోదాంలో నిల్వ చేసిన మక్కలను తొలగించాలని, భవిష్యత్తులో ఆ గోదాంను కేవలం ఎరువుల బస్తాల నిల్వకే పరిమితం చేసి మక్కలు, వరి ధాన్యం వంటి నిల్వలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ లేని ఎడల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

# నీట్ ఫలితాల్లో అగ్రగామిగా 'రేసో మెడికాన్'



హనుమకొండ,జిల్లా ప్రతినిధి జూలై 17 ( విజన్ ఆంధ్ర ఇటీవల జాతీయ పరీక్షల సంస్థ ( ఎన్ టి ఏ ) విడుదల చేసిన 'నీట్-2026' ఫలితాల్లో హనుమకొండలోని రేసో మెడికాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారని సంస్థ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా మెరుగైన ఫలితాలు సాధించి, అత్యధిక శాతం మంది విద్యార్థులు ఫ్రీ మెడికల్ సీట్లు సాధించే స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఎకె. శ్యాం కరన్: 655 మార్కులు,ఎపి. గురురాజ్ రెడ్డి: 630 మార్కులు,ఎబి. కోమల్: 591 మార్కులు,ఎబి. అభిషేక్: 580 మార్కులు,ఎసిహెచ్. సాక్షి: 546 మార్కులు,ఎమహమ్మద్ అద్నాన్: 528 మార్కులు,ఎఎన్. మణిదీప్: 528 మార్కులు,ఎవేముల జస్విన్ ప్రీత్: 500 మార్కులువరంగల్, హనుమకొండ జిల్లాల్లో బైపిసి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నీట్ కోచింగ్ క్యాంపస్ ఏర్పాటు చేసి, జాతీయ స్థాయి అనుభవం గల అధ్యాపకులతో వ్యక్తిగత శ్రద్ధ వహించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని చైర్మన్ పేర్కొన్నారు.ఎకళాశాల మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిరావు మాట్లాడుతూ.. వీరితో పాటు మరో 56 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించి ఫ్రీ మెడికల్ సీట్ల రేసులో నిలిచారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను యాజమాన్యం అభినందించింది.ఎకళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అభినందన సభలో రేసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిరావు, డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సి.ఈ.ఓ లెక్కల రమ్యారాజిరెడ్డి, ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆపిల్ ఫార్మసీ రెండవ బ్రాంచ్ ప్రారంభం



సంగారెడ్డి బ్యూరో, జూలై :17(విజన్ ఆంధ్ర)ఆపిల్ ఫార్మసీ మరింత అభివృద్ధి సాధించాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ అన్నారు. శుక్రవారం నాడు సంగారెడ్డి పట్టణంలోని విద్యుత్ శాఖ (ఎలక్ట్రిసిటీ బోర్డ్) కార్యాలయం ఎదురుగా ఆపిల్ ఫార్మసీ రెండవ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి మన్నలను పొందాలని ఆయన కోరారు.పట్టణానికి చెందిన ప్రముఖులు, వాసవి కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు.ఆపిల్ ఫార్మసీ అధినేత సంతోష్ గుప్తా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. కేవలం మందులు అందించడం మాత్రమే కాకుండా, ప్రతి కస్టమర్‌తో ఆప్యాయంగా వ్యవహరించడం, వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. వైద్యో నారాయణో హరి అనే భావనకు అనుగుణంగా సేవలందిస్తూ, వినియోగదారుల ప్రేమాభిమానాలే తమకు నిజమైన ఆస్తి అని పేర్కొన్నారు. ఆపిల్ ఫార్మసీ దినదినాభివృద్ధి చెందుతూ మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ యుగంధర్



కడప, జూలై 17 (విజన్ ఆంధ్ర) బదిలీల్లో భాగంగా కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా యుగంధర్ శుక్రవారం ఉదయం పదవి బాధ్యతలు చేపట్టారు కృష్ణాజిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై కడపకు రావడం జరిగిందని తెలిపారు తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని ఆరోగ్య కార్యక్రమాలు అభివృద్ధి జరగాలని 100% లక్ష్యం దిశగా సిబ్బంది పనిచేసి రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని కోరారు సిబ్బంది వారి వారి విధివిధానాల ప్రకారం విధులు సక్రమంగా నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు ముఖ్యంగా మాతా శిశు సంరక్షణ సేవలు అందేలాగా చర్యలు తీసుకోవాలని ఏ మహిళ కూడా (తల్లి) జన్మిస్తూ మరణించకూడదని ఏ బిడ్డ కూడా జన్మిస్తూ మరణించరాదనే నినాదంతో ఆరోగ్య శాఖ సిబ్బంది పని చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ మరియు లెప్రసీ అధికారి డాక్టర్ రవిబాబు, ఇమ్మనైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్, ఆర్ బి ఎస్ కే కోఆర్డినేటర్ డాక్టర్ అరిపుల్ల, మహమ్మద్ తాహత్, డెమో భారతి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి విజయభాస్కర్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# 'పాలమూరు'కు కాంగ్రెస్ విద్రోహం

**సర్కారు తీరుతో జలహక్కులకు విఘాతం**
**ట్రిబ్యునల్‌లో వాదనలన్నీ నిర్వీర్యం**
**ఇకనైనా ఒప్పందాలను మానుకోవాలి**
**ఏపీ సీఎం బాబు కుట్రలను తిప్పికొట్టాలి**
**లేదంటే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం**
**సామజిక కార్యకర్త, టీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ హెచ్చరిక**



నారాయణపేట, జూలై 17 (విజన్ ఆంధ్ర) ఉమ్మడి పాలమూరు జిల్లాకు కాంగ్రెస్ పార్టీ తీరని విద్రోహానికి తలపెడుతున్నది. దశాబ్దాలు పోరాడి ట్రిబ్యునల్‌ను సాధించుకుని, కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా దక్కే తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు వాటిని ఎత్తగొట్టే చర్యలకు పూనుకుంటున్నారు. ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై యావత్ పాలమూరు జిల్లా భవిష్యత్ ప్రయోజనాలను ఫణం పెడుతున్నారు. నీటివాటాలపై, ట్రిబ్యునల్ కేటాయింపులపై కనీస అవగాహన లేకుండా రాజకీయ ప్రయోజనాల కోసం చారిత్రక ద్రోహానికి తలపెడుతున్నారు. గత ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90టీఎంసీలను కేటాయించింది. ప్రాజెక్టు అనుమతుల కోసం డీపీఆర్‌ను సైతం కేంద్రానికి సమర్పించింది. . కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పనులను పడావు పెట్టింది. డీపీఆర్ వెనక్కి వచ్చినా రెండున్నరేళ్లుగా కిక్కురుమనకుండా ఉన్నది. ఇప్పుడు బనకచర్లకు అనుమతిస్తే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్‌వోసీ ఇస్తామంటూ కేంద్రం, పొరుగున చంద్రబాబు ప్రకటించగానే ఇక్కడ రేవంత్‌రెడ్డి సర్కారు సైతం కనీస అవగాహన లేకుండా సై అంటున్నది. కేంద్రం, ఏపీ చేస్తున్న ప్రతిపాదనలు కుట్ర పూరితమైవి. వాటికి అంగీకరిస్తే తెలంగాణకు, యావత్ పాలమూరు జిల్లా జలహక్కులకు శాశ్వత సమాధి కట్టినట్లే. కృష్ణా పరివాహక ప్రాంతం ఎక్కువగా ఉంది. కరువు, దుర్భిక్ష ప్రాంతం ఎక్కువగానే ఉన్నది. సాగుకు యోగ్యమై, నీరందక దశాబ్దాలుగా బీడు భూములున్నాయి. పూర్తిగా బేసిన్‌లోనే ఉన్నది. ఏ ప్రమాణాలను ఆధారంగా తీసుకున్నా కూడా కృష్ణా జలాల్లో తెలంగాణకు 70శాతానికిపై జలాలు దక్కాలు. అయినా దశాబ్దాలు ఉమ్మడి పాలకులు పాలమూరుకు కృష్ణా జలాలు దక్కకుండా చేశారు. ఉమ్మడి పాలనలో జలహక్కులపై, డిమాండ్లపై ట్రిబ్యునల్ ఎదుట గొంతు వినిపించే అవకాశం లేకుండా పోయింది. కానీ తెలంగాణ ఏర్పాటు తరువాత, ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపించుకునే సువర్ణ అవకాశం దక్కింది. న్యాయమైన వాటాను పొందేందుకు మార్గం సుగమమైంది. ఇప్పటివకే వాదనలన్నీ తుది దశకు చేరుకున్నాయి. రాబోయే కొద్ది రోజుల్లోనే అవార్డును ప్రకటించే అవకాశమున్నది. కృష్ణాలో 775టీఎంసీలకుపై దక్కుతాయని ప్రభుత్వమే అనేక మార్లు వెల్లడించింది. ఆ జలాల్లో పాలమూరుకు 90టీఎంసీలు, దిండికి 30పోగా, పాలమూరు జిల్లాలోని మిగతా వరద ఆధారిత అన్ని ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయించుకోవచ్చు. ఎవరి దయాదక్షిణ్యాలపై ఆధారపడాల్సిన అవసరమే లేదు. కేంద్రం, ఏపీ ముందు మోకరిల్లాల్సిన పనే లేదు. కానీ రేవంత్‌రెడ్డి న్యాయబద్ధంగా, సాధికారిత గల ట్రిబ్యునల్‌లో వాటా సాధించేందుకు యత్నాలు మాని ఇప్పుడు పొరుగున ఏపీతో ప్రత్యేకంగా ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధమవడం దుర్మార్గం. చారిత్రక ద్రోహం. జలహక్కులకు తీరని విఘాతం. రాష్ట్రంతో ఒప్పందం చేసుకుంటే ట్రిబ్యునల్‌లో వాదనలన్నీ వీగిపోతాయి. జలహక్కులన్నీ మళ్లీ కొల్లగొట్టుకు పోతాయి. ఈమాత్రం కనీస అవగాహన లేకుండా సర్కారు వ్యవహరించడం దుర్మార్గం. కేంద్ర ప్రభుత్వం సైతం పాలమూరుపై వివక్ష చూపుతున్నది. ఏపీ ప్రభుత్వం పోలవరం బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనలు పంపగానే అనుమతుల కోసం హడావుడి చేస్తున్నది. పొరుగు రాష్ట్రాలతో సంప్రదింపులకు ఏకంగా మధ్యవర్తిత్వం నెరుపుతున్నది. కానీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతులివ్వకుండా డీపీఆర్‌ను వెనక్కి పంపింది. ఇప్పుడు ఎన్‌వోసీ ఇవ్వాలంటే బనకచర్లకు ఒప్పుకోవాలంటూ షరతులు పెట్టడం దారుణం. తుంగభద్రపై కర్నాటక ప్రాజెక్టులకు నజరానాలను ప్రకటించి ఆ విధంగానూ అన్యాయం తలపెడుతున్నది. ఇకనైనా కేంద్రం, ఏపీ కుట్రలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుర్తెరగాలి. వాటిని తిప్పికొట్టాలి. అవార్డు వచ్చేవరకూ చర్చలకు, ఒప్పందాలకు తావులేదని తేల్చిచెప్పాలి. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు నికర జలాలను న్యాయబద్ధంగా సాధించేందుకు కృషి చేయాలి. కేంద్రం ఇటీవల ఏర్పాటు నుంచి కమిటీల నుంచి తెలంగాణ సర్కారు తక్షణం తప్పుకోవాలి. అలాకాకుండా ఎన్‌వోసీ పేరిట నమ్మబలికుతూ ఒప్పందాలకు సిద్ధమవ్వాలని చూస్తే పాలమూరులో మరో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం. కాంగ్రెస్సు గుణపాఠం చెబుతాం.

# దేశంలో తీవ్రమైన సంక్షోభం

## అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్


**కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సరళీకరణ విధానాలతోనే రైతుల ఆత్మహత్యలు**
**దొడ్డి దారిన మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం**
**నవంబర్18-21తేదీల్లో నల్లగొండ పట్టణంలో అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభలు**



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,జులై 17,(విజన్ ఆంధ్ర) కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం హయాంలో దేశంలో తీవ్రమైన సంక్షోభం ఏర్పడిందని అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ అన్నారు.శుక్రవారం నాడు నల్లగొండ పట్టణంలోని ఏచూరి గార్డెన్ లో నిర్వహించిన అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభల సన్నాహక సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షోభం కారణంగా 5 లక్షల మంది రైతులు,వలస కార్మికులు,వ్యవసాయ కార్మికులు,ఆదివాసి రైతులు,మహిళా రైతులుఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు.దేశంలో ఆర్థిక సరళీకరణ విధానాల కారణంగా అప్పుల కారణంగా ఈ12 సంవత్సరాలలో 10 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని విచారం వ్యక్తం చేశారు.2020 కరోనా సమయంలో లాక్ డౌన్ పెట్టి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చారని,ఢిల్లీలో సంవత్సరం పైగా జరిగిన రైతు ఉద్యమం ఫలితంగా ఆ చట్టాలను వెనక్కి తీసుకున్నామని గుర్తుచేశారు. బీహార్ ఎన్నికల తర్వాత మళ్లీ ఈ నల్ల చట్టాలను దొడ్డి దారిన తీసుకొచ్చే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు.ఈ కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు జూలై 29న ఢిల్లీలో సంయుక్త కిసాన్ సభ,ట్రేడ్ యూనియన్లు,వ్యవసాయ కార్మిక సంఘాలు కలిసి సదస్సునిర్వహించనున్నాయని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు10న అన్ని రాష్ట్రాల్లో కార్మిక-కర్షక ఐక్యతతో 10 లక్షల మందితో జైల్ బరో నిర్వహించనున్నామని పేర్కొన్నారు.కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలలో 736 మంది రైతులు చనిపోయారనితెలిపారు.అమెరికా,న్యూజిలాండ్,యూరోపియన్ దేశాల నుండి పత్తి,సోయాబీన్ తదితర పంటల దిగుమతులపై సుంకాలను తగ్గించడం వల్ల దేశంలో తీవ్రమైన సంక్షోభం ఏర్పడనుందని ఆవేదన వ్యక్తం చేశారు.న్యూజిలాండ్ నుండి పాలు దిగుమతి చేసుకుంటే లీటర్ 25 రూపాయలకు వస్తుందని,అప్పుడు దేశంలోని రైతుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు.నవంబర్18,19, 20,21 తేదీలలో నల్లగొండ పట్టణంలో అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభలు నిర్వహించనున్నామని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వలాన,విజయవాడ, ఖమ్మం,గుంటూరులో మహాసభలు నిర్వహించామని,ఇప్పుడు చరిత్ర గల నల్లగొండ గడ్డపై ఈ మహాసభలు జరపడం గర్వకారణమని అన్నారు.ఈ మహాసభలకు 800 మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.అఖిల భారత కిసాన్ సభ 1990లో ఏర్పాటైందని, దేశంలో 27 రాష్ట్రాలలో పనిచేస్తున్న ఈ సంఘంలో1కోటి 60 లక్షల మంది సభ్యులు ఉన్నారని వివరించారు.కేంద్ర ప్రభుత్వంఅవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రైతులు,కార్మికులు,కర్షకులు పోరాడాలని పిలుపునిచ్చారు. రైతులు,ప్రజా సంఘాలు మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.


# హైకోర్టు జడ్జి నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

## -కేంద్ర న్యాయశాఖ మంత్రికి తెలంగాణ న్యాయవాదుల వినతి



హైదరాబాద్, జూలై 17 (విజన్ ఆంధ్ర): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తెలంగాణకు చెందిన అర్హత, ప్రతిభ కలిగిన న్యాయవాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్(టీజేఏఏ), ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్(ఎఫ్ఓఎల్పీ), ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్(ఐఎంఎల్ఏ) ప్రతినిధులు కేంద్ర న్యాయ, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. టీజేఏఏ అధ్యక్షుడు అడ్వకేట్ జక్కుల వంశీ కృష్ణ ఆధ్వర్యంలో ఎఫ్ఓఎల్పీ అధ్యక్షుడు అడ్వకేట్ తల్లూరి దిలీప్ చౌదరి, ఐఎంఎల్ఏ తరఫున అడ్వకేట్ మర్రి ప్రకాశ్ రావు న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు న్యాయమూర్తుల సిఫారసులు, నియామకాలలో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలకు చెందిన అర్హులైన న్యాయవాదులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం స్థానిక ప్రజలకు హక్కులు, అవకాశాలు, సముచిత ప్రాతినిధ్యం కల్పించడమేనని, తెలంగాణకు చెందిన అర్హులైన న్యాయవాదులకు న్యాయమూర్తులుగా అవకాశం కల్పించడం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని వివరించారు. అలాగే దేశంలోని ప్రతి రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్ల అడ్వకేట్స్ వెల్ఫేర్ కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని, ప్రతి న్యాయవాదికి హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు అందించాలని, యువ న్యాయవాదులకు స్టైపెండ్ పథకాన్ని అమలు చేసి ఆర్థిక భద్రత కల్పించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంలో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తామని కేంద్ర న్యాయ, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

# జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఘనంగా ప్రారంభం



జనగామ, జూలై 17: జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని నేడు ఘనంగా పారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు,హాజరై జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పార్టీ కార్యకలాపాలకు కేంద్రబిందువుగా నిలుస్తుందని అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీతో పాటు అన్ని అనుబంధ సంఘాల మధ్య సమన్వయం పెంపొందిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ గారు అన్ని విధాలా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా పనిచేస్తే జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు.అలాగే అందరి సహకారం, సమిష్టి కృషితో జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు, ప్రాజజ సభ్యులు, ఐజజ కమిటీ ఆఫీస్ బేరర్లు, బ్లాక్ మరియు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు పాలక మండలి సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మరియు పాలక మండలి సభ్యులు, గ్రాజూ పాలక మండలి సభ్యులు, కౌన్సిలర్లు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యన్ రెడ్డినగర్ పార్కు కబ్జాదారులపై చర్యలు ఎక్కడ

**-మారుతీనగర్ కాలనీవాసులు ఆందోళనలతో తెరపైకి పార్కు స్థలం కబ్జా వ్యవహారం**
**-భూ కబ్జాదారులపై కట్న చర్యలు తీసుకోవాలి: బిజెపి డిమాండ్**



ఎల్బీనగర్ జూలై 17 (విజన్ ఆంధ్ర): అక్రమంగా పార్కు స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న వ్యక్తులపై న్యాయపరమైన, చట్టం పరమైన కేసులు పెట్టాలి బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం ఉమ్మడి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీలో కబ్జాకు గురైన పార్క్ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న వ్యక్తుల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని సంరక్షించడానికి విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రబారి ఆలె భాస్కర్, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిలతో కలిసి అక్రమంగా నిర్మిస్తున్న ప్రాంతానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో అక్రమంగా నిర్మాణం చేపట్టిన వ్యక్తులపైన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా చర్యలు తీసుకోకపోతే నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, సీనియర్ నాయకులు రవీందర్ గౌడ్, యశపాల్ గౌడ్, అంజన్ కుమార్ గౌడ్, విజయ్ కుమార్, వీరాస్వామి గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ నాథ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్, నాయకులు రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, రామేశ్వర్, శ్రీనివాస్ శర్మ, సంగమేశ్వర్ రావు,మహేందర్ రెడ్డి, శ్రీనివాసరావు, సిద్దేశ్వర్, అనిల్, సునీల్ రెడ్డి,రఘువీర్, రాజు, నరసింహ, మురళి, విజయ్ కుమార్, కిషోర్ కుమార్, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, రాకేష్,సాయిరాం, కాలనీ అధ్యక్షులు దుర్గాప్రసాద్, వెంకట్ రెడ్డి, కాలనీ సభ్యులు అరుణ, దుర్గ, స్వాతి, సత్య, ఉమా, శారద, బిందు, సత్యవేణి, మాధవి, భార్గవి, యాదమ్మ, సుచిత్ర, సరిత, ప్రసన్న, అశ్విని, సునీత, శ్రీ మాల, మహేశ్వరి, రమ్య, నాగలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు

# గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 17,(విజన్ ఆంధ్ర)మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గర్మిల సమీపంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు షీ టీం ఎస్ ఐ ఉషా రాణి అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే షి టీం కర్తవ్యం అన్నారు. మహిళలు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. వచ్చిన ఫిర్యాదు పై తక్షణమే షీ టీం పోలీసులు స్పందించి సంబంధిత విభాగాలకు సమాచారం అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు షీ టీం బృందాలు సహాయం చేస్తాయని తెలిపారు. ఆకతాయిల నుండి మరి ఏ ఇతర వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేయాలనుకుంటే 6303923700 నెంబర్ సంప్రదించాలని, అత్యవసర సమయంలో డయల్ 100 కి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు శ్రవణ్, వనిత, పాఠశాల హెడ్ మాస్టర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక ప్రోత్సాహకం

-వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్..
-నాలుగేళ్ల రాయితీలతో పాటు అదనపు ప్రత్యేక సహాయం
-కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-17(విజన్ ఆంధ్ర)ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు నష్టపోకుండా వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ముఖ్యంగా ఒంటరి మహిళా రైతులకు ప్రత్యేక రాయితీలు అందిస్తూ ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరాతో పాటు అంతర పంటల సాగు, తోట నిర్వహణ కోసం నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోందన్నారు. ఈ పంట ద్వారా రైతులు దీర్ఘకాలికంగా స్థిరమైన, అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. పట్టా భూమి కలిగి ఆయిల్ పామ్ సాగు చేయదలచిన ఒంటరి మహిళా రైతులకు ప్రభుత్వం అందించే నాలుగు సంవత్సరాల రాయితీలతో పాటు, రైతుకు అయ్యే అదనపు వ్యయాన్ని కలెక్టర్ ఆధీనంలోని ప్రత్యేక నిధుల ద్వారా భరిస్తామని వెల్లడించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడం, రైతులను లాభదాయక ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించడం, అలాగే ఒంటరి మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ఒంటరి మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగు చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సమీప ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# వరుణుడు కరుణించక రైతుల కంట కన్నీరు

- ఎల్ నినో కారణంగాఅనుకూల వర్షాలు పడక వాడుతున్న పంట మొక్కలను చూస్తూ ఆందోళన చెందుతున్న రైతన్నలు

వికారాబాద్ జిల్లా బ్యూరో, జులై 17 (విజన్ ఆంధ్ర): ఐదారేళ్లుగా అతివృష్టి అనావృష్టి కారణంగా అవస్థలు పడుతున్న రైతులకు ఈసారి వాతావరణ పరిస్థితులు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. అనుకూల వర్షాలు కురిసాకే విత్తుకోవాలని, లేని పక్షంలో ఎల్నినో కారణంగా తీవ్రంగా నష్టపోతారని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. కానీ రుతుపవణాలు సరిగ్గా విస్తరించకున్నా ఆలస్యమైతే వెనుకబడి పోతామన్న ఆలోచనతో రైతులు తొందరపడి పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది, తదితర పంటలను సాగుచేశారు. ప్రతి రోజు కారు మబ్బులతో మేఘాలు కమ్ముకుంటున్నా.. ఉద్రుతమైన ఈదురు గాలులు వీస్తుండడంతో మేఘాలు వర్షించకుండా మరోప్రాంతానికి తరలివెళ్తున్నాయి. కారణంగా నేలలో తేమ సరిపోయినంత లేక పలు ప్రాంతాల్లో విత్తిన విత్తనాలు కూడా సరిగ్గా మొలకెత్తక నెమళ్లు, పక్షులకు ఆహారంగా మారాయి. మిగిలిన ప్రాంతాల్లో మొలకలు వచ్చినా చినుకు పడక వేసిన పంటలు కళ్లముందే ఎదగకుండా వాడుతుండడంతో రైతన్నల కంట కన్నీరు కారుతోంది.



అధికారులు తగు సూచనలిచ్చి తమ పంటలను కాపాడాలని, లేని పక్షంలో అప్పుల్లో కూరుకుపోతామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగు వివరాలివీ..కారాబాద్ జిల్లాలో పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని 20 మండలాలలో సాధారణ సాగు విస్తీర్ణం 5.85 లక్షల ఎకరాలుండగా.. 3.25 లక్షల మంది రైతులున్నారు. వ్యవసాయాధికారుల గణాంకాల ప్రకారం.. మొత్తం 3 లక్షల 15 వేల 979 ఎకరాలలో వివిధ పంటలను సాగుచేశారు. 2,13,321 ఎకరాలలో పత్తి పంటను సాగు చేయగా, 28 వేల 871 ఎకరాల్లో మొక్కజొన్న విత్తుకున్నారు. 253 ఎకరాల్లో జొన్న. 65 వేల 470 ఎకరాల్లో కంది పంటను, 1,232 ఎకరాలలో సోయాబీన్ సాగుచేయగా, 795 ఎకరాలలో మినుములు, 5,101 ఎకరాల్లో పెసలు, 40 ఎకరాలలో చెరుకు, 68 ఎకరాల్లో నేపియర్ గడ్డిని సాగుచేశారు. జిల్లాలో నమోదైన వర్షపాతం ఇదీ..వర్షాకాలం మొదలు ఈనెల 15 వ తేదీ వరకు జిల్లాలోని 20 మండలాలలో సాధారణ వర్షపాతం 199.1 మిల్లీ మీటర్లు నమోదు కావాల్సి ఉండగా.. 114.1 మిల్లీ మీటర్ల వర్షపాతమే నమోదైంది. ప్రతి రోజు విస్తరిస్తున్న మేఘాలను పరిశీలిస్తూ.. వర్షం కోసం ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఏమవుతాయోనని ఆందోళనకు గురవుతున్నారురైతులు ఆందోళనకు గురి కావద్దు కవిత, జిల్లా వ్యవసాయ అధికారి, వికారాబాద్ జిల్లా. వర్షాభావం కారణంగా పొలంలో తేమశాతం తగ్గిందని రైతులు ఆందోళన చెందొద్దు. నేలలో తేమను పెంచేందుకు లీటరు నీటికి 5 గ్రాముల యూరియాను కలిపిన ద్రావణాన్ని 10 రోజులకు ఓసారి పంట చేనుకు పిచికారి చేసుకోవాలి. వర్షాలు పడిన తర్వాత అవసరమైన పాళ్లలో యూరియాను చల్లుకోవాలి. ప్రస్తుత సమయంలో చీడపీడలు ఆశిస్తే లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్ ను కలిపి పిచికారి చేయాలి. మొక్కజొన్నలో కత్తెర పురుగు దాడి చేస్తే కార్బోఫిరాన్ గుళికలను కొద్దికొద్దిగా చల్లుకోవాలి.

# ఉద్యోగాల పేరుతో భారీ మోసం.. ప్రధాన నిందితుడు అరెస్ట్ - డీఎస్పీ జీవన్ రెడ్డి




ఆదిలాబాద్, జులై 17 (విజన్ ఆంధ్ర):ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అమాయక నిరుద్యోగులను నమ్మించి, లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడిన అంతర్జిల్లా జాబ్ ఫ్రాడ్ ముఠా ప్రధాన నిందితుడిని ఆదిలాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లికి చెందిన గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్, ఈ కేసులో ప్రధాన నిందితుడైన మహ్మద్ బాబర్ (ఏ-4)ను అదుపులోకి తీసుకున్నట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి వివరాలను వెల్లడించారు. నిందితుడి నుంచి నకిలీ నియామక పత్రాలు, ఒక ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. 2025 అక్టోబర్ 14న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నుగురు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్ (స్కిల్ అసిస్టెంట్) ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, ఒకే కుటుంబానికి చెందిన నుగురు రవి, నర్సమ్మ, పృథ్వీల నుంచి నిందితులు మొత్తం రూ.5.30 లక్షలను నగదు మరియు ఫోన్‌పే రూపంలో వసూలు చేశారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లేని గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ పేరుతో నకిలీ నియామక ఉత్తర్వులు (ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్) సృష్టించి ఇచ్చి మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జూలై 16న విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాన నిందితుడు మహ్మద్ బాబర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు అమాయక నిరుద్యోగులను ట్రాప్ చేయడానికి పల్లికొండ కార్తీక్ (నిర్మల్-ఏ1), రాహులపెంట సతీష్ (సూర్యాపేట-ఏ2), వడేకర్ నవీన్ కుమార్ (భైంసా-ఏ3)లను మధ్యవర్తులుగా ఉపయోగించుకున్నాడు. వారి ద్వారా వసూలు చేసిన డబ్బులో మధ్యవర్తులకు కమీషన్లు ఇచ్చి, మిగిలిన పెద్దమొత్తాన్ని తానే తీసుకున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ కేసులో ముగ్గురు మధ్యవర్తులను గతంలోనే అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపగా, తాజాగా ప్రధాన నిందితుడు బాబర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసే దళారులను, నకిలీ సంస్థలను నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ఈ సందర్భంగా ప్రజలను హెచ్చరించారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన టూ టౌన్ ఎస్సైలు ప్రణయ్ కుమార్, విష్ణు ప్రకాష్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## పొన్నం కాలనీలో మాక్స్ క్రికెట్ బాక్స్, పికిల్‌బాల్ కోర్టు ప్రారంభం





సంగారెడ్డిబ్యూరో,జూలై :17(విజన్ ఆంధ్ర )సంగారెడ్డి పట్నం లోని పొన్నం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మాక్స్ క్రికెట్ బాక్స్,పికిల్‌బాల్ కోర్టును గురువారం నాడు మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా అందిస్తాయని అన్నారు. పొన్నం కాలనీలో ఏర్పాటు చేసిన ఈ ఆధునిక క్రీడా ప్రాంగణం కాలనీవాసులతో పాటు సంగారెడ్డి పట్టణ ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.

అనంతరం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విశాలమైన ప్రాంగణంలో ఆధునిక క్రీడా సౌకర్యాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసిన శ్రీకాంత్ గౌడ్‌తో పాటు వారి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన కాసేపు క్రికెట్ ఆడి అక్కడికి వచ్చిన వారిని ఉత్సాహపరిచారు. యువజన సంఘాల నాయకుడు కూన వేణు మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. యువత కోసం ఇలాంటి క్రీడా వేదికను ఏర్పాటు చేసిన శ్రీకాంత్ గౌడ్‌ను, ప్రోత్సహించిన హనుమంకు గౌడ్, నరేష్‌తో పాటు నిర్వాహక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, కాలనీవాసులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి రేషన్ కార్డ్ కలిగిన సభ్యులు ఈ కేవైసీ చేసుకోవాలి



సిద్ధిపేట జిల్లా ప్రతినిధి 17 జూలై సిద్ధిపేట జిల్లాలో గల రేషన్ కార్డుదారులందరూ ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ ఒక ప్రకటన తెలిపారు. కమిషనర్, పౌర సరఫరాల శాఖ, తెలంగాణ వారి ఆదేశాల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ (గ్రాఖా) ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నిరంతరాయంగా ఆహార ధాన్యాల పంపిణీ కొనసాగించేందుకు రేషన్ కార్డుదారులందరూ ఈ-కేవైసీ (వ-ఖ్జ) ప్రక్రియను ఈ నెల 31 లోపు తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. సిద్ధిపేట జిల్లాలో మొత్తం 10,47,075 మంది లబ్ధిదారులు ఉండగా, ఇప్పటివరకు 8,48,446 మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారు. దీంతో జిల్లాలో 81.03 శాతం ఈ-కేవైసీ పూర్తి అయింది. కొన్ని రేషన్ కార్డులలో కుటుంబ సభ్యులలో ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేసి, మిగిలిన సభ్యులు ఈ-కేవైసీచేయించుకోనట్లు గుర్తించడమైనది. అటువంటి ఈ-కేవైసీ పూర్తి చేయని కుటుంబ సభ్యుల వివరాలను క్షేత్రస్థాయియంత్రాంగానికి అందజేయడం జరిగింది. సంబంధిత అధికారులు, చౌక ధరల దుకాణ డీలర్లు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది ఆయా కుటుంబాలను సంప్రదించి ఈ-కేవైసీ పూర్తి చేయించేందుకు చర్యలుచేపడుతున్నారని, ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని రేషన్ కార్డుదారులందరూ తమ సమీప చౌక ధరల దుకాణాన్ని సంప్రదించి వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఆ పట్టణంలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దుబాయిలో ఉద్యోగాలకై 21న ఇంటర్వ్యూలు

## జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి

గద్వాల జూలై 17 (విజన్ ఆంధ్ర బ్యూరో)తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ మరియు ప్యాక్టరీల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నమోదిత రిక్రూట్మెంట్ ఏజెన్సీ దుబాయ్ లోని ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలకై ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హత కలిగిన నైపుణ్యం గల అభ్యర్థులకు విదేశీ ఉపాది అవకాశాలు కల్పించడం టామ్ కామ్ ప్రధాన లక్ష్యమని, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని దుబాయ్ లో ఉన్న ఒక ప్రముఖ కంపెనీలో అత్యవసర విదేశీ ఉద్యోగ ఆకాశాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం క్లీనర్స్, టైల్ మేసన్, ఆల్ రౌండ్ మేసన్, బ్లాక్/ప్లాస్టర్ మేసన్, స్టీల్ పిక్సర్, షట్టరింగ్ కార్పెంటర్, ప్లంబర్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రిషియన్, ఫినిషింగ్ కార్పెంటర్, ఎంఐజి వెల్డర్ మరియు జనరల్ హెల్పర్ ట్రేడ్లలో 500 మంది అభ్యర్థుల అవసరం ఉందన్నారు. నైపుణ్య గ్రేడ్ ప్రకారం ఓవర్ టైమ్ తో పాటు జీతం అందించబడుతుంది. వసతి, రవాణా, వంటగది సౌకర్యం యజమాని ద్వారా కల్పించబడుతుందన్నారు. పని గంటలు రోజుకు 9 గంటలు అని, ఆసక్తి గలవారు ఓవర్ టైమ్ కూడా పనిచేసేందుకు అవకాశం ఉందన్నారు. జాయినింగ్ ఎయిర్ టిక్కెట్ ఖర్చును అభ్యర్థి భరించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల ట్రేడ్లలో ఆసక్తిగల అభ్యర్థులకు సంబంధిత అనుభవం ఉండాలన్నారు. ఈ నియామకం ఆఫ్ లైన్ ఇంటర్వ్యూ ప్రక్రియ ద్వారా ఈ నెల 21న హైదరాబాద్లోని మసబ్ ట్యాంక్ సమీపంలో ఉన్న కొత్త టామ్కామ్ కార్యాలయం (టీజీఐఐసీ భవనం) లో జరగనున్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నవీకరించిన రెజ్యూమె, పాస్పోర్ట్, విద్యార్హత, అనుభవ ధృవపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. ఇతర వివరాలకు 8328602231, 9440050951, 9440051452 నంబర్లలో సంప్రదించవచ్చని ఆమె పేర్కొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే 'భూభారతి' రీ-సర్వే - జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్, జూలై 17 (విజన్ ఆంధ్ర):భూ సమస్యల పరిష్కారానికి, వ్యవసాయ రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం బజార్‌హత్నూర్ మండలం గంగాపూర్ గ్రామంలో భూభారతి భూముల సర్వే పై నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు గంగాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గతంలో 1934లో జరిగిన సర్వే తర్వాత, మళ్లీ ఇప్పుడు అత్యాధునిక సాంకేతికతతో కూడిన మెషీన్ల ద్వారా భూభారతి రీ-సర్వే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలోని మొత్తం 509 గ్రామాలకు గాను, ప్రస్తుతం మొదటి విడతగా 70 గ్రామాలలో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో నక్ష, రికార్డులు లేని నాన్-కాడస్ట్రల్ గ్రామాలలో మూడు నాలుగు నెలల క్రితమే ఈ సర్వేను ప్రారంభించామని వెల్లడించారు. ఈ రీ-సర్వే ద్వారా గ్రామ సరిహద్దులను నిర్ణయించిన అనంతరం, అగ్రికల్చర్, నాన్-అగ్రికల్చర్ భూములను సర్వే చేసి డిజిటలైజ్ చేస్తామని, దీని ఆధారంగా ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తరహాలోనే భూములకు 'భూదార్ కార్డ్' అందజేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనివల్ల భవిష్యత్తులో భూముల రిజిస్ట్రేషన్లు, కొనుగోళ్లు, అమ్మకాలు పారదర్శకంగా జరుగుతాయని, కుటుంబ సభ్యుల మధ్య గానీ, ఇతరుల మధ్య గానీ వచ్చే భూ పంచాయితీలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. భూ సర్వే సమయంలో రికార్డుల నమోదు కోసం అధికారులు నోటీసులు ఇచ్చినప్పుడు, రైతులు తమ క్లెయిమ్స్, అభ్యంతరాలను సమర్పించి ఈ ప్రక్రియను విజయవంతం



చేయడానికి అధికారులకు సహకరించాలని కోరారు. గ్రామాభివృద్ధిలో భాగంగా వి.బి.జి.రాంజీ స్కీమ్ కింద గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అవసరమైన శాంక్షన్లు ఇచ్చి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు జిల్లాలో, ముఖ్యంగా బజార్‌హత్నూర్ మండలంలో వర్షపాతం చాలా తక్కువగా నమోదవుతోందని, సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారుల సూచనలను తప్పక పాటించాలని కలెక్టర్ కోరారు. భూమిలో తేమను నిలిపి ఉంచడానికి మల్చింగ్ పద్ధతిని ఉపయోగించాలని, పంటతో పాటు పెరిగే కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని, 2% ఫోలియర్ స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. ఒకవేళ వర్షాలు పూర్తిగా లేని పక్షంలో ప్రత్యామ్నాయంగా కందులు, పెసర్లు, మినుములు వంటి ఇతర తక్కువ నీటితో పండే పంటల వైపు వెళ్లాలని, సాగునీటి సదుపాయం లేని రైతులు పంట మార్పిడి చేసుకోవాలని ఉద్బోధించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ సౌద్ మాట్లాడుతూ.. ఎల్నినో ప్రభావం వలన వర్షపాతం తక్కువ ఉన్నందున పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులను, యూరియా బుకింగ్ విధానంపై రైతులకు వివరించారు. గ్రామసభ అనంతరం మండల పరిధిలోని డెడ్రా, మంకపూర్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి, స్థానిక సమస్యలపై సమీక్షించారు. అటవీ శాఖ అనుమతులు వచ్చినందున ఐటీడీఏ ద్వారా నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పునఃప్రారంభిస్తామని, 'వీబీజీ రాంజీ' పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల విడుతలలో మంకపూర్ గ్రామంలోని గుడిసె నివాసితులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. రైతుల సాగునీటి అవసరాల కోసం బోరు, బావి సౌకర్యం ఉన్న వారికి అటవీ శాఖ అనుమతులతో త్రీ-ఫేజ్ విద్యుత్ అందిస్తామన్నారు. రైతులు గ్రూప్‌గా ఏర్పడి రూ. 9,150 చెల్లిస్తే, కిలోమీటర్ పరిధి వరకు 20 స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉచితంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించి, గురుకుల ప్రవేశ పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం మాన్కాపూర్ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల బోధన కొరకు స్మార్ట్ టివిని భూ సర్వే శాఖ ఏడి ప్రభాకర్ తన సొంత ఖర్చులతో కొనుగోలు చేయగా, కలెక్టర్ చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. విద్యా పట్ల తన అంకితభావాన్ని చాటుకున్న ఏడి ప్రభాకర్ ను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ గ్రామసభ, పర్యటనలలో తహసీల్దార్ శ్యామ్ సుందర్, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్, సర్పంచ్లు సుభాష్, విజయ్, అనిల్, ఏఈఓ ప్రవీణ్, ఉపాధ్యాయుడు దేవ్ రావ్, స్థానిక రైతులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి

### సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా ఉప సంచాలకులు చింతామణి

కడప,జూలై 17 (విజన్ ఆంధ్ర)జిల్లాలోని ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం అందించే విద్యా సంబంధిత ఆర్థిక ప్రయోజనాలు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ కావడానికి, బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ (చీూజ×) అనుసంధానం తప్పనిసరిగా చేయించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా ఉప సంచాలకులు చింతామణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1,349 మంది ఎస్సీ విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఇప్పటికీ ఎన్‌పీసీఐ అనుసంధానం పూర్తికాలేదని వెల్లడించారు. సంబంధిత విద్యార్థులు వెంటనే తమ బ్యాంకు లేదా ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్ (×ూూదీ) కేంద్రాలను సంప్రదించి ఆధార్‌తో పాటు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానం లేకపోతే ప్రభుత్వ పథకాల కింద అందే ఆర్థిక సహాయం జమ కావడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని త్వరితగతిన ఎన్‌పీసీఐ అనుసంధానం పూర్తి చేసుకోవాలని జిల్లా ఉప సంచాలకులు చింతామణి కోరారు.

# శంకుస్థాపన చేసిన 10 రోజుల్లోనే పనులు ప్రారంభించాలి: ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్, జూలై 17 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను వారం నుంచి పది రోజుల్లోనే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మత్తులు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు విడుదల చేసిందని, ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా వినియోగించాలని ఆయన కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో మంజూరైన పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిధుల మంజూరుకు ప్రత్యేకంగా సహకరించిన జిల్లా ఎంపీ జి. నగేష్‌కు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ, గురుకుల పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ఇతర మౌలిక వసతుల కోసం భారత ప్రభుత్వం ఆర్టికల్ 275(1) కింద రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.39 కోట్ల నిధులు విడుదల చేశామని ఆయన తెలిపారు. అలాగే ఆశ్రమ పాఠశాలల మరమ్మత్తులు, అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.60 కోట్ల నిధులు మంజూరు కాగా, అందులో ఒక్క ఆదిలాబాద్ జిల్లాకే రూ.16 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ పనులన్నింటినీ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని ఎంపీ నగేష్ స్పష్టం చేశారు.

## తెలంగాణ గిరిజన సమాఖ్య మండల కమిటీ ఎన్నిక

అబ్దుల్లాపూర్ మెట్ జూలై 17 (విజన్ ఆంధ్ర): తెలంగాణ గిరిజన సమాఖ్య అబ్దుల్లాపూర్మెట్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండలం ఎమ్మెల్సీ నాగోల్ సర్కిల్ కుంట్లూర్ రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 2 సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన నిర్మాణ మహా సభకి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి హాజరై నూతన కమిటీని ప్రకటించారు. తెలంగాణ గిరిజన సమైక్య అబ్దుల్లాపూర్ పెట్టు మండల నూతన అధ్యక్షులుగా బాణావత్ వెంకట్ నాయక్, గౌరవ అధ్యక్షులుగా మూడవత్ లోక్య, ఉపాధ్యక్షులుగా వంశీ, శ్రీనివాస్, సరిలాల్, కార్యదర్శిగా లావుద్య శంకర్, సహాయ కార్యదర్శులుగా అంగిడి అశోక్, సూర్య, కోశాధికారిగా లచ్చునాయక్, కార్యవర్గ సభ్యులుగా సురేష్, క్రాంతి, దేవరాజ్, ఇస్లావత్, దాస్, రాజు, బద్రు, ప్రియా, తిరుపతి, విజయ్, శ్రీదేవి, జ్యోతి, శ్రీను తదితరులు ఎన్నికయ్యారు.

# ప్రధానమంత్రి విశ్వకర్మ లబ్ధిదారులకు అవగాహన




సూర్యాపేట జూలై 17:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కార్యాలయం, హైదరాబాద్ సమన్వయంతో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారుల కోసం శుక్రవారం ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ లో మార్కెటింగ్, బ్రాండింగ్‌పై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు మార్కెటింగ్, ఆర్థిక అక్షరాస్యత, ఈ వాణిజ్యం, వ్యవస్థాపకత అభివృద్ధి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. వ్యాపార అభివృద్ధికి అవసరమైన మార్కెటింగ్ విధానాలు, ఉత్పత్తుల ప్రచారం, డిజిటల్ వాణిజ్యం, ఆర్థిక నిర్వహణ, స్వయం ఉపాధి అవకాశాలపై నిపుణులు విలువైన సూచనలుఅందించారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కార్యాలయం, హైదరాబాద్ సహాయ సంచాలకులు నవీన్ కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రధాన నిర్వాహకులు భారతి, వ్యవస్థాపకత అభివృద్ధి కేంద్రం మేనేజర్ నరేష్, సహాయ మేనేజర్లు రాజు, ప్రసాద్, భారతీయ స్టేట్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ మేనేజర్ ప్రవీణ్, డొమైన్ నిపుణులు శ్రీ యశ్వంత్, శ్రీ వీరేందర్, భాగ్యరెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇట్యాల గ్రామంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఎమ్మెల్సీ దండే విట్టల్ పర్యటన

**- అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని పలు ప్రారంభోత్సవాలు..**

**- పారిశుద్ధ్య కార్మికులకు రైన్‌కోట్లు, యూనిఫాంల పంపిణీ**



దహేగాం, జూలై 17 (విజన్ ఆంధ్ర): కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలోని ఇట్యాల గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.దగ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు స్థానిక సర్పంచ్ శ్రీమతి గజ్జల జయలక్ష్మి పూలకుండితో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ పెద్ద గజ్జల సురేష్ శాలువాలు కప్పి, బొకేలు అందించి వారిని సన్మానించారు. గ్రామస్థులు డప్పులు, హారతులతో నాయకులకు ఆత్మీయ స్వాగతం పలికారు. గ్రామ ప్రవేశం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర కాలినడకన పర్యటించిన ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు, అవసరాలను వారికి వివరించారు. ముందుగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. అనంతరం ఇటీవల దూపదీప నైవేద్య పథకం జాబితాలో చేర్చబడిన హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి అక్కడి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన వీఓ భవనం (సరస్వతి గ్రామీణ భవనం)ను ప్రారంభించి మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. వర్షాకాలంలో విధులు నిర్వహించే గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఒక జత రైన్‌కోట్లు, ఒక జత యూనిఫాంలను పంపిణీ చేసి వారి సేవలను అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR)కు సంబంధించిన వివరాలను బీఎల్ఓ రమాదేవి, బీఎల్ఏ వశక మురారి వద్ద అడిగి తెలుసుకున్నారు. ఇంకా మిగిలి ఉన్న 176 దరఖాస్తులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ ఆత్మారావు, ఏపీఎం ప్రకాష్, కుంచవెల్లి సర్పంచ్ ప్రశాంత్, లగ్గం సర్పంచ్ మహేష్ గౌడ్, కోత్మీర్ సర్పంచ్ సత్యనారాయణ, ఇట్యాల ఉపసర్పంచ్ సాయిరే శ్రీనివాస్, రాటే సోమయ్య, షేక్ షరీఫ్, హైమద్ హుస్సేన్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ద

# యమపాశంగా - విద్యుత్ స్తంభాలు

**- కూలే స్థితిలో విద్యుత్ స్తంభం - చర్యలు శూన్యం!**


**- రైతు ప్రాణానికి లేని భరోసా?**

**- మొద్దు నిద్రలో విద్యుత్ శాఖ?**



కామారెడ్డి బ్యూరో జులై 17 (విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలంలోని యాచారం,ఎల్లమ్మ కుంట గ్రామ శివారులో విద్యుత్ స్తంభం నేలకొరకడానికి సిద్ధంగా ఉంది. గత కొన్ని రోజులుగా స్తంభం పూర్తిగా ఒక సైడ్ కు వంగిపోయి ఉన్నప్పటికీ, విద్యుత్ శాఖ, సంబంధిత అధికారులు ఇప్పటికీ స్పందించలేదు. వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులు అరచేతిలో ప్రాణం పెట్టుకుని వెళ్తున్నారు. ఆ దారి గుండా వెళ్లాలంటే, పవర్ సప్లై ఉందో లేదో తెలియక, ఆ స్తంభం ఏ రైతును బలి తీసుకుంటుందో అని రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడానికి ఎంత ప్రయత్నించి వారు స్పందించడం లేదని రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇకనైనా మొద్దు నిద్రను వీడి సమస్య పరిష్కారానికి నడుం బిగిస్తారా లేదా వేచి చూడాలి.

# యస్.సి స్టడీ సర్కిల్, హైదరాబాద్ యూపిఎస్సి ఉచిత కోచింగ్ ను సద్వినియోగం చేసుకోవాలి..



సూర్యాపేట జూలై 17:(విజన్ ఆంధ్ర) : టి.జీ యస్.సి స్టడీ సర్కిల్, హైదరాబాద్ ద్వారా శిక్షణ పొంది ఐఏఎస్, ఐపియస్, ఐఎఫ్ యస్, గ్రూప్-1 వంటి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల విజయ గాథ లతో రూపొందించిన బుక్ లెట్ ను సూర్యాపేట జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నంద్ లాల్ పవార్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నందు ఆవిష్కరించారు. అర్హులైన సూర్యాపేట జిల్లా నిరుద్యోగ అభ్యర్థుల నుండి 10 నెలల యు.పి.యస్.సి ఉచిత కోచింగ్ కొరకు తేది: 19జూలై 2026 వరకు ఆన్ లైన్ లో ష్ట్రిజూం:₹/ంర్బంఎఏఅతీఎశ్రీవ.ఎశీ.ఱఅ వెబ్ సైట్ ద్వారా అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా స్టడీ సర్కిల్ గౌరవ డైరెక్టర్ టి. నాగయ్య గారు పాల్గొన్నారు. మరిన్ని వివరములకు ఫోన్ నెంబర్ : 9701775868 లో సంప్రదించగలరు.

# షెడ్యూల్డ్ కులములు, తెగల అభివృద్ధికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలి

**- రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 17, (విజన్ ఆంధ్ర) : జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల వారికి రాజ్యాంగం కల్పించిన చట్టాల ప్రకారం అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్.సి., ఎస్.టి. లకు సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలలోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, ఎస్.సి., ఎస్.టి. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా అటవీ అధికారి బాలమణి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఎస్.సి., ఎస్.టి. కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్, కుసుం నీలాదేవి లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 33 వేల 627 మంది షెడ్యూల్డ్ తెగలు, 81 వేల 596 మంది షెడ్యూల్డ్ కులముల వారు ఉన్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం సంక్షేమ పథకాలు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని, వసతి గృహాలు, గురుకులాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, 10వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేలా నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, తెగల ప్రజలు నివసిస్తున్న గ్రామాలకు రహదారి సౌకర్యం, త్రాగునీటిని అందించాలని, రహదారి నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు త్వరగా జారీ చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులను త్వరగా విచారించి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని, అట్రాసిటీ బాధితులకు త్వరగా పరిహారం అందించాలని తెలిపారు. జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలను ప్రోత్సహించాలని, ఉపాధి కల్పనలో ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. ప్రతి నెల 30వ తేదీన నిర్వహించే పౌర హక్కుల దినోత్సవానికి మండల స్థాయి అధికారులు తహసిల్దార్, ఎస్.ఐ.లు తప్పనిసరిగా హాజరై ఎస్.సి., ఎస్.టి. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద షెడ్యూల్డ్ తెగలు, కులముల అర్హత గల కుటుంబాలకు 100 రోజుల పని కల్పించాలని తెలిపారు. రెవెన్యూ అటవీ శాఖల మధ్య ఉన్న భూముల వివాదాలను ఉమ్మడి సర్వే నిర్వహించి పరిష్కరించుకోవాలని, ప్రభుత్వ పథకాలలో షెడ్యూల్డ్ కులములు, తెగలకు వారి హక్కుల ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలిపారు. మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య కార్మికులకు పి.ఎఫ్. అమలు, బీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగలు, కులములవారికి అందవలసిన సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, తెగలవారు నివసించే గ్రామాలలో రహదారి పనులు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు అటవీశాఖ అధికారులు త్వరగా అనుమతులు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ నిధులను వారి ప్రాంతాలలో ఖర్చు చేసే విధంగా, గిరిజనేతరులు సాగు చేసే పోడు భూముల సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, డి.ఎస్.పి.లు అశోక్, వహీదుద్దీన్, జిల్లా అధికారులు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి..

**- మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత**



సూర్యాపేట జూలై 17:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, ఇంజనీరింగ్,పరిశుద్ధ్య విభాగంలో ఖాళీ పోస్టుల భర్తీ, త్రాగునీటి సరఫరా మెరుగుదల, యూజీడీ పనుల అనంతరం రోడ్ల పునరుద్ధరణతో పాటు శ్రీ లింగమంతుల స్వామి గుట్ట చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ అండ్ డైరెక్టర్ టీ.కే. శ్రీదేవికి విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలనే విజ్ఞప్తితో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ అండ్ డైరెక్టర్ టీ.కే. శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు వివిధ గ్రాంట్ల ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరారు. మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలో ఖాళీగా టెక్నీకల్ పర్సన్ (టీఓ), అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), పరిశుభ్రత విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణపై ప్రభావం పడుతోందని వివరించారు. ఈ పోస్టులనుభర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు అదనపు పైప్‌లైన్ల ఏర్పాటు కోసం నిధులు అవసరమని, ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. అలాగే తెలంగాణలో రెండో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన శ్రీశ్రీ లింగమంతుల స్వామి గుట్ట సమీపంలోని చెరువును సుందరీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే పట్టణానికి ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని సూచించారు. ఇదే సందర్భంగా పట్టణంలో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనుల కారణంగా తవ్విన రోడ్లను ఇప్పటికీ పూర్తిస్థాయిలో పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని టీ.కే. శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో పాటు కాంట్రాక్టర్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, రోడ్ల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశాభావాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత వ్యక్తం చేశారు. సూర్యాపేట అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షిస్తూ, పట్టణ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆమె తెలిపారు.

# సోమవారం పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

**- జిల్లా వైద్యాధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి**




గద్వాల్ జూలై 17 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగ, గత సోమవారము రోజున ఆల్బెండజోల్ మాత్రలు తప్పిన పిల్లలందరికి తిరిగి 20-7-2026 సోమవారము రోజున మాత్రలు పంపిణీ కార్యక్రమం డిఎంహెచ్ఓ డాక్టర్ సంధ్యకిరణ్మై,జిల్లా ఉప వైద్యాదికారి డాక్టర్ అస్గర్ అలి పర్యవెక్షణలో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు గత సోమవారం వేయించడం చేయడం జరిగింది. జిల్లాలో ఏ ఒక్క పిల్లలు, యువతి యువకులు మిస్స్ కాకుండ అందరికి మాత్రలు వేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలలో, జూనియర్ కళాశాలలలో, కేజిబివి.పాఠశాలలలో అంగన్వాడి కెంద్రాలలో గత 13-7-2026 సోమవారము రోజు వేసుకోకుండ మిగిలిన విద్యార్థులందరికి తిరిగి మాప్ అప్ డే 20-7-2026 సోమవారం రోజున యదవిధిగ విధ్యసంస్థలలో వేయించడం జరుగుతుందని తెలిపారు.

**ఎచ్ పివి.వ్యాక్సిన్ పై అపోహాలు నమ్మవద్దు**

**జిల్లాలో కొనసాగుతున్న ఎచ్ పివి. వ్యాక్సిన్ టీకాలు**

హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వ్యాక్సిన్ 14 సంవత్సరాల పైబడి 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ముందస్తుగ నివారించడానికి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రభుత్వ ఆసుపత్రులలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఏరియా ఆసుపత్రులలో ఈ టీకా ఉచితంగ వేయడం జరుగుతుంది. క్యాన్సర్ వ్యాధి భారతీయ మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్ వ్యాధిగ నిర్ధారణ కావడం జరిగింది. కావున తల్లిదండ్రులు ఎలాంటి అపోహాలను నమ్మకుండ తమ బాలికలకు ఎచ్ పివి.టీకా వేయించాలని కోరడం జరిగింది. ఈ టీకా గర్భాశయ క్యాన్సర్ వ్యాధిని నివారించడంలో అత్యంత సమర్థవంతమైన టీకా, ఈ టీకా వలన క్యాన్సర్ కు కారణమయ్యే అంటువ్యాధులను నివారించడం ద్వార సంతానోత్పత్తిని రక్షించడంలో ఇది సహాయపడుతుందని అన్నారు. ఈ టీకా వలన ఎలాంటి దుష్ప్రభావాలు కానీ హాని కానీ జరగదు ఎచ్పివి. టీకా అర్హత కలిగిన ప్రతి బాలిక తీసుకునే విధంగ, వారి తల్లిదండ్రులు ఇప్పించే విధంగ ప్రోత్సహించాలని జిల్లా స్థాయి అధికారులకు మండల స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అందరికీ సవినయంగ తెలియజేశారు. ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగ డిఎంఎచ్ఓ.చేతుల మీదుగ డాక్టర్ రాజు, టిబి- ప్రోగ్రామ్ అధికారి అధ్వర్యంలో క్యూబ్ రూట్స్ సంస్థ వారు అందజేసిన 50 మంది టిబి.వ్యాధి గ్రస్థులకు న్యూట్రిషన్ కిట్లు అందజేయడం జరిగింది. టిబి వ్యాధిగ్రస్తులు చికిత్స సమయంలో ఔషధాలతో పాటు మంచి పోషకహారం తీసుకుంటే టీబీ వ్యాధిని సకాలంలో జయించవచ్చుని, ఆర్థికంగ ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి ఈరోజు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగ మన జిల్లాలో టిబి వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని పోషక ఆహార కిట్లు అందించడానికి ముందుకు రావాలని కోరడం జరిగింది. ఎవరైనా ఇలాంటి సహాయం చేయాలనుకున్న వారు డిఎంఎచ్ఓ. కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని అన్నారు.

# పీరంపల్లి గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

**- ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం ప్రారంభం**

**- డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం**

**- గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి**

**- గ్రామ సర్పంచ్ బావనోళ్ల గురువారెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటు**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 17 ( విజన్ ఆంధ్ర ) : వాతావరణం మార్పుల కారణంగా వచ్చే వ్యాధుల నుండి ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని పీరంపల్లి గ్రామ సర్పంచ్ బావనోళ్ల గురువారెడ్డి హితవు పలికారు. తాగు నీటిని కాచి వడగట్టి చల్లార్చిన తరువాత తాగాలని సర్పంచ్ సూచించారు. 2026 జూలై 18 శనివారం డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో పీరంపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు కానున్నదని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విఫ్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి సౌహార్ద్ర హృదయంతో పీరంపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారని గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. మీ అనారోగ్య సమస్యలను విశేష అనుభవం గల వైద్యులకు నిర్మొహమాటంగా చెప్పి వైద్యం పొందాలని తెలిపారు. సుదీర్ఘ కాలంగా పీడిస్తున్న వ్యాధులను వైద్యులు పరీక్షించి, ప్రత్యేక వైద్య చికిత్స అవసరమైతే డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స అందజేస్తారని గ్రామ సర్పంచ్ అన్నారు. అన్ని రకాల రోగాలను పరీక్షించి ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు.

# నీట్ -2026 ఎంట్రన్స్ ఫలితాలలో 'షైన్' విద్యార్థుల విజయకేతనం




హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 17 ( విజన్ ఆంధ్ర ): నీట్-2026 ఎంట్రన్స్ ఫలితాలలో షైన్ జూనియర్ కళాశాల విద్యార్థులు కార్పోరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలు సాధించినట్లు షైన్ విద్యాసంస్థల ఛైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు మూగుల రమ, ఆరూరి కవిత, పి. రాజేంద్రకుమార్, మూగుల రమేష్ లు సంయుక్తంగా తెలియజేశారు. ఈ సందర్భంగా మూగుల కుమార్ యాదవ్ మాట్లాడుతూ, షైన్ విద్యాసంస్థలు మొదటి నుండి నీట్, జేఈఈ మెయిన్స్ మరియు అడ్వాన్స్ లో అత్యుత్తమ శిక్షణను అందిస్తున్నామన్నారు. జాతీయస్థాయిలో ఎం.డి. అకీబ్ అలి (రోల్ నెంబర్ 4205110050)-504, ఎమ్. నలిన్ ప్రభాత్ (రోల్ నెంబర్ . 4205105052) - 480, టి. హాసిని (రోల్ నెంబర్ .4205101058)-406, ఎస్. సాయిప్రశాంతి (రోల్ నెంబర్ . 4205108135) 396 మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. వీరితోపాటు 15 మంది విద్యార్థులు 350 మార్కులకు పైగా సాధించి విజయభేరి మోగించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కుమార్ యాదవ్, యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమములో షైన్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

**- డీసీపీ ఎగ్గడి భాస్కర్**



మందమర్రి, జూలై 17 (విజన్ ఆంధ్ర) : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బొక్కల గుట్ట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,మందమర్రి సీఐ పర్ష రమేష్,ఆర్కేపీ ఎస్సై జాడి శ్రీధర్ తో కలిసి ప్రారంభించారు. సీసీ కెమెరాల సహాయంతో అనుమానితులను త్వరగా గుర్తించవచ్చని,దొంగతనాలను సైతం అరికట్టవచ్చని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పట్టణ పోలీస్ స్టేషన్లో నిత్యం పరిశీలిస్తామని సీఐ రమేష్,ఎస్సై శ్రీధర్ పేర్కొన్నారు.

# మహానంది అవార్డు అందుకున్న రుద్రారం గ్రామవాసి మురళి



చిన్నశంకరంపేట, జూలై17, (విజన్ ఆంధ్ర )ప్రతినిధి: చిన్న శంకరంపేట మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ఉషన్న గళ్ళ మురళి మాదిగ తను చేసిన సోషల్ వర్క్ మరియు ఎమ్మార్పీఎస్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ సమాజానికి సేవలు అందించడానికి గుర్తించిన జన సాహితీ అకాడమీ జై తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ సంస్థ వారు శుక్రవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య చేతుల మీదుగా మహానంది అవార్డు ఇవ్వడం జరిగింది. అనంతరం మురళి మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం ద్వారా మరింత బాధ్యత పెరిగిందని ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇందుకు సహకరించిన తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ సంస్థ చైర్మన్ డాక్టర్ పాముల రమణ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రావడం పట్ల మండలంలోని సర్పంచులు రాజకీయ నాయకులు ఇతర సంఘాల నాయకులు మురళికి అభినందనలు తెలిపారు.

# వైద్య సేవలతో ప్రజల్లో విశ్వాసం పెంచాలి...

**- చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 17 ( విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోచమ్మకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు రెవెన్యూ కాలనీ, పోచమ్మకుంట అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య, అందిస్తున్న వైద్య సేవలు, రోగుల నమోదు ప్రక్రియ, ప్రాథమిక పరీక్షలు, కంప్యూటరైజ్డ్ రికార్డులను వైద్యాధికారి డా. ఎస్. దీప్తిని అడిగి తెలుసుకున్నారు. రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తుల వివరాలు, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందుల పంపిణీ, నెలవారీ పర్యవేక్షణ, వాటి డిజిటల్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. టీబీ రోగులకు నిరంతర వైద్య సేవలు అందించి, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న మందుల నిల్వలను పరిశీలించి, అవసరమైన అన్ని ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీలోని టీబీ బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ అనంతరం రెవెన్యూ కాలనీ, పోచమ్మకుంట అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పోషకాహారం అందించాలని, కేంద్రాల్లో పరిశుభ్రత, హాజరు, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. మదన్ మోహన్ రావు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధన్వాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

**- స్టేషన్ పనితీరుపై సమగ్ర సమీక్ష**

**- ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలందించడమే లక్ష్యం**

**- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**




నారాయణపేట , జూలై 17 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా లోని ధన్వాడ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆకస్మికంగా సందర్శించి స్టేషన్‌లోని అన్ని విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కోర్టు ట్రయల్‌లో ఉన్న కేసులు, పిటిషన్లు, వారెంట్ల అమలు, గ్రేవ్ మరియు నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని ఒక్కొక్కటిగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును నిర్దిష్ట గడువులో పూర్తి చేసి, శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించారు. కేసుల్లో అవసరమైన సాక్ష్యాధారాలను సమగ్రంగా సేకరించి, పటిష్టమైన ఛార్జిషీట్లు దాఖలు చేయడం ద్వారా నేరస్థులకు చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో బీట్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్లను సమర్థవంతంగా కేటాయించి గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. గ్రామస్థులతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా పోలీసులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. అలాగే పాత నేరస్తులు, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నేరాల నియంత్రణలో ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా, మర్యాదపూర్వకంగా స్వాగతించి వారి సమస్యలను ఓర్పుతో వినాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ స్టేషన్‌పై సానుకూల అభిప్రాయం ఏర్పడేలా సిబ్బంది వ్యవహరించాలని చెప్పారు. స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ, విధుల నిర్వహణ, కార్యాలయ నిర్వహణ వంటి అంశాలను కూడా ఎస్పీ పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ప్రజలకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా మరికల్ సీఐ భగవంత్ రెడ్డి, ఇంచార్జి ఎస్సై మహేశ్వరి మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులు మూసేయాలని మహిళల ఆందోళన

**- కోమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ మరియు ఎస్.పి వినతి పత్రం అందజేసిన మహిళలు.**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 17 (విజన్ ఆంధ్ర) : కోమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని చిచ్పల్లి, సోనాపూర్, గణేశపూర్, పోనగూడ మొత్తంగా ఏడు గ్రామాల మహిళలు తమ గ్రామంలోని మద్యం(బెల్ట్) దుకాణాలను మూసేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఊరిలోనే మద్యం దుకాణాలు ఉండటం వలన తమవారు మద్యానికి బానిసయ్యి కుటుంబాన్ని పట్టించుకోకుండా ఆరోగ్యాన్ని సైతం పాడు చేసుకుంటున్నారని. అలాగే పిల్లల చదువు, కుటుంబాన్ని నడపటం కూడా భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వాంకిడి ఎస్.ఐ కి వినతి పత్రం అందజేసినా స్పందించలేదని, అందుకే ఏడు గ్రామాల మహిళలందరూ కలిసి కలెక్టర్ కు వినతి పత్రం అందించి తమ గ్రామంలోకి 10 బెల్ట్ షాపులను మూయించేవిధంగా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా ఆల్ ఇండియా డెమొక్రటిక్ విమెన్స్ అసోసియేషన్ (ఐద్వా) జిల్లా ఉపాధ్యక్షురాలు నంది పద్మ, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, , ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మద్దతు పలికారు ఆ గ్రామ మహిళలు విమల బాయి, సుప్రియ, గీత, అంజలి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ కు సమన్వయంతో చర్యలు చేపట్టాలి - జిల్లా కలెక్టర్ ప్రియాంక

***అవగాహన కార్యక్రమా లపై ప్రత్యేక దృష్టి సారించాలి - జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్***



నారాయణపేట , జూలై 17 ( విజన్ ఆంధ్ర) : జిల్లాలో రోడ్డుప్రమాదాలను తగ్గించడం, ప్రజలకు సురక్షి త ప్రయాణం కల్పించడం లక్ష్యంగా జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధ్యక్ష తన, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సమక్షంలో జిల్లా కలెక్టరేట్ లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్ట ర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై అవసరమైన హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాల ని సూచించారు. పాఠశాల ల పరిసరాలను స్కూల్ సేఫ్టీ జోన్‌లుగా అభివృద్ధి చేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి పాదచారులకు సౌకర్యవం తమైన మార్గం కల్పించా లని, ప్రధాన రహదారులపై పార్కింగ్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచిం చారు. ప్రతి శాఖ తమ పరిధిలోని రోడ్డు భద్రతా పనులపై నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదాల సమయంలో అత్యవసర వైద్య సేవలు వేగంగా అందించేందుకు 108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేయాలని, జాతీయ రహదారులపై అవసరమైన చోట అదనపు అంబులె న్సులు, అత్యవసర స్పంద న కేంద్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సమావేశంలోనిర్ణయించారు. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసే గుడ్ సమారిటన్ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహిం చాలని, ప్రమాద బాధితు లకు సహాయం చేసే వ్యక్తులనుప్రోత్సహించాలని అధికారులకు సూచించా రు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపా రు. ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్, మైనర్లు వాహనాలు నడపడం, ఫిట్‌నెస్ లేని వాణిజ్య వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిం చాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్ర తపై గ్రామాలు, పాఠశాల లు, కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించా లని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సూచించారు. సమావేశంలో వివిధ శాఖల కు చెందిన అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన చర్యలను వివరిం చి, భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. ఈ సమావే శంలో రవాణా శాఖ, పోలీసు శాఖ, రోడ్లు, భవనాల శాఖ, జాతీయ రహదారుల అధికారులు, ఆర్టీసీ, 108 అంబులెన్స్ సేవలు, విద్యాశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల బాధితులకు వేగంగా న్యాయం...

**ఎం.ఆర్.ఎం. పోర్టల్‌తో గట్టు బాధితుడికి రూ.40 వేల నగదు రిఫండ్**

**జిల్లా సైబర్ టీమ్ ను అభినందించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



గద్వాల జూలై 17 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో సైబర్ నేరాల బాధితులకు సత్వర న్యాయం అందించే దిశగా జిల్లా పోలీసులు మరో ముందడుగు వేశారు. ఇటీవల గట్టు మండలానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ మోసంలో రూ.1 లక్ష కోల్పోయినట్లు ఫిర్యాదు చేయగా, కొత్తగా అందుబాటులోకి వచ్చిన మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఅర్ఎం) ద్వారా, ఎలాంటి ఎఫ్ఐఆర్ అవసరం లేకుండానే తొలి విడతగా రూ.40,000 బాధితుడి బ్యాంకు ఖాతాలో విజయవంతంగా జమ చేయించారు. జిల్లాలో ఈ విధానంలో నగదు పునరుద్ధరణ జరగడం ఇదే తొలిసారి. ఈ విజయవంతమైన ప్రక్రియలో కీలకపాత్ర పోషించిన జిల్లా డి4సి సిబ్బంది (జిల్లా సైబర్ టీమ్) రమేష్ ఆచారి, రియాజ్, గట్టు సైబర్ వారియర్ భీమేష్లను జిల్లా ఎస్పీ అభినందించారు. సైబర్ మోసంలో కోల్పోయిన నగదులో తొలి విడతగా రూ.40 వేల మొత్తాన్ని తిరిగి పొందిన బాధితుడు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి జిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సైబర్ మోసాలకు గురైన బాధితులకు సత్వర సేవలు అందిస్తున్న జిల్లా పోలీసుల పనితీరును బాధితుడు అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరాల స్వరూపం రోజురోజుకూ మారుతున్న నేపథ్యంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ లక్ష్యంతోనే సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మాడ్యూల్ (జిఆర్ఎం), మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఅర్ఎం) వినియోగంపై జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ అందించామని తెలిపారు. ఆ శిక్షణ ఫలితంగానే బాధితులకు వేగంగా సేవలు అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాల దర్యాప్తు సమయంలో ప్రత్యక్ష ప్రమేయం లేకపోయినా బ్యాంకు ఖాతాలు లేదా నగదు ఫ్రీజ్ అయిన పౌరులు జి.ఆర్.ఎం. ద్వారా తమ వినతులను సంబంధిత బ్యాంకులకు సమర్పించవచ్చని తెలిపారు. నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారి ఖాతాలను డీ-ఫ్రీజ్ చేసి, నిలిపివేసిన నగదును విడుదల చేసే చర్యలు చేపడతారని వివరించారు. అలాగే, సైబర్ మోసాలకు గురైన బాధితులు కోల్పోయిన నగదును త్వరితగతిన పునరుద్ధరించేందుకు ఎం.ఆర్.ఎం. ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా రూ.50 వేల లోపు ఫ్రీజ్ అయిన మొత్తాన్ని, నిబంధనల మేరకు పరిశీలించిన అనంతరం కోర్టు ఉత్తర్వులు అవసరం లేకుండానే బాధితులకు తిరిగి అందించే అవకాశం ఈ విధానంలో ఉందని తెలిపారు.

# మద్యం మత్తులో ఆటో నడిపిన డ్రైవర్‌కు 3 రోజుల జైలు శిక్ష

**- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై రాజీ లేదు ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక**



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి జూలై 17(విజన్ ఆంధ్ర) : ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి మరియు సిబ్బంది నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి ఆటో నడుపుతున్న ఓ డ్రైవర్‌ను పోలీసులు గుర్తించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని శుక్రవారం సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆర్.శశిధర్ న్యాయస్థానంలో హాజరుపరచగా, విచారణ అనంతరం న్యాయస్థానం అతనికి 3 రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర రహదారి వినియోగదారుల ప్రాణాలకు కూడా తీవ్రమైన ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా ప్రయాణికులను తరలించే ఆటోలు, క్యాబ్‌లు, బస్సులు వంటి ప్యాసింజర్ వాహనాలను మద్యం మత్తులో నడపడం అత్యంత నిర్లక్ష్యపూరితమైన, తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# మేడికొండ, పులికల్ గ్రామాల్లో పర్యటించిన మండల వ్యవసాయ అధికారి కే జనార్ధన్



అయిజ జులై 17 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం మేడికొండ, పులికల్ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కే జనార్ధన్, వ్యవసాయ విస్తరణ అధికారులు యువ రాజ్, కుమారి అస్వినీ కలసి ప్రస్తుతం వాన కాలంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించడం జరిగింది. ముఖ్యంగా ఈ వానాకాలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎల్ నేనో ప్రభావం ఉండడం వలన తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ సూచించిన ప్రకారం ఆరుతరి పంటలు కూరగాయలు, పప్పుదినుసులను సాగు చేసుకోవాలని రైతులకు తెలియజేయడం జరిగింది. అలాగే బైనపల్లి గ్రామంలో రైతులను సమావేశపరిచి ఈ వానాకాలంలో ఆర్డీఎస్ కాల్వ కింద సాగు చేసే రైతులు వరికి ప్రత్యామ్నాయంగా వెదజల్లే పద్ధతి ద్వారా డ్రై ప్యాడి విధానం లో సాగు చేయాలని, ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలని పప్పు దినుసులైనటువంటి పెసర మినుము అలసంద, వేరుశనగ పంటల వైపు మొగ్గు చూపాలని రైతులను సమాయత్తపరచడమైనది. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొనని రైతులను కూడా వీలైనంత త్వరగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర గాని లేదా సమీపంలోని మీసేవ కేంద్రంలో గాని ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోమని తెలిపారు. ముఖ్యంగా ఈ నెల 28వ తారీకు నుంచి భారత ప్రభుత్వం చే కొత్తగా రూపొందించబడిన ఎరువుల క్రయవిక్రయాలకు సంబంధించిన ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారానే రైతులు కొనుగోలు చేయాల్సినది ఉంటుంది. కాబట్టి ఈ ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ లో యూరియాతో పాటుగా డీఏపీ, సింగల్ సూపర్ ఫాస్ఫేట్, పొటాష్, ఇతర కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేయాల్సినది ఉంటుందని అన్నారు. అందులో ముఖ్యంగా ఈ యాప్ ద్వారా కొనుగోలు చేయాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి. కాబట్టి రైతులకు ఈ విషయాన్ని కూడా తెలియజేయడం జరిగింది.

# ఆగస్టు 31లోగా సీసీఐ పునరుద్ధరణపై స్పష్టత లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష

**- మాజీమంత్రి జోగు రామన్న**




ఆదిలాబాద్, జూలై 17 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 31 లోపు స్పష్టమైన ప్రకటన చేయకపోతే తాను ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న హెచ్చరించారు. సీసీఐ పునఃప్రారంభం కోసం అవసరమైతే తన ప్రాణాలను సైతం లెక్కచేయబోనని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీసీఐ అంశంపై స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పక్క రాష్ట్రంలోని స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం అన్ని అనుమతులు ఇస్తుండగా, ఆదిలాబాద్ ప్రజలు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించినప్పటికీ ఇక్కడి సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించకుండా విక్రయించే ప్రయత్నాలు చేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత 2017 ఎన్నికల సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదిలాబాద్ ప్రజలకు సీసీఐ పునరుద్ధరణపై ఇచ్చిన హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదని జోగు రామన్న విమర్శించారు. సీసీఐ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడమే కాకుండా, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా దీనిపై కనీస చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు. గతంలో సీసీఐలో చట్టవిరుద్ధంగా స్క్రాప్ టెండర్లు పిలిచారని, అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటిని అడ్డుకునేందుకు తాము కోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు కేవలం కమిషన్లు వచ్చే పనులపైనే దృష్టి ఉందని, ప్రతి సంవత్సరం ఐదువేల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. పరిశ్రమ పునఃప్రారంభం కోసం సీసీఐ సాధన సమితి నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుంటే, స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు మాత్రం ప్రజల ముందుకు రావడం లేదని జోగు రామన్న మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ నాయకులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, హంసరాజ్ గంగారాం, అనంత్ గీతే తదితరులు గతంలో సీసీఐ పునరుద్ధరణపై హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకపోవడం ఆదిలాబాద్ ప్రజలను, యువతను వంచించడమేనని అన్నారు. గత కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్ నిధులతో సీసీఐ పరిశ్రమను పునఃప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం కోరినా ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఆదిలాబాద్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సమయంలో భూముల అంశాలపై చూపుతున్న ఆసక్తిని, సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణపై కూడా చూపాలని స్థానిక ఎమ్మెల్యేకు జోగు రామన్న సూచించారు. ఆగస్టు నెలాఖరులోగా సీసీఐ పునరుద్ధరణపై కేంద్రం నుండి స్పష్టత రాకపోతే, సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షతో పాటు ఉధృత నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు విజ్జగిరి నారాయణ, సాజితోద్దీన్, రాజన్న, బట్టు సతీష్, దాసరి రమేష్, పరమేశ్వర్, సురేందర్, ఆసిఫ్, అశోక్, అనిల్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడల్లో జిల్లాకు 6 పథకాలు

**- విజేతలను సన్మానించిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**



కామారెడ్డి బ్యూరో జులై 17 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలను జూలై 7 నుండి 9 వరకు హైదరాబాద్ మల్కాజ్గిరి కమిషనరేట్ లో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2026లో కామారెడ్డి జిల్లా పోలీసు క్రీడాకారులు సత్తా చాటి, 1.స్వర్ణ పథకం, 2. రజత పథకాలు,3.కాస్య పథకాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు ప్రత్యేక స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ పోలీసులు సమర్థవంతంగా విధులను నిర్వహించడంతోపాటు క్రీడల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడం గర్వంగా ఉందని కొనియాడారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసికస్థైర్యాన్ని,క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా పనిచేయడానికి వి దోహదపడతాయని అభిప్రాయపడ్డాడు. క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ పోలీసు శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించాడు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు,పథక విజేతలు, పోలీసు క్రీడాకారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పదివేల మంది మహిళకు ఉచితంగా కుట్టు శిక్షణ

**- టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**

సూర్యాపేట జూలై 17:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామంలో మదర్ ఇండియా సేవా సంస్థ ఆధ్వర్యంలో 150 మంది మహిళలకు కుట్టు శిక్షణ పూర్తి చేసిన సందర్భంగా వారికి సర్టిఫికెట్ల కోసం తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి తన సొంత ఖర్చులతో 90 వేల రూపాయల చెక్కును మదర్ ఇండియా నిర్వాహకులు బొజ్జ సంధ్యారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి నివాసం జరిగిన కార్యక్రమంలో 108 మంది మహిళలకు కుట్టు శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల నుండి స్ప్రెడ్ ఇండియా ద్వారా సూర్యాపేట నియోజకవర్గం లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సూర్యాపేట నియోజకవర్గంలోని అనేక గ్రామాలలో వాటర్ ప్లాంట్ ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు, టాయిలెట్స్ నిర్మాణం, బెంచీలు కంప్యూటర్ ల్యాబ్ లు,సైన్స్ ల్యాబ్ ల నిర్మాణం కోసం తమవంతు సహాయం చేస్తున్నామని



చెప్పారు. సూర్యాపేట మున్సిపాలిటీ లోని వార్డులలో కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి పదివేల మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణను అందించి, స్వయం ఉపాదిని అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, కౌన్సిలర్ లు జ్యోతి కరుణాకర్, నామ అరుణ, బైరబోయిన శ్రీనివాస్, పిల్లల రమేష్ నాయుడు, పాలగాని కృష్ణ,కోడి శిరీష శివ,నాయకులు వల్దాసు దేవేందర్, ధర్మా నాయక్, తండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ పొడిగింపును సద్వినియోగం చేసుకోవాలి

**- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్**



హన్మకొండ బ్యూరోచీఫ్ జులై 17(విజన్ఆంధ్ర ) : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 58, 59, 60 డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలతో సమీక్షా సమావేశాన్ని శ్రీనగర్ కాలనీ పాపులర్ గార్డెన్స్ నందు శుక్రవారం రోజున నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... తెలంగాణ ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఆగస్టు 3వ తేదీ వరకు పొడగించిందని, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఎల్ఏలకు సూచించారు. సర్ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియమించిన బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేస్తున్నారని అన్నారు. పలువురు ఓటర్లు ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేయడంలో ఇబ్బందులు పడుతున్నారని వారికి సాయంగా గులాబీ శ్రేణులు పని చేయాలని కోరారు. ఓటర్ ఎన్యూమరేషన్ ఫామ్స్ తీసుకున్న ఓటర్లు సంబంధిత బీఎల్వోలకు వివరాలు పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫామ్స్ తిరిగి ఇచ్చేలా బాధ్యత తీసుకోవాలని అన్నారు. రెండు చోట్ల ఓట్లు ఉన్నవారి, చనిపోయిన వారి ఓట్ల సమాచారాన్ని బీఎల్వోలకు అందించాలని సూచించారు. తప్పులు, అవకతకలు లేని ఓటర్ లిస్ట్ తయారీలో కీలకంగా మారే సర్ ప్రక్రియలో బాధ్యతాయుతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, డివిజన్ల వారీగా ఇప్పటికే పార్టీ తరపున హెల్ప్ లైన్ సెంటర్లను ఏర్పాటు చేసిన నాయకులను అభినందించారు. పార్టీ కార్యాలయం కేంద్రంగా సర్ హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు, సమాచారం అవసరం ఉన్నా సమన్వయం చేసుకొని పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో 58, 59, 60 డివిజన్ల ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# రాళ్లచిట్టంపల్లిలో తుదిదశకు చేరుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

**- మొత్తం ఎస్ఐఆర్ ఓటర్లు 1199, ఆన్లైన్లో అప్లోడ్ పూర్తైనవి 858**

**- డబుల్ ఓటర్లు 17, మైగ్రేషన్ ఓటర్లు 16, వివాహితులైన ఓటర్లు సుమారు 40**

**- బిఎల్ఓ తివారి లక్ష్మి**

**- గ్రామ సర్పంచ్ ముహమ్మద్ ఎంజాయ్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై ( విజన్ ఆంధ్ర ) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నదని గ్రామ సర్పంచ్ ముహమ్మద్ ఎజాజ్ అన్నారు. గ్రామంలో మొత్తం 1199 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలు బిఎల్ఓ ఇంటింటికి తిరిగి వంద శాతం అందజేశారని సర్పంచ్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలో గల రాళ్ళచిట్టంపల్లి గ్రామంలో విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారంలో ఎడమవైపు ఓటరు వివరాలు పూరించాలని గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఎజాజ్, బిఎల్ఓ తలారి లక్ష్మి సూచించారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారంలో ఎడమవైపు ఓటరు యొక్క తల్లి తండ్రి నాయనమ్మ అమ్మమ్మ తాతయ్యల ఎవరిదో ఒకరి పేరు రాసి వారి వివరాలు పూరించాలని వారు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాన్ని పూరించే ముందు ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే బిఎల్ఓ ను కలిసి నివృత్తి చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఇప్పటి వరకు 858 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయనైనదని సర్పంచ్ తెలిపారు. ఎస్ఐఆర్ తుది గడువు ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించాలని వారు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను 2026 ఆగస్టు 3 సోమవారం వరకు బిఎల్ఓకు అందజేయాలని సర్పంచ్ సూచించారు.


## పిడుగుపాటు ఘటనల్లో మృతి చెందిన 8 కుటుంబాలకు రూ.6 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా సాయం విడుదల

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



గద్వాల జూలై 17 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలో పిడుగుపాటు ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో రూ. 6 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పిడుగుపాటు ఘటనల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా సహాయాన్ని సంబంధిత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఈనెల 13వ తేదీన ఎలక్ట్రానిక్ క్లియరెన్స్ సిస్టమ్ ద్వారా వారి ఖాతాలకు నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, బాధితులకు తక్షణ ఆర్థిక ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిబంధనల మేరకు ఎక్స్‌గ్రేషియా సాయాన్ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మల్దకల్ మండలం గార్లపాడు గ్రామానికి చెందిన బి. నవీన్ కుమార్, రాజోలి మండలం రాజోలి గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్, మల్దకల్ మండలం పవనపల్లి (హెచ్), పాల్వాయికి చెందిన కె. రాఘవేంద్ర, గద్వాల మండలం బాస్లచెరువు గ్రామానికి చెందిన గొల్ల శశిధర్, అలంపూర్ మండలం క్యాతూర్ గ్రామానికి చెందిన వేముల రాజు, ఇటిక్యాల మండలం పెద్దదిన్నె గ్రామానికి చెందిన పెద్ద నర్సింహులు, మల్దకల్ మండలానికి చెందిన కుమారి వడ్డె ఆదిలక్ష్మి, గద్వాల మండలం గుంటిపల్లి గ్రామానికి చెందిన బి. రాజుకు రూ.6.00 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు సత్వర ఆర్థిక సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కలెక్టర్ తెలియజేశారు.

## నేరాల నియంత్రణకు ఫింగర్ ప్రింట్ డివైస్ తో తనిఖీలు



నారాయణపేట , జూలై 17 ( విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను మరియు పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు నరసింహ, సుధాకర్ లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం నారాయణపేట బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలలో, బ్యాంకు ల వద్ద నారాయణపేట పోలీసులు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఎస్ ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి..

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర), జులై 17: జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి లో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పనుల అమలులో నిర్లక్ష్యం, ఆలస్యం లేదా నాణ్యత లోపాలు ఉంటే సంబంధిత అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈలు), సంబంధిత శాఖ అధికారులతో మండలాల వారీగా పనుల పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి పనికి సంబంధించిన ప్రస్తుత స్థితి, పూర్తి శాతం, ఎదురవుతున్న సమస్యలు, జాప్యానికి గల కారణాలను కలెక్టర్ క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., గ్రామపంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని, ,ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభమైన భవనాలను వెంటనే పూర్తి చేసి గ్రామపంచాయతీలకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, మహిళా సంఘాల కోసం నిర్మిస్తున్న మహిళా భవనాలు, ఆహార ధాన్యాల నిల్వ గోదాములు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో సీసీ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణంలో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి గల కారణాలను వెంటనే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకొని పనులను పూర్తి చేయాలని, సాంకేతిక, పరిపాలనా లేదా ఇతర సమస్యలు ఏవైనా ఉంటే వాటిని వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి అసిస్టెంట్ ఇంజనీర్ తమ పరిధిలోని పనులను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనుల నాణ్యతను కాపాడుతూ వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజల డబ్బుతో చేపడుతున్న అభివృద్ధి పనులు కావడంతో ప్రతి రూపాయి సద్వినియోగం అయ్యేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. పనులు ప్రారంభించిన తర్వాత వాటిని మధ్యలో వదిలేయకుండా పూర్తి బాధ్యతతో పూర్తి చేయాలని సూచించారు. తదుపరి నిర్వహించే సమీక్ష సమావేశంలో ఐదు మండలాల పనులను పూర్తిస్థాయిలో సమీక్షిస్తామని, అప్పటికి పనుల్లో గణనీయమైన పురోగతి లేకపోతే సంబంధిత అధికారులు, ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్ష సమావేశాలు కేవలం నివేదికలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పురోగతిని ఆధారంగా చేసుకొని చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అన్ని మండలాల అధికారులు తమ పరిధిలోని ప్రతి పనికి సంబంధించిన సమగ్ర పురోగతి నివేదికలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని, ఏ పనులు పూర్తయ్యాయి, ఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయి, జాప్యానికి కారణాలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు వంటి పూర్తి వివరాలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. ఆ నివేదికల ఆధారంగానే తదుపరి కార్యాచరణ, అధికారుల పనితీరుపై నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని ముందుగా పనులను పూర్తి చేయడంపైనే అధికారులు దృష్టి సారించాలని, అదనపు నిధుల అవసరం ఉంటే పనుల పురోగతిని బట్టి పరిశీలిస్తామని, అయితే బడ్జెట్ పేరుతో పనులు నిలిపివేయడం సమంజసం కాదన్నారు. ప్రజలకు మౌలిక వసతులు సకాలంలో అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా అభివృద్ధిలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తైతే ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలోఈఈ పంచాయతీ రాజ్ విజయ్ కుమార్, , జిల్లా స్థాయి ఇంజనీరింగ్ అధికారులు, డివిజనల్ అధికారులు, మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈలు) తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి మిషన్ భగీరథ 60 ఎంఎల్‌డీ త్రాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

**- తాగునీటి కొరకు తగు చర్యలు తీసుకోవాలి.**

**- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) జులై 17 : కల్వకుర్తి, అచ్చంపేట, జడ్చర్లతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలకు చెందిన మొత్తం 460 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న మిషన్భగీరథకేంద్రంప్రజలకు నాణ్యమైన త్రాగునీటిని నిరంతరాయంగా అందించడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య కార్యక్రమమని, మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారంకల్వకుర్తిపట్టణంలోని మిషన్ భగీరథ 60 ఎంఎల్‌డీ (మీణ) వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (బ్రో) త్రాగునీటి శుద్ధి కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ప్లాంట్‌లోని ప్రతి విభాగాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముడి నీటిని స్వీకరించే దశ నుంచి శుద్ధి పూర్తై గ్రామాలకు పంపిణీ చేసే వరకు జరిగే ప్రతి ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కోగ్యులేషన్, ఫ్లోక్యులేషన్, సెడిమెంటేషన్, ఫిల్టరేషన్, క్లోరినేషన్ వంటి శుద్ధి ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులతో చర్చించారు. ఫిల్టర్ హౌస్‌లో ఉపయోగిస్తున్న యంత్రాల పనితీరు, పంపుల సామర్థ్యం, విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు తీసుకునే ప్రత్యామ్నాయ చర్యలు, శుద్ధి కోసం వినియోగిస్తున్న రసాయనాల మోతాదు, నీటి నాణ్యత పరీక్షల విధానం తదితర అంశాలపై సవివరంగా ఆరా తీశారు. ప్రతిరోజూ ప్లాంట్‌కు ఎంత మేర ముడి నీరు వస్తుంది, ఎంత మేర శుద్ధి చేసి పంపిణీ చేస్తున్నారు, ఎన్ని గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది, సరఫరాలో ఎక్కడైనా సమస్యలు ఎదురవుతున్నాయా, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న నీరు ప్రభుత్వ త్రాగునీటి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిరంతరం నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామానికి ప్రతిరోజూ నాణ్యమైన త్రాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేసే త్రాగునీటిలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా పంపింగ్ వ్యవస్థ, శుద్ధి కేంద్రం, నిల్వ రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. చిన్నచిన్న సాంకేతిక లోపాలు కూడా పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున యంత్రాలను ఎప్పటికప్పుడు నిర్వహణలో ఉంచాలని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నాగర్ కర్నూలు జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలమట్టాలు క్రమంగా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో గ్రామీణ ప్రజలు ప్రధానంగా మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీటిపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. అందువల్ల రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నీటి నిర్వహణపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నీటి వృథాను పూర్తిగా నివారించాలని, పైప్‌లైన్లలో లీకేజీలు ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, మోటార్లు, పంపులు, ఫిల్టర్ యూనిట్లు ఎప్పటికప్పుడు సక్రమంగా పనిచేసేలా నిర్వహణ చేపట్టాలని సూచించారు. అవసరమైన రసాయనాల నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, శుద్ధి ప్రక్రియలో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో నిర్లక్ష్యానికి తావులేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్ సింగ్ ప్లాంట్ పనితీరుపై కలెక్టర్‌కు సమగ్ర వివరాలు అందించారు. కల్వకుర్తి త్రాగునీటి శుద్ధి కేంద్రం నుంచి కల్వకుర్తి, అచ్చంపేట, జడ్చర్లతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలకు చెందిన మొత్తం 460 గ్రామాలకు ప్రతిరోజూ సుమారు 52 లక్షల లీటర్ల శుద్ధి చేసిన త్రాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నీటి శుద్ధి కోసం వినియోగిస్తున్న రసాయనాలు, ప్రయోగశాలలో నిర్వహిస్తున్న నాణ్యత పరీక్షలు, ఫిల్టర్ హౌస్ నిర్వహణ, పంపింగ్ వ్యవస్థ, పంపిణీ నెట్‌వర్క్ తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రయోగశాలను సందర్శించి నీటి నాణ్యత పరీక్షల విధానాన్ని పరిశీలించారు. నీటిలో క్లోరిన్ శాతం, టర్బిడిటీ, పీహెచ్ విలువలు తదితర ప్రమాణాలను క్రమం తప్పకుండా పరీక్షించాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన త్రాగునీరు అందించేందుకు అన్ని జాగ్రత్తలు కృషి కృషి తీసుకోవాలని అధికారులకు సూచించారు. శుద్ధి కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలను కూడా కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా క్షేత్రస్థాయి లో అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని, ఏ గ్రామంలోనైనా నీటి సరఫరా నిలిచిపోయినా లేదా నాణ్యతపై అనుమానాలు వ్యక్తమైనా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మిషన్ భగీరథ పథకం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అత్యంత కీలకమైన కార్యక్రమమని, అందుకు అనుగుణంగా అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, డీఈఈ మహిపాల్, మున్సిపల్ కమిషనర్ అహ్మద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## పసి మెదడులపై జిహాదీ దాడులు సహించం

**- ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి**



నారాయణపేట , జూలై 17 (విజన్ ఆంధ్ర) : హిందూ చిన్నారులకు ఇస్లాం మతపరమైన హోంవర్క్ ఇవ్వడం తీవ్ర నేరమని విశ్వహిందూ పరిషత్ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్మ చదవ దం,ఖురాన్ పఠించడం కోసం ప్రత్యేకంగా హోంవర్క్ ఇచ్చే విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్న జిహాదీ మత చాందసవాదుల పై కఠిన చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. బాల్యంలోనే పసి మెదడు కు విషం నింపే విష సంస్కృ తి నేడు విద్యాలయాలలో విజృంభించడం తీవ్ర ఆవే దన కలిగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల పిల్లలకు ఉర్దూ నేర్పించడం, హిజాబ్ ధరించడం, ఇస్లాం బోధించడం, రకరకాలుగా కొత్త కొత్త పద్ధతుల ద్వారా చిల్డ్రన్ జిహాద్ కు పాల్ప డుతున్న ఇస్లామిక్ టెర్రరిస్టు భావాల మనుషులకు చట్టపరమైన విధంగా శిక్షించాలని పేర్కొన్నారు. అభం శుభం తెలియని పసిపిల్లలను బాల్యంలోనే టార్గెట్ చేసి మతమార్పిడి ప్రక్రియను ప్రారంభించడం తీవ్రఆందోళనకరమన్నారు. ఇది భారత రాజ్యాంగానికే ప్రమాదం అని వివరించా రు. కులాలు, మతాలు, పేద ధనిక భేదాలు తెలి యకుండా తరగతి గదిలో విద్యను అభ్యసించే వ్యవస్థ ను సమాధి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతి గదిలో స్నేహపూ ర్వకంగా మసులుకునే వాతావరణాన్ని విచ్ఛిన్నం చేసే జిహాదీ శక్తులు మత మార్పిడికి కుట్రలు పాల్ప డుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందువుల పిల్లలను టార్గెట్ చేస్తూ మతం బోధించడం, మతా చారాలు బలవంతంగా రుద్దడం అనేది తీవ్రమైన ఘటన అన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పందిం చకపోవడం ఒక విద్యా మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఆయన నైతిక బాధ్యత వహించాలన్నారు. వెంబడే ఈ ఘటనలకు బాధ్యులు అయినటువంటి వారిని కఠినంగా శిక్షించాలని బాలస్వామి డిమాండ్ చేశారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

**- కళాశాల ప్రిన్సిపల్ జి. రామచంద్రయ్య**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 17 ( విజన్ ఆంధ్ర ) : శ్రీ అనంత పద్మనాభ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026-27 విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ జి. రామచంద్రయ్య, అధ్యయన కేంద్ర సమన్వయకర్త సి. శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ అనంత పద్మనాభ కళాశాలలో బి.ఎ,బి.కాం,బి.ఎస్సి మొదటి సంవత్సరం ప్రవేశాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి చివరి తేది 07-08-2026 అని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్ లేదా 10+2 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు మా ఫోన్ నెంబర్లు: 9182758406, 9440512625

# మూడ్ మల్ మెగాలిథిక్ మెన్హిర్ సైట్ అభివృద్ధికి చర్యలు

**- జిల్లా కలెక్టర్ తో దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ భేటీ.**



మాగనూర్, జూలై 17 (విజన్ ఆంధ్ర) : నారాయణ పేట జిల్లా కృష్ణా మండలంలోని మూడ్ మల్ బృహత్ శిలా ఫలకాల (మెగాలిథిక్ మెన్హిర్) ప్రదేశానికి సంబంధించిన సర్వే నంబర్ల పరిధిలో ఉన్న మొత్తం ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తహసీల్దార్‌ను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్, హెరిటేజ్ తెలంగాణ కార్యాలయ విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ నాగ లక్ష్మీ బృందం కలెక్టర్ ప్రియాంకతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణం అని, యూనెస్కో శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందనీ, నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ కు వివరించారు. ఇది వరకు ఇక్కడ ఉన్న కలెక్టర్లు నిలువు రాళ్ళ పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు చేపట్టారని తెలిపారు. నిలువు రాళ్ళ ప్రదేశం గుండా వెళ్తున్న విద్యుత్ గ్రిడ్ లైన్‌ను తరలించే అంశంపై వారు కలెక్టర్ తో చర్చించారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, విద్యుత్ శాఖ ఎస్ ఈ నవీన్, డీ ఈ ఓ గోవింద రాజులు, ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణ, సర్వే ల్యాండ్ ఏ డీ వేణు గోపాల్, పీ ఆర్ ఈ ఈ అశోక్, డీ పీ ఆర్ వో రషీద్, హెరిటేజ్ విభాగ ఏ ఈ నరేష్, మూడ్ మల్ సర్పంచి బాల్ రాజ్ పాల్గొన్నారు.

# భూ రీసర్వేకు సహకరించని సర్వేయర్ల సర్టిఫికెట్లు రద్దు

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 17 ( విజన్ ఆంధ్ర ) : భూ రీసర్వేకు ఆమోదం తెలపని శిక్షణ సర్వేయర్ల సర్టిఫికెట్ రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో భూ రీసర్వేపై శిక్షణ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు 150 మందికి సర్వే నిర్వాహణపై శిక్షణ ఇచ్చి లైసెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని ఇందులో కొంతమంది భూ రీసర్వేకు ఆమోదం తెలపకుండా ఉన్నారని అట్టి వారి సర్టిఫికెట్ల రద్దుకు ప్రభుత్వానికి సిఫారస్ చేస్తామన్నారు. సంవత్సరాల క్రితం చేపట్టిన భూ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని భూ రీసర్వేకు లైసెన్స్ సర్వేయర్ల పాత్ర చాలా ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. దీర్ఘకాలిక దృక్పథంతో చేపట్టే భూ రీసర్వేకు సర్వేలో పాల్గొనడం ఉత్తమ అవకాశంగా భావించాలని దీనివల్ల అపారమైన అనుభవాన్ని తమ జీవితాల్లో పొందుతారని కలెక్టర్ తెలిపారు. భూ రీసర్వే మూలంగా భూమి రికార్డులు పూర్తి శుద్ధి చేయబడతాయని దీనికి సంబంధిత శాఖల అధికారుల సహకారం తీసుకొని భూ రీ సర్వేలో పాల్గొనాలని శిక్షణ సర్వేయర్లకు సూచించారు. శిక్షణ సర్వేయర్లకు స్వంత మండలం కాకుండా అందుబాటులోని మండలాలకు నియమించాలని కలెక్టర్ తెలిపారు. శిక్షణ సర్వేయర్లకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టేలా అదేవిధంగా పారితోషాకాన్ని సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏడి సర్వేకు జిల్లా కలెక్టర్ సూచించారు.ముందుగా శిక్షణ సర్వేయర్లకు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కె.వెంకటాచారి భూ రీసర్వేపై పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. శిక్షణ పొందిన సర్వేయర్లకు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి నియామక పత్రాలను అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కృఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి మధుసూదన్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# 3 కోట్లతో బందంపల్లి మినీ ట్యాంక్ బండ్!!

- బందంపల్లిలో తీగల వంతెన నిర్మాణం
- పెద్దపల్లి సుందరీకరణకు మరో అడుగు
- నాణ్యతతో పనులు పూర్తి చేయాలి
- విప్ చింతకుంట విజయ రమణరావు



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 17 (విజన్ ఆంధ్ర): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బందంపల్లి చెరువు కట్టను రూ.3 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్, సంబంధిత అధికారులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, ప్రజలకు ఆహ్లాదకరమైన విహార ప్రదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. మినీ ట్యాంక్ బండ్‌కు మరింత ఆకర్షణ తీసుకురావడానికి చెరువుపై తీగల వంతెన (సస్పెన్షన్ బ్రిడ్జి) కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని గుత్తేదారులకు స్పష్టం చేశారు. చెరువు కట్ట అభివృద్ధికి అవసరమైతే అదనపు నిధులు కూడా తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చే ఈ మినీ ట్యాంక్ బండ్ పెద్దపల్లి పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణాన్ని దశలవారీగా సుందరంగా, ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నుగుల్లా మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్ పురేళ్ల శైలజా సుధాకర్, ఇరిగేషన్ శాఖ అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్...కమీషన్ ల సర్కారు


- ఫీజు రియంబర్స్మెంట్ ఇచ్చేవరకు పోరాటం...
- ఇందూరు రణభేరిలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...



నిజామాబాద్ జులై 17:( విజన్ ఆంధ్ర( రాష్ట్రంలో కమీషన్ ల సర్కారు కొనసాగుతుందని, ప్రతి పనిలో పర్సంటేజీలు తీసుకుంటున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకై బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ధర్నాచౌక్ లో ఇందూరు రణభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంలో ఫీజు రియంబర్స్మెంట్ పథకం ఎంతో కీలకమైందన్నారు. ఇలాంటి పథకానికి రేవంత్ రెడ్డి సర్కారు తూట్లు పొడుస్తూ రద్దు చేసే దిశగా కుట్రలు పన్నుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.12 వేల కోట్లు బకాయిలు ఉన్నా..స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ అవినీతి విధానాల వల్ల రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం గందరగోళంగా మారిందన్నారు. బడుగు బలహీన వర్గాలను శాశ్వతంగా అణచివేసే కుట్ర ఫీజు రియంబర్స్మెంట్ను నిర్వీర్యం చేసి నోటికాడి ముద్దను లాక్కోవడమేనన్నారు. రాష్ట్రంలో మూడు ట్రిలియన్ అభివృద్ధి పనుల పేర్లు చెప్పే రేవంత్ రెడ్డి విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఎందుకు చెల్లించలేకపోతున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల హక్కుల కోసం బిజెపి పోరాటం ఎన్నటికీ ఆగదని, మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే ఫీజు రియంబర్స్మెంట్ లో కూడా 40 శాతం కమిషన్లను కోరడమంటే ఇంతకన్నా పనికిమాలిన ప్రభుత్వం మరొకటి లేదన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు, విద్యార్థులకు అనేక హామీలిచ్చి తుంగలో తొక్కారని ఆరోపించారు. గత సంవత్సరం నవంబర్లో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బందుకు పిలుపునిస్తే కేవలం కంటితుడుపుగా 200 కోట్లు విడుదల చేసిందన్నారు. ఒక్క ఇందూరు జిల్లాలోనే సుమారు 300 కోట్ల నుంచి 400 కోట్లు బకాయిలు ఉందని గుర్తు చేశారు. ఇందూరు జిల్లా నుంచి మొదలైన రణభేరి రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందని హెచ్చరించారు.

# నీట్ - యూజీ 2026 ఫలితాలలో వైబ్రంట్ అకాడమి విజయదుంధిభి

హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 17 ( విజన్ ఆంధ్ర ) : నీట్ యూజీ –2026 ఫలితాలలో వైబ్రంట్ అకాడమి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని వైబ్రంట్ అకాడమి డైరెక్టర్ సిహెచ్ రాజేందర్రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా అకాడమి డైరెక్టర్ సిహెచ్ రాజేందర్రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థుల కోసం కోటా రాజస్థాన్ వారి వైబ్రంట్ అకాడమిని వరంగల్లో స్థాపించడం జరిగిందని తెలియజేస్తూ గురువారం రోజున విడుదల చేసిన నీట్ యూజీ 2026 ఫలితాలలో వైబ్రంట్ అకాడమి విద్యార్థులు అత్యధికంగా ర్యాంకులు సాధించారని, ఇలాంటి ర్యాంకులు మొదటి బ్యాచ్లోనే సాధించడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. వైబ్రంట్ అకాడమి మొదటి నుండి నీట్ మరియు జేఇఇ లలో అత్యుత్తమమైనటువంటి శిక్షణను వరంగల్ అందించడం జరుగుతుందని వారు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి అకాడిమిక్ ప్రోగ్రామింగ్ మరియు ప్రణాళికల ద్వారా అద్భుతమైన అణిముత్యాలుగా తయారుచేసి జాతీయ స్థాయిలోనే ఉన్నతమైన ర్యాంకులు సాధించడం జరిగిందని తెలిపారు. తదనంతరం జాతీయ స్థాయిలో ఉన్నతమైన ర్యాంకు ఏ ఐ ఆర్ –143 బి. వినాయక్ హాల్ టికెట్ నెంబర్ . 4205102271 మరియు 12 మంది అత్యుత్తమైన ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నిరంతర పర్యవేక్షణ, యోగా మరియు మోటివేషన్ తో మామూలు విద్యార్థులను కూడా మెరికలు తిరిగిన విద్యార్థులుగా తీర్చి దిద్దడం జరుగుతుందని, ప్రతి విద్యార్థిపైన వ్యక్తిగతమైన శ్రద్ధ తీసుకోవడం వలనే ఈ ఫలితాలు సాధించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైబ్రంట్ అకాడమి ప్రిన్సిపాల్ టి. శేషుకుమార్, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జి. రఘుపతి, కోఆర్డినేటర్ రామ్ గుమ్మడి, అధ్యాపక బృందం మరియు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



B . VINAYAK
ROLL NO. 4205102271

# బీసీలకు పెద్దపీట.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం

- తెలంగాణ రక్షణ సేన పార్టీ నిర్ణయానికి బీసీ నాయకుల హర్షం
- పెద్దపల్లి ఇన్‌చార్జిగా ఉద్యమకారుడు సలేంద్ర కొమురయ్యకు అవకాశం.. అరుదైన గౌరవంగా అభివర్ణన



పెద్దపల్లి, జూలై 17: (విజన్ ఆంధ్ర ) పెద్దపల్లి ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర రాజకీయ చరిత్రలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించే దిశగా తెలంగాణ రక్షణ సేన పార్టీ తీసుకున్న నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా బీసీ నాయకులు, ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీసీలకు మాటల్లో కాకుండా చేతల్లో ప్రాధాన్యం కల్పించాలనే లక్ష్యంతో పార్టీ నాయకత్వం ముందుకు సాగుతోందని పలువురు బీసీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రాంతంలో దశాబ్దాలుగా బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పించాలనే డిమాండ్ ఉన్నప్పటికీ, అనేక రాజకీయ పార్టీలు హామీలు ఇచ్చినా ఆచరణలో మాత్రం బీసీలకు తగిన స్థానం కల్పించలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. రాష్ట్రంలోని 12 మంది బీసీ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ పార్టీ నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీ వర్గాలు స్వాగతిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాకు చెందిన ఉద్యమకారుడు, పెద్దకాల్వల గ్రామానికి చెందిన సలేంద్ర కొమురయ్యను పెద్దపల్లి శాసనసభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం ఆయనకు దక్కిన అరుదైన గౌరవంగా పలువురు పేర్కొంటున్నారు.

**ఉద్యమ నేపథ్యం ఉన్న నాయకుడికి అవకాశం**

సలేంద్ర కొమురయ్య మొదటి నుంచీ ప్రజా సమస్యలపై, ఉద్యమాలపై స్పందిస్తూ ప్రజల మధ్య పనిచేస్తున్న వ్యక్తిగా స్థానికంగా గుర్తింపు పొందారని నాయకులు చెబుతున్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినప్పటికీ, తనకు తగిన రాజకీయ ప్రాధాన్యం, న్యాయం దక్కలేదనే భావనతో ఉన్న ఆయనకు తెలంగాణ రక్షణ సేన పార్టీ ద్వారా కొత్త రాజకీయ వేదిక లభించిందని అనుచరులు పేర్కొంటున్నారు.

తాను నమ్మిన సిద్ధాంతాల కోసం కష్టాలను ఎదుర్కొన్నానని, జైలు జీవితాన్ని కూడా అనుభవించానని, అయినప్పటికీ తన రాజకీయ గౌరవం, కృషికి తగిన గుర్తింపు లభించలేదని సలేంద్ర కొమురయ్య పేర్కొన్నట్లు సమాచారం. ప్రస్తుతం తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకత్వం తనలాంటి ఉద్యమకారులకు, బీసీ నాయకులకు రాజకీయంగా అవకాశాలు కల్పించడం సంతోషకరమని ఆయన తెలిపారు.

**బీసీలకు ఎమ్మెల్యే టికెట్లలోనూ ప్రాధాన్యం ఇవ్వాలి**

రానున్న రోజుల్లో బీసీలకు ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులోనూ ప్రాధాన్యం కల్పించాలని బీసీ నాయకులు కోరుతున్నారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

బీసీలకు మాటల్లో కాకుండా రాజకీయ అవకాశాల్లో, నాయకత్వ బాధ్యతల్లో, ఎన్నికల టికెట్లలో ప్రాధాన్యం కల్పించే పార్టీగా తెలంగాణ రక్షణ సేన ముందుకు సాగాలని బీసీ వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి. పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు బీసీలలో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయని నాయకులు చెబుతున్నారు.

**రాజకీయాల్లో కొత్త చర్చకు తెర**

తెలంగాణ రక్షణ సేన పార్టీ బీసీ నాయకత్వానికి మొదటి అడుగు వేసిన పార్టీగా నిలుస్తుందా? అనే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఇప్పటివరకు బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తామని అనేక పార్టీలు ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం పరిమిత అవకాశాలే లభించాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఈ నేపథ్యంలో బీసీలకు ప్రాధాన్యం కల్పిస్తూ తెలంగాణ రక్షణ సేన పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయని పలువురు మేధావులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీసీలకు రాజకీయ నాయకత్వంలో సముచిత స్థానం కల్పించే దిశగా పార్టీ ముందుకు సాగితే, రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉందని వారు విశ్లేషిస్తున్నారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కవిత నాయకత్వానికి రాష్ట్ర బీసీ నాయకత్వం, జిల్లా స్థాయి నాయకులు, ఉద్యమకారులు ధన్యవాదాలు తెలిపారు. బీసీలకు గౌరవం, ప్రాతినిధ్యం, రాజకీయ అవకాశాలు కల్పించే దిశగా పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని వారు పేర్కొన్నారు.

పెద్దపల్లి శాసనసభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సలేంద్ర కొమురయ్య నియామకంతో నియోజకవర్గంలోనూ రాజకీయ చర్చ ఊపందుకుంది. ఉద్యమ నేపథ్యం ఉన్న బీసీ నాయకుడికి బాధ్యతలు అప్పగించడం ద్వారా తెలంగాణ రక్షణ సేన పార్టీ కొత్త రాజకీయ ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు.

# కాకతీయ యూనివర్సిటీని రాజకీయ వేదికగా మార్చొద్దు..

- అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే నాయిని..
- విద్యార్థులను రెచ్చగొట్టి అభివృద్ధిని అడ్డుకోవడం దురదృష్టకరం
- బీఆర్ఎస్ ,బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘాలు రాజకీయ అజెండ వల్లే పాఠశాల తరలింపు..
- యూనివర్సిటీ భూముల విషయంలో ద్వంద్వ వైఖరి ఎందుకు?
- మామునూరు విమానాశ్రయంపై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు
- పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోంది..
- జాయింట్ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన పుల్ల శ్రీను,హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ పెద్దమల్ల శ్రీనివాస్ లకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే..

కాకతీయ యూనివర్సిటీ న్యూస్ జులై 17 ( విజన్ ఆంధ్ర ) : కాకతీయ యూనివర్సిటీని రాజకీయాలకు అడ్డాగా మార్చకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రెచ్చగొట్టి యూనివర్సిటీ అభివృద్ధిని అడ్డుకునే కుట్ర చేస్తున్నారని విమర్శించారు.శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలో పర్యటించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మీడియా తో మాట్లాడారు..కాకతీయ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై గతంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు కలిసి పలుమార్లు సమీక్షలు నిర్వహించి, సమగ్ర డీపీఆర్ రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వరంగల్ పర్యటన సందర్భంగా కూడా యూనివర్సిటీ సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించి, అభివృద్ధి కోసం నిధులు, ప్రణాళికలపై చర్చించినట్లు వెల్లడించారు. గత పదేళ్లలో కాకతీయ యూనివర్సిటీ ఏ పరిస్థితికి చేరిందో, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రారంభమైన మార్పులు ఏంటో విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు నిష్పక్షపాతంగా విశ్లేషించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ దొంగ దీక్షలు, తప్పుడు ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందినవారే ఇప్పుడు అభివృద్ధి పేరుతో మళ్లీ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.




ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై మాత్రమే ఎందుకు వ్యతిరేకత..??

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటును కొందరు కావాలనే వివాదాస్పదం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి వాస్తవాలు వివరించేందుకు ప్రయత్నించినా, రెండు మూడు విద్యార్థి సంఘాలు ఉద్దేశపూర్వకంగా అపోహలు సృష్టించాయని విమర్శించారు.యూనివర్సిటీలో సబ్‌స్టేషన్‌కు భూమి ఇచ్చినప్పుడు, బ్యాంకుకు స్థలం కేటాయించినప్పుడు, పోలీస్ స్టేషన్‌కు భూమి ఇచ్చినప్పుడు, ఇతర ప్రభుత్వ శాఖలకు స్థలాలు ఇచ్చినప్పుడు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయని విద్యార్థి సంఘాలుడ యూనివర్సిటీకే ఉపయోగపడే ఇంటిగ్రేటెడ్ స్కూల్ విషయంలో మాత్రమే ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి అని ప్రశ్నించారు.వివిధ విభాగాలకు స్థలాలు కేటించినప్పుడు ఈ విద్యార్థి సంఘాలు ఎందుకు ఒక్క మాట కూడా మాట్లాడలేదని నిలదీశారు. అప్పట్లో మౌనం పాటించిన వారు ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉద్యమాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) ఆమోదం పొందిన తర్వాత కూడా అభివృద్ధి పనులను ఎందుకు అడ్డుకున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. యూనివర్సిటీలో మెస్ అక్రమాలపై కమిటీ వేసినా ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. మెస్, క్యాంటీన్లలో తరచూ వివాదాలు జరుగుతున్నా స్పందించని వారు అభివృద్ధి పనుల విషయంలో మాత్రమే ఉద్యమాలు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలే ఉన్నాయని అన్నారు.యూనివర్సిటీకి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనులు వైస్ ఛాన్సలర్ నిర్లక్ష్యం వల్ల ఆలస్యమవుతున్నాయని విమర్శించారు. బోధన, బోధనేతర సిబ్బంది రెగ్యులరైజేషన్ వంటి కీలక అంశాలు కూడా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు.బీఆర్ఎస్‌కు ,బీజేపీ అనుబంధంగా పనిచేస్తున్న కొన్ని విద్యార్థి సంఘాలు విద్యార్థుల అసలు సమస్యలను పక్కనపెట్టి రాజకీయ అజెండాతో ముందుకు వెళ్తున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. అన్ని విద్యార్థి సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ, కొందరు కావాలనే సహకరించడం లేదన్నారు.కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధిని అడ్డుకునేందుకు ఫారెస్ట్ భూములు, జీడబ్ల్యూఎంసీ భూముల పేరుతో కొత్త కొత్త వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. మామునూరు విమానాశ్రయంపై బీఆర్ఎస్‌కు మాట్లాడే హక్కు లేదు..?? మామునూరు విమానాశ్రయం విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా ప్రజలను మోసం చేయడమేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మామునూరు విమానాశ్రయానికి అవసరమైన కేంద్ర అనుమతులు, సాంకేతిక క్లియరెన్స్‌లు, కార్యాచరణ ఏదీ పూర్తి చేయలేదని అన్నారు. రూ.350 కోట్లకు పైగా జీఎంఆర్‌కు చెల్లింపులు చేసినా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేకపోయారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి విమానాశ్రయ ఏర్పాటుకు స్పష్టమైన పురోగతి సాధించిందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా నిలిచిపోయిన ప్రాజెక్టుకు ఇప్పుడు కొత్త ఊపు వచ్చిందని చెప్పారు.పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క అడుగు కూడా ముందుకు వేయని వారుడ ఇప్పుడు విమానాశ్రయంపై తమకే క్రెడిట్ అన్నట్లు మాట్లాడటం రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం” అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.నేను తప్పు చేసి ఉంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకోండి. కానీ బ్రోకర్లు, మధ్యవర్తులు, రాజకీయ స్వార్థం కోసం యూనివర్సిటీని నాశనం చేసే ప్రయత్నం చేస్తే మాత్రం చూస్తూ ఊరుకోను. అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రజల తరపున నేనే పోరాటం చేస్తాను అని హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రత్యేక ప్రజాప్రతినిధుల కమిటీలు, పర్యవేక్షణ వ్యవస్థలు ఉన్నప్పుడు కాకతీయ యూనివర్సిటీకి కూడా అలాంటి వ్యవస్థ ఎందుకు ఉండకూడదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. యూనివర్సిటీలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులను వెంటనే బదిలీ చేసి సమర్థవంతమైన పాలనా వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీని రాజకీయ వేదికగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు స్పష్టం చేశారు.అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టించడం మానేసి, యూనివర్సిటీ ప్రగతికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవలే జాయింట్ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన పుల్ల శ్రీనివాస్ ని మరియు హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ పెద్దమల్ల శ్రీనివాస్ ను ప్రత్యేకంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# నూతన బస్టాండ్ భూకేటాయింపుపై రైల్వే జీఎం, డీఆర్ఎంతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య భేటీ


- కాజీపేట బస్టాండ్ భూకేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని వినతి..

హన్మకొండ బ్యూరోచిఫ్ జులై 17(విజన్ఆంధ్ర ) : కాజీపేటలో ప్రతిపాదిత నూతన బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన రైల్వే భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య దక్షిణ మధ్య రైల్వే అధికారులను కోరారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) డా. ఆర్. గోపాలకృష్ణన్‌లను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం భూ మార్పిడి అంశంపై వారితో ఎంపీ విస్తృతంగా చర్చించారు.కాజీపేట సిగ్నల్ జంక్షన్ పరిధిలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన రైల్వే భూమిని రాష్ట్ర ప్రభుత్వ భూమితో సమాన విలువ ప్రాతిపదికన మార్పిడి చేయాలని రైల్వే శాఖ 2025 జూన్ 4న ప్రతిపాదించినప్పటికీ, ఏడాదికిపైగా గడిచినా ప్రక్రియ ముందుకు సాగలేదని ఎంపీ డాక్టర్ కడియం కావ్య వివరించారు.భూ మార్పిడి కోసం వరంగల్‌హనుమకొండ ప్రాంతంలో అనువైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. భూ మార్పిడి ప్రక్రియను పూర్తి చేసేందుకు రైల్వే, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి, అవసరమైన చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.భూ మార్పిడి ప్రక్రియలో జాప్యం కారణంగా కొత్త బస్టాండ్ నిర్మాణం ఆలస్యమవుతోందని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకొని త్వరితగతిన సంయుక్త స్థల పరిశీలన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కొత్త కాజీపేట బస్టాండ్ నిర్మాణం పూర్తయితే వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రి–సిటీ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ పేర్కొన్నారు. రైల్వే స్టేషన్, జాతీయ రహదారులకు సమీపంలో ఆధునిక బస్టాండ్ ఏర్పాటుతో ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, బస్సుల రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు, ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, ప్రజా రవాణా అనుసంధానం మెరుగుదల వంటి ప్రయోజనాలు కలుగుతాయని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.



## వేగవంతంగా ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి..

- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి..
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..



కరీంనగర్,(విజన్యూ ఆంధ్ర బ్యూరో) జూలై 17: కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, చిగురుమామిడి మండల కేంద్రం, ముల్కనూరు గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఫోర్‌లైన్ రహదారికి సంబంధించిన భూసర్వే, అలైన్‌మెంట్ పనులను పరిశీలించారు. ఫేజ్–1 కింద కొత్తపల్లి నుంచి సుందరగిరి వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎక్కడైనా నివాస గృహాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందా, ప్రత్యామ్నాయంగా బైపాస్ మార్గాల ఏర్పాటు సాధ్యమా అనే అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే గ్రామసభలు నిర్వహించి స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులు చేపట్టాలని, భూసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనులు చేపడుతూనే ప్రజల ఇళ్లకు, జీవన విధానానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల, తిమ్మాపూర్, చిగురుమామిడి తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, ఆర్ అండ్ బి డీఈ కిరణ్, ఏఈ సురేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి అందాలకు నిలయం.. పర్యాటకుల కొత్త ఆకర్షణగా సబ్బితం ఫాల్స్

**-వర్షాకాలపు వన్నెలతో పరవళ్లు తొక్కుతున్న గౌరీగుండాలసబ్బితం జలపాతం**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై 17(విజన్ ఆంధ్ర) : వర్షాకాలం రాగానే ప్రకృతి తన సోయగాలను ఆవిష్కరించే అద్భుత ప్రదేశాల్లో పెద్దపల్లి జిల్లా సబ్బితం గ్రామ సమీపంలోని గౌరీగుండాలసబ్బితం జలపాతం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఎత్తైన రాతి కొండలపై నుంచి తెల్లని నురగలతో కిందకు దూకే జలధారలు, చుట్టూ విరిసిన పచ్చని అడవులు, చల్లని గాలులు, పక్షుల కిలకిలరావాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

పెద్దపల్లి జిల్లా కేంద్రానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతం వర్షాలు కురిసిన కొద్దీ మరింత ఉద్ధృతంగా ప్రవహిస్తూ ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తోంది. రాతి నిర్మాణాలు, సహజసిద్ధమైన అడవి వాతావరణం కలిసి ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు ఆహ్లాదకరమైన గమ్యస్థానంగా మార్చుతున్నాయి.

**-రోజురోజుకు పెరుగుతున్న పర్యాటకుల రద్దీ**

ఇటీవలి కాలంలో సబ్బితం జలపాతాన్ని సందర్శించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి కుటుంబ సమేతంగా వందలాది మంది తరలివస్తున్నారు. యువత సెల్ఫీలు, వీడియోలు తీస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుండగా, ఫోటోగ్రాఫర్లు అరుదైన దృశ్యాలను తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. ముఖ్యంగా వారాంతాలు, సెలవు రోజుల్లో సందర్శకుల సందడి మరింత ఎక్కువగా కనిపిస్తోంది.

**-సోషల్ మీడియాలో వైరల్**

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో సబ్బితం జలపాతానికి సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు ఈ ప్రాంతానికి వస్తున్నారు. ప్రకృతి మధ్య ప్రశాంతంగా గడపాలనుకునే వారికి ఇది అనువైన ప్రదేశంగా గుర్తింపు పొందుతోంది.

**-మౌలిక వసతులు కల్పిస్తే మరింత అభివృద్ధి**

జలపాతం వద్ద రహదారుల అభివృద్ధి, పార్కింగ్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి కేంద్రాలు, భద్రతా కంచెలు, దిశా సూచిక బోర్డులు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతులు కల్పిస్తే రాష్ట్ర స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**-జీవవైవిధ్యానికి నిలయం**

సబ్బితం జలపాతం పరిసరాలు జీవవైవిధ్యానికి కూడా నిలయంగా ఉన్నాయి. అడవుల్లో అనేక రకాల వృక్షాలు, ఔషధ మొక్కలు, పక్షులు, చిన్న వన్యప్రాణులు కనిపిస్తాయి. ఈ ప్రాంతాన్ని పర్యావరణ పరంగా సంరక్షించడం అత్యంత అవసరమని ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు.

**-భద్రతపై అప్రమత్తత అవసరం**

వర్షాకాలంలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉండటంతో సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. జారుడు రాళ్లపైకి ఎక్కకూడదని, లోతైన నీటిలోకి దిగరాదని, ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీలు దిగకుండా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు. చిన్నారులను ఎల్లప్పుడూ పెద్దల పర్యవేక్షణలో ఉంచాలని సూచిస్తున్నారు.

**-పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

జలపాతం పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలు, ఇతర చెత్తను పడేయకుండా పరిశుభ్రతను కాపాడాలని స్థానిక యువత పిలుపునిస్తోంది. ప్రకృతి అందాలను ఆస్వాదించడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి పర్యాటకుడి బాధ్యత అని గుర్తుచేస్తున్నారు.ప్రకృతి సోయగాలు, ప్రశాంత వాతావరణం, పెరుగుతున్న పర్యాటకుల ఆదరణతో గౌరీగుండాలసబ్బితం జలపాతం తెలంగాణలో ప్రముఖ ఎకోటూరిజం కేంద్రంగా ఎదిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం, అటవీ శాఖ, పర్యాటక శాఖ సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేపడితే ఈ జలపాతం రాష్ట్ర పర్యాటక పటంలో మరింత ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉంది.

## సెర్ప్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరం..

- **సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు**
- **229 మంది సిబ్బందికి వైద్య పరీక్షలు**
- **యశోద, మ్యాక్స్ విజన్ వైద్యుల సేవలు**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట జూలై 17:(విజన్ ఆంధ్ర) : తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి. దివ్య ఆదేశాల మేరకు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సెర్ప్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు.ఈ శిబిరంలో పాల్గొన్న సిబ్బందికి కార్డియాలజీ, గైనకాలజీ, జనరల్ ఫిజిషియన్ రక్తపోటు, షుగర్, ఈసీజీ, సీబీపీ, లిపిడ్ ప్రొఫైల్, కొలెస్ట్రాల్, క్యాల్షియం, తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు.అలాగే దృష్టి లోపం ఉన్నవారికి నేత్ర వైద్య పరీక్షలు, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్యుల సూచనల చేశారు.ఎరికాన్ టీపీఏ హెల్త్ ఇన్సూరెన్స్ అనుసంధానంతో యశోద హాస్పిటల్స్, మ్యాక్స్ విజన్, పాత్‌కైండ్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించారు.ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో మొత్తం 229 మంది సిబ్బంది పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, డాక్టర్లు శ్వేత, సందీప్, తరిషక్, ఉమాదేవి మెడికల్ సిబ్బంది సంతు దుర్గ అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, మండల సమాఖ్య సిబ్బంది, సెర్ప్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గొర్లకుంట తూము రిపేరు చేసి రైతులను ఆదుకోండి

**యదేచ్ఛగా 30 ఎకరాలు కబ్జాకు గురైన గొర్లకుంట**

బద్వేలు, జూలై 17 (విజన్ ఆంధ్ర) : బద్వేల్ మండలం ఎత్తి రాజు పల్లి గ్రామానికి చెందిన గొర్లకుంట సర్వేనెంబర్ 40/1 లో128 ఎకరాల విస్తీర్ణం కలదు ఈ యొక్క చెరువు కింద ఎత్తి రాజు పల్లె, తిమ్మరాజు పల్లె గ్రామాలకు చెందిన రైతుల భూములు సుమారు 150 ఎకరాల పారుదల కలదు అలాంటి చెరువుకు సంబంధించి తూము సుమారు గత ఐదు సంవత్సరాలు నుండి విరిగిపోయి పూర్తిగా పనిచేయకపోవడంతో రైతులు పైరు పండించుకొనుటకు అనేక ఇబ్బందులకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయిన ఏ మాత్రం పట్టించుకోక పోవడంతో పై రెండు గ్రామాలకు చెందిన రైతులు పంట పండించుకొనుటకు చెరువులో నీరు లేకుండా పోతుంది. అందువలన రైతులు పైరు పెట్టుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అదేవిధంగా తెలుగు గంగ నుంచి వచ్చే నీటిని కూడా మేము తూము సరిగా లేకపోవడంతో వాటిని కూడా వినియోగించుకోలేక నష్టపోతున్నామని ఎత్తి రాజుపల్లె గ్రామానికి చెందిన రైతులు నాగేండ్ల వెంకటసుబ్బారెడ్డి, శనివారపు రామిరెడ్డి, శనివారపు వెంకటసుబ్బారెడ్డి, బుసగాని చెన్నయ్య, ఎఱ్ర చెన్నయ్య, లగసాని చిన్నయ్య, దుంపల గంగిరెడ్డి,వారి ఆవేదన వ్యక్తం చేశారు ఈ విషయమై ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ కూడా ఏమాత్రం స్పందించలేదని వారన్నారు అదేవిధంగా మా గ్రామానికి చెందిన గొర్లకుంట ను ఎత్తి రాజు పల్లె కు చెందిన ఎఱ్రగోళ్ల రామసుబ్బయ్య, కుంభగిరి శ్రీను, కుంభగిరి నాగయ్య, దుంపల శ్రీనివాస్ రెడ్డి,ఒక్కొక్కరు నాలుగు ఎకరాలు చొప్పున చెరువును ఆక్రమించి బోర్లు వేసుకుని కబ్జాకు పాల్పడ్డారని ఇప్పుడు మా గ్రామం రీ సర్వే జరుగుతున్నందున మా గ్రామ చెరువు అయిన గొర్లకుంటను పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి భూ కబ్జాదారుల నుండి భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరారు







మా గ్రామానికి చెందిన గొర్లకుంటను కబ్జాకోరుల నుండి పూర్తిస్థాయిలో కాపాడాలని అదేవిధంగా మా చెరువు సంబంధించి తూమును సంబంధిత అధికారులు తొందరగా రిపేరు చేసి రైతులు సకాలంలో పంటలు పండించుకొనుటకు సహాయపడాలని అధికారులను కోరుచున్నాము

**- శనివారపు. రామిరెడ్డి**



మా రెండు గ్రామలలో సుమారు 150 ఎకరాలు పారుదల ఉన్నదని తూము గత ఐదు సంవత్సరాల క్రితం పూర్తిగా పాడై పడిపోవడంతో చెరువు లు నీళ్లు నిలబడక పోవడంతో రైతులు పైర్ లు పెట్టుకొనుటకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము, అదేవిధంగా చెరువు కబ్జా కు గురి కావడంతో రైతులకు సరిపడా నీళ్లు చెరువులు నిలబడడం లేదు కావున అధికారులు వెంటనే స్పందించి తూము రిపేర్ చేసి కబ్జాదారుల నుండి భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుచున్నాము

**- శనివారపు. వెంకటసుబ్బారెడ్డి**



మా గ్రామానికి చెందిన కొంతమంది మా చెరువు అయినా గొర్లకుంటను పూర్తిగా ఆక్రమించుకొని కబ్జాకు పాల్పడడంతో చెరువు పూర్తిగా కుషించుకుపోయి నీరు నిలువక రైతులు పంటలు పండించుటకు సరిపడా నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము కావున వెంటనే సంబంధిత అధికారులు చెరువును పూర్తిస్థాయిలో కొలతలు వేసి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోనీ వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము

**- నాగేండ్ల .వెంకటసుబ్బారెడ్డి**

# నో కన్ఫ్యూజన్.. నో టెన్షన్!!

## ఎస్.ఐ.ఆర్. ఫారం నింపడం ఈజీ

- **మీ ఓటు భద్రం, ఇప్పుడే చెక్ చేసుకోండి**
- **పాత డేటా లేదని దిగులు వద్దు**
- **మార్పు కోసం మీ ఓటు హక్కును వదులుకోవద్దు**
- **డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లకే కత్తెర**
- **జెన్యూన్ ఓటర్లకు ఇక ఫుల్ భరోసా**
- **గందరగోళం వీడండి, జాబితాలో మీ పేరు చూసుకోండి**

*గందరగోళం వీడండి, గతం వివరాలు లేదని దిగులు పడకుండా ఓటరు జాబితాలో మీ పేరు చూసుకోండి! నకిలీ ఓట్లకే కత్తెర తప్ప.. నిజమైన ఓటర్లందరికీ ఈ వ్యవస్థ పనితీరుపై "విజన్ ఆంధ్ర" స్పెషల్ స్టోరీ*





**హైదరాబాద్, జూలై 17:**

ఓటర్ లిస్ట్‌లు, ఫామ్‌లు అనగానే చాలామందికి "అబ్బ.. ఆ గందరగోళం మాకొద్దు బాబోయ్" అనిపిస్తుంది కదూ? కానీ ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి ప్రజాస్వామ్యంలో మీ గొంతుక మీ ఓటు. అందుకని అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, ఏ కన్ఫ్యూజన్ లేకుండా మ్యాటర్ చాలా సింపుల్‌గా, ఆధునిక శైలిలో ఇక్కడ స్పష్టంగా ఇచ్చేస్తున్నాం. ఒకసారి లుక్కేయండి!

మీ ఓటరు గుర్తింపు స్థితి: ఏ నిలువు వరుస (కాలమ్) ఏం చెబుతోంది?

ఓటరు జాబితాను పరిశీలించేటప్పుడు మీరు చూడాల్సిన ముఖ్యమైన సమాచారం ఇదిగో:




క్రమ సంఖ్య:
పోలింగ్ కేంద్రంలో మీ నంబర్ ఎంతో చెప్పే గుర్తింపు.
ఓటరు పేరు:
మీ పేరు అక్షర దోషాలు లేకుండా కరెక్ట్‌గా ఉందో లేదో చూసుకోవాలి.
తండ్రి/భర్త పేరు:
మీ కుటుంబ వివరాల నమోదు.
వయస్సు / లింగం:
మీ ప్రస్తుత వయస్సు సరిగ్గా నమోదయిందా లేదా?
పోలింగ్ కేంద్రం:
మీరు ఎక్కడికి వెళ్లి ఓటు వేయాలో చెప్పే చిరునామా.
ఓటరు కార్డు సంఖ్య (ఎపిక్ నంబర్):
మీ ఓటరు కార్డ్ పైన ఉండే ప్రత్యేక గుర్తింపు సంఖ్య.

ఒక్క నిమిషం.. పాత సమాచారం లేదా? అస్సలు దిగులు పడకండి!

గతంలో ఓటు ఉందో లేదో తెలియదు.. పాత సమాచారం వెతుక్కునే ఓపిక లేదు" అని దిగులు పడాల్సిన అవసరమే లేదు! ఒకవేళ మీ పాత సమాచారం అందుబాటులో లేకపోయినా, ఇప్పుడు సరికొత్తగా, డిజిటల్ పద్ధతిలో చాలా సులువుగా కొత్త ఓటు నమోదు (ఫామ్ 6 ద్వారా) చేసుకోవచ్చు. గతం గతః.. ఇప్పుడు మీ ఓటు హక్కును సాధించుకోవడమే ముఖ్యం!

ఎస్ఐఆర్ ఫారం ఇలా నింపండి

మీ ప్రాంత బీఎల్ఓ వద్ద లభించే ఫారమ్‌ను నింపేటప్పుడు కొత్త ఓటర్లు అయితే ఫారం-6ని, గతంలోనే ఓటు ఉండి మార్పులు లేదా బదిలీలు (మ్యాపింగ్) కావాలనుకునే వారు ఫారం-8ని ఎంచుకోవాలి; ముందుగా ఫారమ్‌పై మీ నియోజకవర్గం పేరు రాసి, నిర్దేశిత స్థలంలో కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను అతికించాలి. కొత్త ఓటర్లు తమ పేరు, ఇంటి నంబర్, పుట్టిన తేదీ మరియు మొబైల్ నంబర్‌ను స్పష్టంగా నింపుతూ, వాటికి మద్దతుగా ఆధార్ కార్డ్, వయస్సు మరియు నివాస ధృవీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులను జత చేయాలి. గత ఓటర్లు తమ పాత నియోజకవర్గం లేదా పోలింగ్ బూత్ నుండి ప్రస్తుత నివాసానికి పూర్తి మ్యాపింగ్ (చిరునామా మార్పు) చేసుకోవడానికి, తమ పాత ఓటరు కార్డు (EPIC) సంఖ్యను ఫారమ్‌లో తప్పనిసరిగా నమోదు




చేస్తూ, ప్రస్తుత నివాస రుజువును జతపరచాలి. కుటుంబంలోని మిగిలిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ బూత్ పరిధిలోకి వచ్చేలా (ఫ్యామిలీ మ్యాపింగ్ కోసం) ఫారమ్‌లోని సంబంధిత కాలమ్‌లో కుటుంబ సభ్యుల ఓటరు కార్డ్ నంబర్లను స్పష్టంగా రాయడం ఎంతో ముఖ్యం. చివరగా, గతంలో మరెక్కడా ఓటు లేదని లేదా పాత ఓటును బదిలీ చేస్తున్నామని నిర్ధారిస్తూ డిక్లరేషన్ కాలమ్‌లో తేదీ, స్థలం రాసి సంతకం చేసి బీఎల్ఓకి అందిస్తే, పాత-కొత్త ఓటర్ల పూర్తి మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తవుతుంది.

జాబితా శుద్ధీకరణ:లి తొలగింపులు దేనికి మాత్రమే?

ఓటర్ లిస్ట్ క్లీన్ చేయడం అంటే అర్హులైన వారిని తీసేయడం కాదు. కింది రెండు సందర్భాల్లో మాత్రమే ఓట్లు తొలగించబడతాయి:

రెండేసి ఓట్లు (డబుల్ ఓట్లు):
ఒకే వ్యక్తికి రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఓట్లు ఉంటే, ఒకటి మాత్రమే ఉంచి రెండోది తొలగిస్తారు.
మరణించిన వారి ఓట్లు:
అక్రమ ఓట్లను అరికట్టడానికి మరణించిన వారి వివరాలను జాబితా నుండి తొలగిస్తారు.

కాబట్టి నిజాయితీ గల ఏ ఓటరు కూడా భయపడాల్సిన పనే లేదు. మీ ఓటు ఎక్కడికీ పోదు.

యువత, పౌరులారా..!!

ఇంకా ఆలస్యం ఎందుకు?

మీ ప్రాంతం అభివృద్ధి అవ్వాలన్నా, మీ సమస్యలపై ప్రశ్నించే హక్కు మీకు దక్కాలన్నా.. దానికి మొదటి మెట్టు మీ ఓటు.

ఆఫీసుల చుట్టూ తిరిగే రోజులు పోయాయి, మీ స్మార్ట్‌ఫోన్ తీయండి. ఓటరు హెల్ప్‌లైన్ యాప్ లేదా లిజశీవతీం.వఱఅ.ప్రశీజ.అలలి వెబ్‌సైట్‌లోకి వెళ్ళండి. మీ పేరు ఉందో లేదో కేవలం 2 నిమిషాల్లో చెక్ చేసుకోండి. లిగుర్తుంచుకోండిలి ఓటు వేయకపోవడం అంటే మన భవిష్యత్తును వేరే వాళ్ల చేతుల్లో పెట్టడమే. బాధ్యత గల పౌరుడిగా ఇప్పుడే అలర్ట్ అవ్వండి.. మీ ఓటును భద్రం చేసుకోండి.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# వెల్దండలో దారుణం

# ఇద్దరు చిన్నారులను సంపులో వేసి తల్లి ఆత్మహత్య

- **పోతేపల్లి గ్రామంలో విషాదం**
- **ఒక్కసారిగా ముగ్గురి మృతి**
- **ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకొని ఘటన...**
- **కుటుంబ కలహాలా? ఇతర కారణాలా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు..**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 18 (విజన్ ఆంధ్ర) : నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండలం పోతేపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘటన గ్రామస్తులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒక తల్లి తన కడుపున పుట్టిన ఇద్దరు చిన్నారులను నీటి సంపులో పడేసి, తాను కూడా అందులోకి దూకి ప్రాణాలు తీసుకుంది.

**ఘటన వివరాలు:**

పోతేపల్లి గ్రామానికి చెందిన ఎనుముల శిరీష (23) కు స్థానికుడైన మహేష్ తో 4 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె మాన్యశ్రీ (3 సంవత్సరాలు), కుమారుడు వర్షిత్ (4 నెలలు) ఉన్నారు. కుటుంబం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో భర్త మహేష్ మరియు ఇతర



కుటుంబ సభ్యులు పనుల నిమిత్తం బయటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిరీష తన ఇద్దరు పిల్లలను ఇంటి వద్ద ఉన్న నీటి సంపులోకి తీసుకెళ్లి పడేసింది. అనంతరం తాను కూడా అందులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. చాలా సేపటి వరకు ఇంటి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చిన పొరుగువారు ఇంటికి వెళ్లి చూడగా సంపులో ముగ్గురి మృతదేహాలు తేలుతూ కనిపించాయి. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**పోలీసుల దర్యాప్తు:**

సమాచారం అందుకున్న వెంటనే లివెల్దండ ఎస్సై యుగంధర్ రెడ్డిలి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను వెలికి తీసి వివరాలు సేకరించారు. అనంతరం ముగ్గురి మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై తెలిపారు. కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిడి, ఆర్థిక సమస్యలు ఇలా అన్ని కోణాల్లో విచారిస్తున్నామని, పోస్టుమార్టం రిపోర్ట్ మరియు కుటుంబ సభ్యుల వాంగ్మూలాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**గ్రామంలో విషాదం:**

ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో పోతేపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, తదుపరి ఆదేశాల మేరకు దర్యాప్తు కొనసాగుతుందని ఎస్సై యుగంధర్ రెడ్డి తెలిపారు.



EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.